ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 43 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ గురువారం 25 డిసెంబర్ 2025 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 43 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD THU 25 DECEMBER 2025 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఇండిగో సంక్షోభం తర్వాత కేంద్రం కీలక నిర్ణయం:
# మూడు కొత్త ఎయిర్‌లైన్స్‌కు గ్రీన్ సిగ్నల్

- దేశీయ విమానయాన రంగంలోకి మూడు కొత్త సంస్థలు
- శంఖ్ ఎయిర్, అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్‌కు ఎన్‌ఓసీలు జారీ
- ఇటీవలి ఇండిగో సంక్షోభం నేపథ్యంలో పెరిగిన పోటీ ఆవశ్యకత
- విమానయాన రంగంలో గుత్తాధిపత్యాన్ని తగ్గించేందుకు కేంద్రం చర్యలు
- మరిన్ని సంస్థలను ప్రోత్సహిస్తున్నామని మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి



వివరాలు 2లో..

# అరుణాచల్ చైనా 'కోర్ ఇంట్రెస్ట్'లో భాగమే

- నాయకత్వ పరిధిని మరింత విస్తరించాలని చైనా భావిస్తున్నట్లు తెలిపిన పెంటగాన్
- తైవాన్, సెంకాకులతో పాటు అరుణాచల్ ప్రదేశ్‌లు బీజింగ్ ప్రణాళికల్లో భాగమని వెల్లడి
- చైనా జాతీయ పునరుజ్జీవానికి ఈ భూభాగాలు కీలకమని చైనా భావిస్తోందని నివేదిక

**హైదరాబాద్ పెన్ పవర్:**అరుణాచల్ ప్రదేశ్ తమకెంతో ముఖ్యమని, రాజీపడని ప్ర యోజనాల్లో ఒకటని చైనా భావిస్తోందని అమెరికా కాం గ్రెస్‌కు సమర్పించిన నివేదికలో పెంటగాన్ పేర్కొంది. 2049 నాటికి జాతీయ పునరుజ్జీవనాన్ని సాధించాలనే లక్ష్యంతో చైనా ఉందని నివేదిక వెల్లడించింది. అంతేకా కుండా, చైనా తన నాయకత్వ పరిధిని విస్తరించాలని భావిస్తున్నట్లు

వివరాలు 2లో..



# కొత్త సర్పంచ్‌లకు తీపి కబురు..
## గ్రామాలకు ప్రత్యేకంగా రూ.10లక్షలు

- సర్పంచ్‌లకు నేరుగా ప్రత్యేక అభివృద్ధి నిధులు ఇస్తామన్న సీఎం రేవంత్
- పెద్ద గ్రామాలకు రూ.10 లక్షలు, చిన్న గ్రామాలకు రూ.5 లక్షలు ప్రకటన
- అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని హామీ
- పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి



**హైదరాబాద్ పెన్ పవర్:** కొడంగల్ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లకు తీపి కబురు చెప్పారు. గ్రామాల అభివృద్ధి కోసం ఇకపై సర్పంచ్‌లకు నేరుగా నిధులు అందిస్తామని ప్రకటించారు. పెద్ద గ్రామాలకు రూ. 10 లక్షలు, చిన్న గ్రామాలకు రూ. 5 లక్షలు చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నిధులు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల జోక్యం లేకుండా నేరుగా గ్రామ పంచాయతీలకు అందుతాయని

వివరాలు 2లో..



## హాస్టల్ విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన ఉప ముఖ్యమంత్రి

- ఖమ్మంలో గిరిజన సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన మంత్రి
- వసతి సౌకర్యాలు, బోధన నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించిన మల్లు భట్టి విక్రమార్క
- విద్య, వైద్యం, సంక్షేమ రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం శ్రద్ధతో ముందుకు సాగుతోందని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఖమ్మం జిల్లాలో విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ రోజు ఆయన జిల్లాలోని వైరా నియోజకవర్గం, కొనిజర్ల మండలంలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా సందర్శిం చారు.ఆయన వసతి సౌకర్యాలు, బోధన నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాల అభివృద్ధి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ముందుకు సాగుతోందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.




## కేసీఆర్ కుటుంబాన్ని మళ్లీ అధికారంలోకి రానివ్వం..
# ఇదే నా శపథం

- కొడంగల్ బిడ్డగా ఇదే గడ్డ మీద నుంచి చెబుతున్నానని సవాల్
- బీఆర్ఎస్ గతం కాంగ్రెస్ భవిష్యత్తు అన్న రేవంత్ రెడ్డి
- కేసీఆర్ నన్ను జైలుకు పంపించి నా కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టాడని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:**కొడంగల్ బిడ్డగా ఇదే గడ్డ మీది నుంచి ఒక మాట చెబుతున్నానని, తాను రాజకీయాల్లో ఉన్నంత వరకు కేసీఆర్ సహా కల్వకుంట్ల కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వనని, ఇదే తన శపథమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి రానివ్వనని, ఇదే తన సవాల్ అన్నారు.
ఇక బీఆర్ఎస్ గతమేనని, భవిష్యత్తు కాంగ్రెస్ మాత్రమే అన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 80కి పైగా సీట్లు సాధిస్తుందని, నియోజకవర్గాల పునర్విభజన జరిగి 153 అయితే 100కు పైగా స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. "రాసిపెట్టుకోండి. రెండోసారి కాంగ్రెస్ పాలనను తీసుకువస్తాం. ఇదే నా సవాల్" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. పదేళ్లలో కేసీఆర్ ఏ ప్రాజెక్టును పూర్తి చేయలేదని ముఖ్యమంత్రి విమర్శించారు.
కేసీఆర్ తనను జైలుకు పంపించాడని, తన కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టాడని రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ తనపై విమర్శలు చేస్తూ తోలు తీస్తానని హెచ్చరించారని, కానీ మా సర్పంచ్‌లు చింతమడకలో మిమ్మల్ని చీరి చింతాకు



వివరాలు 2లో..

## జీహెచ్‌ఎంసీ చట్ట సవరణపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు




**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) చట్ట సవరణపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పలు మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తూ జారీ చేసిన ఆర్డినెన్స్‌పై కౌంటర్ దాఖలు చేయాలని

వివరాలు 2లో..



# ఆకాశమే హద్దు
## ఇస్రో 'బాహుబలి' ఘనవిజయం!

- నింగిలోకి అతిపెద్ద కమ్యూనికేషన్ శాటిలైట్
- అంతరిక్షం నుంచి నేరుగా మొబైల్‌కు ఇంటర్నెట్
- ఢీకొనే ముప్పు తప్పించేందుకు 90 సెకన్ల పాటు నిలిపివేత
- తర్వాత విజయవంతంగా ప్రయోగం

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో మైలురాయిని అధిగమించింది. తన అత్యంత శక్తిమంతమైన 'బాహుబలి' రాకెట్ ఎల్వీఎం3-ఎం6 ద్వారా అమెరికాకు చెందిన 'బ్లూబర్డ్ 6' (బ్లూబర్డ్ బ్లాక్-2 ఎఫ్ఎం1 6) ఉపగ్రహాన్ని బుధవారం విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి జరిగిన ఈ ప్రయోగం భారతీయ అంతరిక్ష రంగ చరిత్రలో అతిపెద్ద వాణిజ్య విజయంగా నిలిచిపోయింది. ఉదయం 8:55 గంటలకు రెండో లాంచ్ ప్యాడ్ నుంచి 43.5 మీటర్ల ఎత్తున్న ఎల్వీఎం3 రాకెట్ గంభీరంగా నింగిలోకి ఎగిసింది. ప్రయాణం మొదలైన 15 నిమిషాలకే లక్ష్యానికి చేరుకుని, భూమికి 520 కిలోమీటర్ల ఎత్తులో ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టింది. 6,100 కిలోల బరువున్న ఈ బ్లూబర్డ్ ఉపగ్రహం భారత గడ్డపై నుండి ప్రయోగించిన అత్యంత భారీ

వివరాలు 2లో..

## కారు గుర్తు లేని సర్పంచ్ ఎన్నికల్లోనే
# 4 వేల స్థానాల్లో గెలిచాం

- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలంటే రేవంత్ రెడ్డికి వణుకు అన్న హరీశ్ రావు
- పంచాయతీ ఎన్నికల్లో కూడా ముఖ్యమంత్రి ప్రచారం చేశారన్న హరీశ్ రావు
- 90 శాతం వరకు గెలవాల్సిన అధికార పార్టీ 64 శాతమే గెలిచిందన్న మాజీ మంత్రి

వివరాలు 2లో..



## ఫిరాయింపులపై చర్చల నడుమ
# దానం నాగేందర్ కీలక ప్రకటన

- తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని దానం నాగేందర్ స్పష్టీకరణ
- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తనకు సమాచారం లేదన్న దానం
- జీహెచ్‌ఎంసీలో కాంగ్రెస్, ఎంఐఎం కూటమి విజయం సాధిస్తుందని ధీమా

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల చర్చలు ముదురుతున్న వేళ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక ప్రకటన చేశారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని స్పష్టం చేసిన ఆయన, ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎవరు? వారు ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారు?


వివరాలు 2లో..



## హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు..
# మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అరెస్ట్


- హైదరాబాద్‌లో డ్రగ్స్ పెడ్లింగ్ ముఠా అరెస్ట్
- డ్రగ్స్ విక్రయంలో మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కీలక పాత్ర
- డార్క్ వెబ్, క్రిప్టోకరెన్సీ ద్వారా లావాదేవీలు
- యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగంపై పోలీసుల ఆందోళన

వివరాలు 2లో..




## ఆరావళి మైనింగ్‌పై వెనక్కి తగ్గిన కేంద్రం..
# రాష్ట్రాలకు కీలక ఆదేశాలు

- ఆరావళి పర్వతాల్లో కొత్త మైనింగ్ లీజులపై పూర్తి నిషేధం విధించిన కేంద్రం
- రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆదేశాలు



- ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు విస్తరించిన పర్వతశ్రేణికి వర్తింపు
- సుస్థిర మైనింగ్ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపకల్పనకు ఐసీఎఫ్ఆర్ఈకి బాధ్యత
- ఇప్పటికే ఉన్న గనులపై మరింత కఠిన నిబంధనలు అమలు

వివరాలు 2లో..



## కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు..
# తీవ్రంగా స్పందించిన కేటీఆర్

- ముఖ్యమంత్రి అహంకారంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం
- 2028లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు బొందపెట్టడం ఖాయమన్న కేటీఆర్
- నీటి ద్రోహంపై సమాధానం చెప్పలేక ఇష్టారీతిన మాట్లాడుతున్నారని ధ్వజం

వివరాలు 2లో..

# ఎడిటర్ వ్యూ

## సంక్షేమ రథం.. అభివృద్ధి పథం

అభివృద్ధి, సంక్షేమం అనే మాటలను రోజూ నేతల నోట మనం వింటున్నాం. అలాగే, ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయనో లేక సంక్షేమం పేరుతో ఖజానాను గుల్లచేసి, అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నాయనే వాదనలూ మన చెవినపడుతూనే ఉంటాయి. అయితే, సంక్షేమం, అభివృద్ధి అనేవి రెండు వేర్వేరు అంశాలు. ఇవి ఒకదానితో ఒకటి పోటీపడే అంశాలు కావు. అవి పరస్పరాధారితాలు. సంపూరకాలు. సంక్షేమం అనేది కాలక్రమంలో అభివృద్ధికి దారితీస్తుంది. ప్రజల ఆర్థిక పరిస్థితిని, జీవన ప్రమాణాలను తర్వాతి స్థాయికి తీసుకుపోతుంది.సరైనదిశగా దీనిని అమలు చేస్తే, కాలక్రమంలో ఇక.. సంక్షేమ కార్యక్రమాలతో పనిలేని సమాజం ఏర్పడుతుంది. తొలిదశలో ప్రాథమిక అవసరాలైన కూడు, గూడు, గుడ్డ వంటివి సమకూర్చటం, తర్వాతి దశలో విద్య, వైద్య సౌకర్యాలు అందించడం ద్వారా పౌరుల ఆర్థిక, సామాజిక స్థితి దిగజారకుండా చూస్తూనే, కొంతకాలానికి వాటిని మెరుగుపడేలా చేయటమే సంక్షేమం అసలైన అర్థం. పౌరులకు కనీస అవసరాలు, విద్య, వైద్యంతో బాటు తగిన ఉపాధి, కనీస విరామం, వినోదాలను అందిస్తే వచ్చే సానుకూల ప్రగతినే ఆర్థికవేత్తలు.. అభివృద్ధి అంటున్నారు. అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యతను పాటిస్తూ ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవటమే ఇప్పుడు వాటికి పెద్ద కసరత్తుగా మారుతోంది. మనదేశంలో కొన్ని పార్టీలు రాజకీయ లబ్ధి కోసం కొన్ని అనవసర పథకాలను అమలు చేస్తున్నాయి. ముఖ్యంగా అధికార పార్టీలు ఎన్నికల వేళ.. ఓట్ల కోసం హడావుడిగా ఆయా పథకాలను అమలు చేసిన ఘటనలు గతంలో, వర్తమానంలోనూ చాలానే ఉన్నాయి. ఓటర్లను ఏమార్చుతూ, ఓట్లు రాల్చుకునేందుకు ఆయా పార్టీలు ప్రజలు పన్నులుగా కట్టిన డబ్బును స్వలాభం కోసం పథకాలకు వెచ్చించటం ఖచ్చితంగా అభ్యంతరకరమే. వాటిని ఉచితాలు అనటంలో తప్పులేదు. కానీ, ఒక నిర్దిష్టమైన సామాజిక, ఆర్థిక ప్రగతిని సమాజంలో తీసుకొచ్చేందుకు, నిపుణులతో చర్చించి, ఒక స్పష్టతతో, పథకాల లక్ష్యాలను ముందుగా నిర్దేశించుకుని, ఎన్నికలకు ముందే తమ పథకం లక్ష్యం, దానిని అమలుచేసే మార్గం గురించి నిర్దిష్టంగా ప్రజలకు ముందే చెబితే వాటిని ఉచిత పథకాలు అనలేము. పైగా, మన రాజ్యాంగం పౌరులకు సంక్షేమ రాజ్యమనే హామీనిచ్చింది. మన రాజ్యాంగంలోని 14వ అధికరణ సమానత్వపు హక్కును ప్రతిపాదించగా, 38వ అధికరణ పౌరులందరికీ సమాన అవకాశాలను ఇచ్చేలా పూచీపడింది. మన దేశంలోని ఆర్థిక అసమానతల గురించి, వాటికి గల చారిత్రక, ఆర్థిక, సామాజిక నేపథ్యాల గురించి, ఈ అసమానతలను సరిదిద్దటానికి రాజ్యం.. ఏ విధంగా సంక్షేమంపై దృష్టిపెట్టాలనే అంశాలను నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ తన 'అన్సర్టెన్ గ్లోరీ: ఇండియా అండ్ ఇట్స్ కాంట్రడిక్షన్స్'అనే పుస్తకంలో వివరంగా రాశారు. ఇందులో పలు రాష్ట్రాల అభివృద్ధి నమూనాలను సేన్ చర్చించారు. తమిళనాడు ఇతర రాష్ట్రాల కంటే ఎందుకు, ఏ రంగాలలో ముందున్నదనే విషయాన్ని ఆయన గణాంక సైతంగా చెప్పుకొచ్చారు. దేశ ఆర్థిక ప్రగతి తీవ్ర మందగమనంలో ఉన్నప్పుడూ.. తమిళనాడు వృద్ధి బాటలోనే పయనించిందని సేన్ ప్రశంసించారు. దేశం మొత్తంలో తయారీ రంగంలో గుజరాత్ ముందంజలో ఉన్నప్పటికీ, అభివృద్ధి పంపిణీ, మానవ వనరుల అభివృద్ధిలో బాగా వెనకబడి ఉందని, కేరళ మానవ వనరుల అభివృద్ధిలో ముందంజలో ఉన్నా.. తయారీ రంగం, ఐటిలో బాగా వెనుకబడిందని వివరించారు. కానీ, అన్ని రంగాలలో సంతులిత అభివృద్ధి సాధించిన ఏకైక రాష్ట్రంగా తమిళనాడు నిలిచిందని, ఇదంతా తమిళనాడు పాలకులు ఆచరించిన రాజకీయ సిద్ధాంతం చలువేనని ఆయన విశ్లే షించారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఆ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని, గ్రామీణ స్థాయినుంచే ఉచిత వృత్తి విద్యకు ప్రాధాన్యతనిచ్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఇక.. సంక్షేమ పథకాలను 'ఉచితాలు' అంటూ ఎద్దేవా చేస్తూ.. వాటి సామాజిక, ఆర్థిక ప్రయోజనాలను తక్కువ చేసి చూపే ప్రయత్నాలూ జరుగుతున్నాయి. ప్రజల సొమ్మును మిఠాయిలుగా పంచుతున్నారని వాదించేవారు మన ప్రభుత్వాలు కట్టించిన ఉచిత టాయిలెట్లు, అందించిన గ్యాస్ కనెక్షన్లు, గృహ పథకాలూ అలాంటివేనని చెప్పగలరా? అంటే.. లేదు అనే సమాధానమే వస్తుంది. ఉచితాలు, అనుచితాల విషయంలో తార్కికమైన చర్చ కంటే.. రాజకీయ విమర్శలు అధికం కావటంతో మన పథకాలలో ఏవి ఉచితాలు, ఏవి అనుచితాలనేది నిర్దిష్టంగా గీతగీసినట్లు వేరుచేయటం కష్టంగామారుతోంది. బీహార్, మధ్యప్ర దేశ్ రాష్ట్రాల్లో ప్రభుత్వ స్కూలులో చదివే బాలికలకు సైకిళ్ల పంపిణీ జరుగుతోంది. తమిళనాడులో గతంలో 'అమ్మ'క్యాంటీన్లు, వర్తమానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 'అన్న' క్యాంటీన్లు నడుస్తున్నాయి. ఈ పథకాలన్నీ మంచి ఫలితాలను రాబట్టాయని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. బీహార్‌లో సైకిళ్ల మూలంగా బాలికా విద్య పెరిగింది. పొరుగూళ్లకువెళ్లి చదువుకునే వీలు.. వారికి స్వేచ్ఛనూ ఇచ్చింది. అన్న క్యాంటీన్ల మూలంగా పట్టణ, నగర ప్రాంతాలలోని వీధి వ్యాపారులు, శ్రామిక వర్గం వేళకింత చౌకగా పొట్ట నింపుకుంటున్నారు. ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఇచ్చిన ఉచితవిద్యుత్ ఉన్నత, మధ్యతరగతికి కంటగింపుగా ఉన్నప్ప టికీ, దేశరాజధానిలో ఈ వర్గాలకు సేవలందించే లక్షలాది పేద, అసంఘటిత రంగ కార్మికులకు మేలు జరిగింది. తెలంగాణలో ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్‌టిసి ప్రయాణం విషయంలోనూ పేద, దిగువ మధ్యతరగతి శ్రామిక వర్గాలకు కలుగుతున్న మేలును నేడు ప్రత్యక్షంగా చూస్తున్నాం.ఏది సంక్షేమ పథకం? ఏది ఉచితం? అనే విషయంలో సామాన్యులతో పోల్చితే కంటే సామాజికవేత్తలు, ఆర్థికవేత్తల దృష్టికోణం భిన్నంగా ఉంది. వ్యక్తి ప్రయోజనం 'కంటే సామాజిక ప్రయోజనం చేకూర్చే విద్య, ఆరోగ్య సేవలు పౌరులకు ఉచితంగా లభిస్తే, దీర్ఘకాలంలో వాటి ఫలితం ఉంటుందని వారి వాదన. ఉచితాలపై గతంలో సుప్రీంకోర్టులో దాఖలైన కేసు విచారణ సమయంలో నాటి చీఫ్ జస్టిస్ ఎన్.వి రమణ మాట్లాడుతూ.. 'ఒక క్షురకునికి షేవింగ్ కిట్, ఒక విద్యార్థికి సైకిల్, గీత కార్మికులకు అవసరమైన పనిముట్లు, రజకునికి ఇస్త్రీ తయారీ రంగంలో గుజరాత్ ముందంజలో ఉన్నప్పటికీ, అభివృద్ధి పంపిణీ, మానవ వనరుల అభివృద్ధిలో బాగా వెనకబడి ఉందని, కేరళ మానవ వనరుల అభివృద్ధిలో ముందంజలో ఉన్నా.. తయారీ రంగం, ఐటిలో బాగా వెనుకబడిందని వివరించారు. మన స్వరాజ్య పోరాట లక్ష్యం కేవలం స్వాతంత్ర్యాన్ని పొందటమే కాదు. ఒక సర్వసత్తాక, సంక్షేమ, స్వావలంబన గల దేశంగా దీనిని మలచటం కూడా. కనుక, ఉమ్మడి అవసరాల్ని తీర్చటానికి పౌరులు ఏర్పరుచుకున్న పాలనా వ్యవస్థలు.. తమ రాజకీయ అధికారం కోసం అసలు లక్ష్యాన్ని పణంగా పెట్టి పౌరులు పేదలను తాత్కాలికంగా సంతోషపెట్టినా దీర్ఘకాలంలో నష్టపోయేది పేదలేనని వాస్తవాన్ని ఎరుకలో ఉంచుకుంటూ పథకాల రూపకల్పన చేయాలి. సకల జనులకు స్వాతంత్ర ఫలాలు అందే వరకు అవసరమైన మేర సంక్షేమం అందించాల్సిన బాధ్యత నుంచి మన ప్రభుత్వాలు వైదొలగకుండా చూడాల్సిన బాధ్యత పౌరసమాజం మీదే ఉంది.

## ఇండిగో సంక్షోభం తర్వాత కేంద్రం కీలక నిర్ణయం: మూడు కొత్త ఎయిర్‌లైన్స్‌కు గ్రీన్ సిగ్నల్

దేశీయ విమానయాన రంగంలో సంచలనం సృష్టించిన ఇండిగో సంక్షోభం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది. విమానయాన మార్కెట్లో పోటీని పెంచి, రెండు ప్రధాన సంస్థల ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసే దిశగా మరో మూడు కొత్త ఎయిర్‌లైన్స్ ప్రవేశానికి మార్గం సుగమం చేసింది. శంఖ్ ఎయిర్, అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్ అనే మూడు సంస్థలకు నిరభ్యంతర పత్రాలు (చీూజం) జారీ చేసినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. ఈ నెల ఆరంభంలో కొత్త ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ (ఖీఱూ) నిబంధనల కారణంగా ఇండిగో ఎయిర్‌లైన్స్ తీవ్రమైన సిబ్బంది కొరతను ఎదుర్కొంది. ఫలితంగా, కేవలం వారం రోజుల్లోనే 5,000కు పైగా విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చింది. ఈ పరిణామం దేశవ్యాప్తంగా ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా, దేశీయ విమానయాన రంగంలో కేవలం ఒకటి, రెండు సంస్థలపై ఆధారపడటంలోని ప్రమాదాలను బహిర్గతం చేసింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కొత్త సంస్థలను ప్రోత్సహించేందుకు వేగంగా అడుగులు వేసింది.

### మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటన

ఈ విషయాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా వెల్లడించారు. "గత వారం రోజులుగా భారత గగనతలంలోకి అడుగుపెట్టాలని ఆశిస్తున్న శంఖ్ ఎయిర్, అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్ బృందాలతో సమావేశమవడం సంతోషంగా ఉంది. శంఖ్ ఎయిర్‌కు ఇప్పటికే ఎన్‌ఓసీ లభించగా, అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్‌లకు ఈ వారం ఎన్‌ఓసీలు మంజూరు చేశాం," అని ఆయన తెలిపారు.

ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత విమానయాన మార్కెట్లో మరిన్ని సంస్థలను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "ప్రధానమంత్రి మోదీ విధానాల మేరకు, ఉడాన్ వంటి పథకాల ద్వారా ఇప్పటికే స్టార్ ఎయిర్, ఇండియా వన్ ఎయిర్, ఫ్లై91 వంటి చిన్న సంస్థలు ప్రాంతీయ కనెక్టివిటీలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ రంగంలో వృద్ధికి ఇంకా ఎంతో అవకాశం ఉంది," అని రామ్మోహన్ నాయుడు వివరించారు.

### కొత్త సంస్థల వివరాలు

**శంఖ్ ఎయిర్:** ఉత్తరప్రదేశ్ కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభించనుంది. లక్నో హబ్‌గా వారణాసి, గోరఖ్‌పూర్, అయోధ్య, ఇండోర్ వంటి నగరాలకు బోయింగ్ 737-800 విమానాలతో సేవలు అందించాలని యోచిస్తోంది. 2026 ప్రథమార్థంలో కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది. అల్ హింద్ ఎయిర్: కేరళకు చెందిన ప్రముఖ అల్హింద్ గ్రూప్ దీనిని ప్రారంభిస్తోంది. కొచ్చి కేంద్రంగా ఏటీఆర్ 72-600 విమానాలతో కేరళలోని నగరాల నుంచి బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాలకు సేవలు అందిస్తుంది.

**ఫ్లైఎక్స్‌ప్రెస్:** హైదరాబాద్ కేంద్రంగా పనిచేయనున్న ఈ సంస్థ, కొరియర్, కార్గో రంగం నుంచి ప్యాసింజర్ సర్వీసుల్లోకి అడుగుపెడుతోంది.ప్రస్తుతం దేశీయ మార్కెట్లో ఇండిగో, ఎయిర్ ఇండియా గ్రూప్‌లకు కలిపి 90% పైగా వాటా ఉంది. ఒక్క ఇండిగోకే 65% వాటా ఉంది. కొత్త సంస్థల రాకతో ఈ గుత్తాధిపత్యం తగ్గి, ప్రయాణికులకు మరిన్ని ఎంపికలు అందుబాటులోకి వస్తాయని, టికెట్ ధరలు కూడా అదుపులోకి వస్తాయని నిపుణులు ఆశిస్తున్నారు. ఎన్‌ఓసీ పొందిన ఈ సంస్థలు, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ద నుంచి తదుపరి అనుమతులు పొంది, త్వరలోనే తమ సేవలను ప్రారంభించనున్నాయి.

# కేసీఆర్ కుటుంబాన్ని మళ్లీ అధికారంలోకి రానివ్వం.. ఇదే నా శపథం

- మొదటి పేజీ తరువాయి

కడతారని హెచ్చరించారు. కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా, రాష్ట్ర మంత్రిగా, తెలంగాణ సాధించిన అని చెప్పుకునే వ్యక్తిగా ఇలాంటి మాటలు మాట్లాడవచ్చా అని నిలదీశారు.మేం మాట్లాడాలనుకుంటే చాలా మాట్లాడుతామని, కానీ మర్యాద ఉండదని ఊరుకుంటున్నామని అన్నారు. మేం మాట్లాడటం మొదలు పెడితే మల్లన్న సాగర్‌లో దూకి చస్తావని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఇదేనా అని ధ్వజమెత్తారు. పాలమూరు ప్రాజెక్టును ఎండగట్టారని, ప్రాజెక్టులు ఏవీ పూర్తి చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. కేసీఆర్ వలస వచ్చి పాలమూరు ఎంపీ అయ్యారని అన్నారు. పగ సాధించడం మొదలు పెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలి పెట్టానని అన్నారు. నేను ప్రమాణం చేసినప్పుడే ఆయన కూలబడ్డారని, ఇంతకంటే పెద్ద శిక్ష ఏముంటుందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఫాంహౌస్‌ను బందీఖానాగా మార్చుకున్నారని, చర్లపల్లి, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుందని అన్నారు.

తాను నల్లమల నుంచి వచ్చి జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ తర్వాత ముఖ్యమంత్రిని అయ్యానని రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఏ అంశంపై అయినా చర్చించడానికి సిద్ధమని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా కేసీఆర్ వయస్సును గౌరవిస్తామని, ఈ నెల 29 నుంచి జరగబోయే సమావేశాలకు కేసీఆర్ వచ్చి సూచనలు చేయాలని అన్నారు. ఖాళీగా ఉన్నప్పుడు పార్టీ కార్యాలయానికి వచ్చి ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదని అన్నారు.

## కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన కేటీఆర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి అహంకారంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోస్గిలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ, 2028లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని అన్నారు. నీటి ద్రోహంపై సమాధానం చెప్పలేక ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు.నదీ జలాల హక్కులను కాపాడటం చేతకాని అసమర్థుడు అహంకారంతో మాట్లాడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలమూరు ప్రాజెక్టు గొంతుకోసి సొంత జిల్లానే మోసం చేస్తున్నాడని ఆరోపించారు. అది చాలదన్నట్లుగా కేసీఆర్‌పై ఏది పడితే అది మాట్లాడుతున్నారని అన్నారు. సభ్యత, సంస్కారం లేని నీచమైన రేవంత్ రెడ్డి ప్రవర్తనను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు.ప్రజలు ఛీకొడుతున్నా ఇంకా మారవా అని ఎద్దేవా చేశారు. శాసనసభతో పాటు జనసభలోనూ కాంగ్రెస్ పార్టీ జలద్రోహాన్ని ఎండగడతామని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో వందేళ్ల వరకు కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సందర్భం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## జీహెచ్ఎంసీ చట్ట సవరణపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా, ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల ఉన్న 20 మున్సిపాలిటీలు,7 కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. జీహెచ్ఎంసీలో విలీనమైన 27 మున్సిపాలిటీల్లో తుక్కుగూడ కూడా ఒకటి. ఈ క్రమంలో తుక్కుగూడ మున్సిపాలిటీని జీహెచ్ఎంసీలో విలీనం చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఎలాంటి అభిప్రాయాలు తీసుకోకుండా తుక్కుగూడ మున్సిపాలిటీని జీహెచ్ఎంసీలో విలీనం చేశారని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై బుధవారం (డిసెంబర్ 24) విచారణ చేపట్టిన హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనంతరం ఈ పిటిషన్‌పై విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

## కారు గుర్తు లేని సర్పంచ్ ఎన్నికల్లోనే 4 వేల స్థానాల్లో గెలిచాం

గుర్తు లేని సర్పంచ్ ఎన్నికల్లోనే 4 వేలకు పైగా స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందని, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పెడితే ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కడతారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రజలు కారు గుర్తుకు ఓటేస్తారనే భయం కాంగ్రెస్ పార్టీని పట్టుకుందని అన్నారు. ఎన్నికలు పెట్టాలంటేనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గజగజ వణుకుతున్నారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలని సవాల్ విసిరారు.

నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ దెబ్బకు రేవంత్ రెడ్డి ఎన్నికలంటేనే గజగజ వణుకుతున్నాడని ఎద్దేవా చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కాలికి బలపం కట్టుకుని తిరిగినా ఫలితం లేదని అన్నారు. సాధారణంగా పంచాయతీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ప్రచారం చేయరని, కానీ ఓడిపోతామనే భయంతో ఆయన ఊరూరా తిరిగాడని పేర్కొన్నారు.

సాధారణంగా పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి 90 శాతం, వీలైతే 100 శాతం విజయాలు వస్తాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి 64 శాతం ఫలితాలే వచ్చాయని ఆయన వెల్లడించారు.

కాంగ్రెస్ పార్టీ 6 వేలకు పైగా సర్పంచ్‌లు గెలిస్తే, బీఆర్ఎస్ 4 వేలకు పైగా గెలిచిందని తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలో జిల్లా పరిషత్‌లు, 90 శాతం వరకు సర్పంచ్‌లు మనమే గెలిచామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ చచ్చిపోయిందనే రేవంత్ రెడ్డి నిద్రలో కూడా అదే పార్టీని కలవరిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ పేరు లేకుండా, కేసీఆర్ పేరు లేకుండా రేవంత్ రెడ్డి ఎప్పుడూ మాట్లాడలేదని వెల్లడించారు.

## అరుణాచల్ చైనా 'కోర్ ఇంట్రెస్ట్'లో భాగమే

- మొదటి పేజీ తరువాయి

పెంటగాన్ అభిప్రాయపడింది. తైవాన్, సెంకాకు ద్వీపాలతో పాటు అరుణాచల్ ప్రదేశ్ కూడా బీజింగ్ యొక్క విస్తృత జాతీయ భద్రతా ప్రణాళికల్లో భాగమని తెలిపింది.

ఈ భూభాగాలు చైనా జాతీయ పునరుజ్జీవనానికి కీలకమని డ్రాగన్ భావిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. చైనా కమ్యూనిస్టు పాలనను వ్యతిరేకించిన హాంగ్‌కాంగ్, టిబెట్, తైవాన్ రాజకీయ నాయకులను వేర్పాటువాదులుగా ముద్ర వేసినట్లు కూడా నివేదిక తెలిపింది. వాస్తవాధీన రేఖ వెంబడి ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ భారత్, చైనా మధ్య కుదిరిన గస్తీ ఒప్పందం గురించి పెంటగాన్ తన నివేదికలో ప్రస్తావించింది. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగించడానికి చైనా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెంటగాన్ నివేదిక పేర్కొంది. అమెరికా, భారత్ మధ్య సంబంధాలు మరింత బలపడకుండా ఉండేలా చైనా జాగ్రత్త పడుతోందని వివరించింది. జాతీయ పునరుజ్జీవనానికి బీజింగ్ మూడు ప్రధాన ప్రయోజనాలను లక్ష్యంగా పెట్టుకుందని, అందులో చైనా కమ్యూనిస్టు పార్టీపై నియంత్రణ, దేశ ఆర్థికాభివృద్ధి, సార్వభౌమాధికారం, ప్రాదేశిక వాదనలు కొనసాగించడం వంటివి ఉన్నాయని పేర్కొంది.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు.. మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అరెస్ట్

హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల వ్యాపారం మరోసారి కలకలం రేపింది. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (న-చీజుఔ), చిక్కడపల్లి పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో ముగ్గురు డ్రగ్ పెడ్లర్లు, ఒక వినియోగదారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో ఒక మహిళా టెక్కీ ఉండటం సంచలనంగా మారింది. వీరంతా ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందినవారిగా గుర్తించారు.పోలీసులు వారి వద్ద నుంచి హైడ్రోపోనిక్ గంజాయి (నా+) 22 గ్రాములు, వీణహీూ 5 గ్రాములు, ఎక్టసీ మాత్రలు 5.57 గ్రాములు, ఎల్ఎస్‌డీ బ్లాట్స్ 6, నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా డార్క్ వెబ్ ద్వారా మాదకద్రవ్యాలను సేకరించి, క్రిప్టోకరెన్సీ ద్వారా లావాదేవీలు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉమ్మిడి ఇమాన్యుయేల్. ఈవెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న అతడు తొలుత డ్రగ్స్ వినియోగదారుడిగా ఉండి, క్రమంగా పెడ్లర్‌గా మారినట్లు విచారణలో తేలింది. అతడిపై రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు ఎన్‌డీపీఎస్ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఇమాన్యుయేల్ లివ్-ఇన్ పార్ట్నర్ అయిన సుస్మితా దేవి అలియాస్ లిల్లీ, హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తోంది. ఆమె డ్రగ్స్ విక్రయానికి సంబంధించిన ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహిస్తూ, తన బ్యాంక్ ఖాతాలోకి అక్రమ ఆదాయాన్ని తీసుకునేదని పోలీసులు తెలిపారు. ఇమాన్యుయేల్ లేని సమయంలో ఆమె స్వయంగా డ్రగ్స్ సరఫరా వ్యవహారాలను చూసుకునేది. జి. సాయి కుమార్ అనే వ్యక్తి ద్వారా హైదరాబాద్‌లో డ్రగ్స్ పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

ఈ కేసులో డ్రగ్స్ వినియోగదారుడిగా తలబట్టుల తారక లక్ష్మీకాంత్ అయ్యప్ప అనే ప్రైవేట్ ఉద్యోగిని కూడా అరెస్ట్ చేశారు. ఇటీవల కాలంలో చదువుకున్న యువత డ్రగ్స్‌కు బానిసలై, చివరికి పెడ్లర్లుగా మారడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. ఇది వ్యక్తులకే కాదు, కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతోందని హెచ్చరించారు.

## ఆరావళి మైనింగ్‌పై వెనక్కి తగ్గిన కేంద్రం.. రాష్ట్రాలకు కీలక ఆదేశాలు

ఆరావళి పర్వత శ్రేణుల పరిరక్షణ దిశగా కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పర్వత శ్రేణిలో కొత్తగా ఎలాంటి మైనింగ్ లీజులు మంజూరు చేయవద్దని పూర్తిస్థాయిలో నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు విస్తరించి ఉన్న మొత్తం ఆరావళి ప్రాంతానికి ఈ ఆదేశాలు వర్తిస్తాయని కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (వీశీజుఖీ&జజ) స్పష్టం చేసింది.అక్రమ, అనియంత్రిత మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంతో పాటు ఈ పర్వతాలను ఒకే భౌగోళిక వ్యవస్థగా పరిరక్షించడమే తమ లక్ష్యమని కేంద్రం పేర్కొంది. ఈ నిషేధాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేసేందుకు గాను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (×జఖీ=జు)కు కీలక బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఉన్న నిషేధిత ప్రాంతాలకు అదనంగా, మైనింగ్‌ను శాశ్వతంగా నిషేధించాల్సిన మరిన్ని ప్రాంతాలను శాస్త్రీయంగా గుర్తించాలని ఆదేశించింది. అలాగే మొత్తం ఆరావళి ప్రాంతానికి 'సుస్థిర మైనింగ్ యాజమాన్య ప్రణాళిక'ను రూపొందించాలని సూచించింది.

ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే అనుమతులతో నడుస్తున్న మైనింగ్ కార్యకలాపాలపై మరింత కఠిన నిబంధనలు అమలు చేయాలని, పర్యావరణ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని కేంద్రం రాష్ట్రాలకు స్పష్టం చేసింది. భూగర్భ జలాలను పరిరక్షించడంలో ఆరావళి పర్వతాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటి సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించింది.

## కొత్త సర్పంచ్‌లకు తీపి కబురు.. గ్రామాలకు ప్రత్యేకంగా రూ.10లక్షలు

- మొదటి పేజీ తరువాయి

సీఎం స్పష్టం చేశారు. దీని ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.తన రాజకీయ ప్రయాణంలో కొడంగల్ ప్రజల సహకారాన్ని గుర్తు చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, "2009 నుంచి మీరు నన్ను మీ భుజాలపై మోశారు. మీ నమ్మకమే నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చింది" అని అన్నారు. కొడంగల్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.గ్రామాల్లో వివక్ష లేకుండా పాలన సాగాలని, పార్టీలు-పంతాలు పక్కన పెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సర్పంచ్‌లకు సూచించారు.

గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సీఎం కోరారు. పార్టీలకు అతీతంగా గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం ముందుకు సాగుతాయని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా గ్రామాలే దేశానికి వెన్నెముక అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ఆకాశమే హద్దు ఇస్రో 'బాహుబలి' ఘనవిజయం!

- మొదటి పేజీ తరువాయి

ఉపగ్రహంగా రికార్డు సృష్టించింది.అమెరికాకు చెందిన 'ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్' రూపొందించిన ఈ ఉపగ్రహం ప్రత్యేకత ఏంటంటే.. దీనివల్ల ఎలాంటి అదనపు పరికరాలు లేకుండానే సాధారణ స్మార్ట్‌ఫోన్లకు నేరుగా అంతరిక్షం నుంచి 4+/5+ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుతాయి. ఈ ప్రయోగంలో ఒక ఆసక్తికరమైన మలుపు చోటుచేసుకుంది. ముందుగా ఉదయం 8:54 గంటలకే రాకెట్ బయలుదేరాల్సి ఉంది. కానీ రాకెట్ వెళ్లే మార్గంలో అంతరిక్ష వ్యర్థాలు, లేదా ఇతర ఉపగ్రహాలు ఢీకొనే ప్రమాదం ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన ఇస్రో, కచ్చితమైన సమయ పాలనతో ప్రయోగాన్ని 90 సెకన్ల పాటు ఆలస్యం చేసి, 8:55 గంటల 30 సెకన్లకు ప్రయోగిం చింది. తద్వారా పెను ప్రమాదాన్ని నివారించి విజయాన్ని అందుకుంది.ప్రయోగం విజయవంతమైన తర్వాత ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ మాట్లాడుతూ.. "ఎల్వీఎం3 రాకెట్ తన అద్భుతమైన ట్రాక్ రికార్డును మరోసారి నిరూపించుకుంది. ప్రపంచంలోనే అత్యుత్తమ రాకెట్లలో ఇదొకటని నిరూపితమైంది" అని సంతోషం వ్యక్తం చేశారు. ఇది ఇస్రో చేపట్టిన మూడవ పూర్తి స్థాయి వాణిజ్య మిషన్ కావడం విశేషం.

## ఫిరాయింపులపై చర్చల నడుమ దానం నాగేందర్ కీలక ప్రకటన

- మొదటి పేజీ తరువాయి

అన్న విషయాలు తనకు తెలియవని అన్నారు. "నేను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుస్తుంది" అంటూ దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎంఐఎం కలిసి మొత్తం 300 డివిజన్లలో విజయం సాధిస్తాయని ఆయన ధీమా వ్యక్తం వేశారు. గ్రేటర్ హైదరాబాద్ అంతటా విస్తృతంగా ప్రచారం చేస్తానని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. ఇటీవల బీఆర్ఎస్ తరఫున గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలపైద


అనర్హత వేటు వేయాలంటూ గులాబీ పార్టీ పోరాటం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా ఎమ్మెల్యేలు తాము ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని చెబుతున్నారు. అయితే, ఈ పరిణామాలకు భిన్నంగా దానం నాగేందర్ మాత్రం బహిరంగంగా తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నానని అంగీకరించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్
గురువారం 25 డిసెంబర్ 2025 పేజీలు 8

## జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు..

**యేసుక్రీస్తు జన్మదినోత్సవం ఆనందంగా జరుపుకోవాలి: జిల్లా కలెక్టర్ మను చౌదరి..**

లిమేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 24 యేసుక్రీస్తు జన్మదినోత్సవమైన క్రిస్మస్ పండుగను ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాలు, సౌహార్ద వాతావరణంలో జరుపుకోవాలని మేడ్చల్మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పిలుపునిచ్చారు. గురువారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని జిల్లా ప్రజలకు, ముఖ్యంగా క్రైస్తవ సోదరసోదరీమణులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు ఎంతో పవిత్రంగా భావించే క్రిస్మస్ పండుగ యేసుక్రీస్తు జన్మదినానికి ప్రతీక అని కలెక్టర్ పేర్కొన్నారు.. కరుణ, దయ, ప్రేమకు ప్రతిరూపమైన యేసుక్రీస్తు సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం, శాంతియుత సహజీవనం, శత్రువుల పట్ల సైతం క్షమాగుణం కలిగి ఉండాలని మానవాళికి బోధించారని అన్నారు.. యేసుక్రీస్తు బోధనలు నేటి సమాజానికి మరింత అవసరమని, వాటిని ఆచరించడం ద్వారా సామాజిక సౌహార్దం బలపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి జిల్లా ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.


మిక్కిలినేని మను చౌదరి.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్..

## మాదాపూర్ తమ్మిడికుంట, కూకట్ పల్లి నల్ల చెరువు పనులు పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్ పెన్ పవర్:**మాదాపూర్ లోని తుమ్మిడికుంట, కూకట్ పల్లిలోని నల్ల చెరువుల అభివృద్ధి పనులు పరిశీలించారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. బుధవారం ( డిసెంబర్ 24 ) సిబ్బందితో కలిసి పర్యటించిన ఆయన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. చెరువుల్లోకి మురుగు నీరు నేరుగా చేరకుండా ఙాల ద్వారా శుద్ధి జలాలు మాత్రమే వచ్చేలా చూడాలని ఆదేశించారు. చెరువుల చెంత పార్కుల అభివృద్ధి, గ్రీనరీ పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ప్రతి చెరువును పర్యాటక ప్రాంతంలా తీర్చిదిద్దాలని ఆదేశాలు జారీ చేశారు రంగనాథ్.చెరువులు పార్కుల దగ్గర సీనియర్ సిటిజన్లకు విశ్రాంతి సదుపాయాలు,చిన్నారుల కోసం ప్రత్యేక ప్లే ఏరియాల అభివృద్ధి చేయాలని అన్నారు.చెరువుల దగ్గర భద్రతకు ప్రాధాన్యమిస్తూ.. తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలని.. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు.చెరువుల ఇన్ లెట్లు, ఔట్ లెట్లు, వర్షపు నీటి ఛానళ్ల అభివృద్ధికి ఆదేశాలు జారీ చేశారు కమిషనర్ రంగనాథ్. సంక్రాంతికి బతుకమ్మకుంట, తమ్మిడికుంట, నల్ల చెరువు, బమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువుల వద్ద పతంగుల పండగ నిర్వహిస్తామని ప్రకటించారు రంగనాథ్.



## అధికారుల నిర్లక్ష్యాన్ని సహించం

**ఖమ్మం:పెన్ పవర్:** రాష్ట్ర ప్రగతిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాధికారులు, ఉద్యోగులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, ఇకపై నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. “మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రం ఎదిగేందుకు 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించాం. మానవ సంపద సృష్టించడం కీలకం. తద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున సంపద సమకూరుతుంది. విలువైన మానవ వనరులను సృష్టించేందుకు విద్యారంగంపై ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోంది. విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం, న్యూట్రిషన్ ఫుడ్ ద్వారా వారికి మంచి ఆరోగ్యం



-4 లో

## కేటీఆర్ వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా

- కేటీఆర్ తనను దుర్భాషలాడారన్న పోచారం
- రేవంత్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని కితాబు
- సర్పంచ్ విలువను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనను దుర్భాషలాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేశారని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. ఆయన తండ్రి కేసీఆర్ కంటే తాను ఐదేళ్లు పెద్ద అని... ఆయన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని కితాబునిచ్చారు. బాన్సువాడలో 111 మంది సర్పంచ్ లు, ఉప సర్పంచ్ అభ్యర్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. సర్పంచ్ పదవి రాజ్యాంగ బద్దమైనదని... దాని విలువను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పోచారం అన్నారు. గ్రామాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా నిధులను సమకూరుస్తుందని... ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.





## ఈ వీకెండ్ అంతా గజ గజ చలి.. బయటకు వస్తే వణుకుడే

**హైదరాబాద్ పెన్ పవర్:**చలికాలం చలి కాకపోతే వేడి ఉంటుందా అని వెటకారాలు వద్దండీ.. చలి కాలంలో చలే ఉంటుంది. కాకపోతే ఈ సారి చలి గజ గజ వణికిస్తుంది. హైదరాబాద్ సిటీనే కాదు.. తెలంగాణ రాష్ట్రం అంతా టెంపరేచర్ సింగిల్ డిజిట్ కు పడిపోతుంది. జీరోకు దగ్గరగా వచ్చేస్తోంది రోజు రోజుకు ఉష్ణోగ్రతలు. రాబోయే నాలుగు రోజులు.. అంటే ఈ వీకెండ్ అంతా.. 2025, డిసెంబర్ 25 నుంచి 28వ తేదీ వరకు చలి మరింత పెరగనున్నట్లు వాతావరణ శాఖ అలర్ట్ ఇచ్చింది. తెలంగాణలో ఇప్పటికే సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల తక్కువ టెంపరేచర్ నమోదు అవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ కు పడిపోతుంది. హైదరాబాద్ సిటీ శివార్లలో చలి తీవ్రతతోపాటు చలి గాలులు వీస్తాయని స్పష్టం చేసింది వెదర్ డిపార్ట్ మెంట్. ఉదయం వేళల్లో పొగ మంచు ఎక్కువగా కురుస్తుందని.. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది వాతావరణ శాఖ.

**చలి తీవ్రతపై ఎల్లో, ఆరంజ్ అలర్ట్స్ జారీ :**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చలి తీవ్రతపై ఎల్లో, ఆరంజ్ అలర్ట్స్ జారీ చేసింది హైదరాబాద్ వాతావరణ కేంద్రం.

ఎల్లో అలర్ట్ జిల్లాలు : నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, జనగాం, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో చలి ఎక్కువగా ఉండే అవకాశం. ఎల్లో అలర్ట్ అంటే 10 నుంచి 15 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదు అవుతుంది.

**ఆరంజ్ అలర్ట్ జిల్లాలు :** ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఆరంజ్ అలర్ట్. అంటే ఈ జిల్లాల్లో 5 నుంచి 10 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. ఓవరాల్ గా తెలంగాణ అంతటా.. రాబోయే మూడు, నాలుగు రోజులు.., అంటే డిసెంబర్ 28వ తేదీ వరకు సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు ఉష్ణోగ్రత తక్కువ నమోదు అవుతుంది.

ఇక రాత్రులు బయటకు వస్తే గజగజ వణికిపోవటమే.. అత్యవసరం అయితేనే బయటకు రండి అని స్పష్టం చేస్తుంది వాతావరణ శాఖ రిపోర్ట్.

## నకిలీ ఈ-చలాన్ లింక్‌పై క్లిక్ చేసిన హైదరాబాదీ.. రూ.6 లక్షల సైబర్ దోపిడీ

- నకిలీ ట్రాఫిక్ ఈ-చలాన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్న సజ్జనార్
- అమాయకులే లక్ష్యంగా మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు
- ట్రాఫిక్ ఈ-చలాన్ల లింకులు పంపించి దోపిడీ చేస్తున్నారని హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్‌లో నకిలీ ఈ-చలాన్ లింక్‌పై క్లిక్ చేసిన ఒక వ్యక్తి దాదాపు రూ.6 లక్షలు పోగొట్టుకున్న ఘటన చోటు చేసుకుంది. నకిలీ ట్రాఫిక్ ఈ-చలాన్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. అమాయకులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా నకిలీ ట్రాఫిక్ ఈ-చలాన్‌ల లింకులను పంపించి దోపిడీకి పాల్పడుతున్నారు.నిన్న ఇలాంటి లింక్‌పై క్లిక్ చేసిన వ్యక్తి దాదాపు రూ.6 లక్షలు పోగొట్టుకున్నాడని సజ్జనార్ వెల్లడించారు. ఈ నకిలీ వెబ్‌సైట్ కూడా ట్రాఫిక్ పోలీసుల అధికారిక వెబ్‌సైట్‌లాగే ఉంటుందని తెలిపారు. పోర్టల్ అలాగే ఉండటంతో బాధితుడు రూ.500 ట్రాఫిక్ ఫైన్ చెల్లించడానికి ప్రయత్నించి డబ్బులు పోగొట్టుకున్నట్లు వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు అతని క్రెడిట్ కార్డు నుంచి అంతర్జాతీయ



-4 లో

### తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు.. నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 29న ఉదయం 10.30గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించే అవకాశముంది. ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్టులపై చేసిన వ్యయం ఇలా అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యోచిస్తున్నట్లు సమాచారం.

# వచ్చే ఏడాది నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పిల్లలకు టిఫిన్‌తో పాటు మధ్యాహ్న భోజనం

**హైదరాబాద్ పెన్ పవర్:** : ప్రతి ఇంటికి రేషన్ కార్డు ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా కోస్గిలో సిఎం పర్యటించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. సర్పంచ్‌లు ఇంటింటికీ వెళ్లి రేషన్ కార్డు రాని వారి పేర్లు రాసుకోవాలని సూచించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం రాని పేదల పేర్లు రాసుకోవాలని.. రైతు భరోసా అందని రైతుల వివరాలు సేకరించాలని అన్నారు. రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో వేసే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. కోటి మందికి ఇందిరమ్మ చీరలు.. నా ఆడబిడ్డలకు సారెగా ఇస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పిల్లలకు టిఫిన్‌తో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తామని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు. కెసిఆర్ సిఎం అయినా.. కొడంగల్‌కు నీళ్లు రానివ్వలేదు. పాలమూరు, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. కృష్ణా నదిపై ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు.. ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదు. పదేళ్లలో కాంట్రాక్టర్లకు రూ. 1.83 లక్షల కోట్ల బిల్లులు మాత్రం చెల్లించారు. కమీషన్ల రూపంలో రూ.వేల కోట్లు కెసిఆర్ కుటుంబం పొందింది. చెప్పులు లేకుండా తిరిగిన వాళ్లకు బిఆర్ఎస్ పాలనలో బెంజ్ కార్లు వచ్చాయి. మొత్తం రూ. 8 లక్షల కోట్ల అప్పు మిగిల్చి పోయారు. ఒకరికి ఎర్రవల్లిలో వెయ్యి ఎకరాల ఫాంహౌస్ వచ్చింది. మరొకరికి జన్వాడలో వందెకరాల ఫాంహౌస్ వచ్చింది. కెసిఆర్ అల్లుడికి మొయినాబాద్‌లో ఫాంహౌస్ వచ్చింది. తెలంగాణలో కెసిఆర్ కుటుంబం మాత్రం బాగుపడింది. కెసిఆర్ కుటుంబానికి రూ.వేల కోట్ల వ్యాపారాలు వచ్చాయి" అని బిఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో రేవంత్ విమర్శలు చేశారు. తాను ఉన్నంతకాలం కెసిఆర్‌కు అధికారం దక్కనివ్వనని సిఎం రేవంత్ అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్, ఉపఎన్నికలు.. అన్నింట్లోనూ ఓడించామని. ఇన్నిసార్లు ఓడించినా.. ఇంకా వాళ్లదే పై చేయి అంటారా? అని ప్రశ్నించారు. 2029లో అధికారం ముమ్మాటికీ కాంగ్రెస్‌దే అని ధీమా వ్యక్తం చేశారు. కొడంగల్ బిడ్డగా ఇదే తన శపథం అని పేర్కొన్నారు.



# 1,441 పాఠశాలలను తాత్కాలికంగా మూసివేసిన విద్యా శాఖ




**హైదరాబాద్, డిసెంబర్ 24: పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు లేని 'జీరో' ప్రభుత్వ పాఠశాలలపై పాఠశాల విద్యా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు లేని పాఠశాలలను తాత్కాలికంగా మూసివేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వాటిని ఏకీకృత జిల్లా పాఠశాల విద్యా సమాచారం గణాంకాల్లో చూపించరు. ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ పాఠశాలల్లో సంఖ్య తెలంగాణలో అధికంగా ఉంది. 2024-25 విద్యా సంవత్సరపు లెక్కల ప్రకారం తెలంగాణలో ఇలాంటి పాఠశాలలు 2,245 ఉన్నాయి.పాఠశాల విద్యా శాఖ పరిధిలో 2 వేలకు పైగా పాఠశాలలు ఉండగా, వాటిలో 1,441 చోట్ల విద్యార్థులు లేరు. ఉపాధ్యాయ పోస్టులు కూడా లేవు. మరో 600 పాఠశాలల్లో విద్యార్థులు లేకున్నా ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతానికి 1,441 పాఠశాలలను తాత్కాలికంగా మూసివేయనున్నారు. మిగిలిన పాఠశాలలకు సంబంధించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఈ పాఠశాలలు పని చేయడం లేనందున తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.గ్రామస్థులు తమ పిల్లలను బడికి పంపిస్తామని కోరితే పాఠశాలలను తిరిగి తెరుస్తామని, ఉపాధ్యాయులను కూడా నియమిస్తామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. మారుమూల శివారు తండాల్లో కూడా తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది 200 పాఠశాలలను కొత్తగా ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

**కరీంనగర్: పెన్ పవర్:**ప్రభుత్వ ఆసుపత్రులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.
కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఒక్కో పీహెచ్‌సీ వారీగా సాధించిన ప్రగతి, పీహెచ్‌సీ వారీగా కాన్పులు తదితర వివరాలపై సమీక్షించారు. ప్రసవాలు, ఆరోగ్య మహిళ, ఎన్ఆర్సి, ఆర్బిఎస్కె,108సేవలు, ఆరోగ్యశ్రీ, ఐ, డెంటల్ ఎగ్జామినేషన్, లెప్రసీ సర్వే, టీబీ, ఇమ్యూనైజేషన్ క్యాలెండర్, బూస్టర్ డోస్, గర్భిణీల వివరాలు ఆన్లైన్లో నమోదు చేయడంపై చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కనీసం 80శాతం డెలివరీలు ప్రభుత్వ దవాఖానల్లోనే జరిగేలా చూడాలని, గర్భిణీలకు ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలని అన్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి కాన్పు అయ్యేంత వరకు ఆరోగ్య పరిరక్షణపై ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఆర్ బి ఎస్ కే పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దేశించిన సంఖ్యలో విద్యార్థులకు స్క్రీనింగ్ చేయాలని, పనితీరు మెరుగు పరచుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గర్భిణి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, గర్భిణీల్లో రక్త హీనత లేకుండా చూడాలని అన్నారు. నాణ్యమైన సేవలందిస్తూ ప్రభుత్వ దవాఖాన పని తీరు పట్ల ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంచాలని తెలిపారు. పలు ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరుగుతుండటంపై వైద్యాధికారులను ప్రశంసించారు.
ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ మందుల కొరత రాకుండా చూడాలన్నారు.రాష్ట్రంలోనే మొదటిసారి జిల్లాలో డెంటల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తున్నామని పాఠశాలల్లో, పంచాయితీల్లో వైద్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న అంబులెన్సును డ్రైవర్లు లేరనే కారణంతో ఖాళీగా ఉంచొద్దని.. అవసరమైన సిబ్బంది ఉన్నచోట సర్దుబాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు.టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిక్షయ్ పోర్టల్ లో టీబీ వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. వారికి అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి ప్రభుత్వాసుపత్రులకు వస్తున్నారు.ప్రభుత్వం అందించే మందుల కోసంరాష్ట్రంలోనే మన జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకు సిబ్బందిని అభినందించారు. అనంతరం క్రిస్మస్ ను పురస్కరించుకొని కేక్ కట్ చేశారు.ఈ సమావేశంలో డిఎంహెచ్వో వెంకటరమణ, అదనపు డీఎంహెచ్వో సుధా, డిప్యూటీ డిఎంహెచ్వోలు చందు నాయక్, రాజగోపాల్, ఇమ్యునైజేషన్ అధికారి సాజిదా, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, జిజిహెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంఓ నవీన, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.




# చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**మహబూబాబాద్: పెన్ పవర్:**వినియోగ దారులు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ అన్నారు. బుధవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించు కుని జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా త్వరితగతిన సమర్థవంతంగా కేసుల పరిష్కారం అనే అంశంపై చర్చించారు. వినియోగదారుల చట్టాలపై ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని పౌరసరఫరాల శాఖ, తూనికలు,కొలతల శాఖ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే న్యాయం జరిగేందుకు జాతీయ వినియోగదారుల సంస్థ పనిచేస్తుందని, "డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా త్వరితగతిన, సమర్థ వంతంగా కేసుల పరిష్కారం అవుతుందని, డిజిటల్ న్యాయ వ్యవస్థలు సాంకేతికత మరియు వినూత్న పద్ధతులను ఏకీకృతం చేయడం ద్వారా సామర్థ్యాన్ని పెంచి, కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేస్తూ న్యాయ రంగాన్ని రూపాంతరం చెందిస్తున్నాయన్నారు. డిజిటల్ న్యాయంలో సాంకేతికత పాత్రః డిజిటల్ న్యాయం న్యాయ ప్రక్రియలను క్రమ బద్ధీకరించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎ ఐ), మెషిన్ లెర్నింగ్ (ఎం ఎల్) మరియు ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్ (ఓ సి ఆర్) వంటి వివిధ సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించుకుంటుంది. ఈ సాంకేతికతలు కేసు నిర్వహణ, చట్టపరమైన పరిశోధన మరియు డాక్యుమెంటేషన్ నూ ఆటోమేట్ చేయడంలో సహాయ పడతాయి, కేసు పరిష్కారానికి అవసరమైన సమయాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. ఉదాహరణకు, ఏ ఐ సంభావ్య జాప్యాలను అంచనా వేయగలదు మరియు సంబంధిత తీర్పులను సంగ్రహించడం ద్వారా సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడంలో న్యాయమూర్తులకు సహాయపడుతుం దని అన్నారు. డిజిటల్ న్యాయ వ్యవస్థల ప్రయోజనాలు,పెరిగిన సామర్థ్యం డిజిటల్ సాధనాలు సాధారణ పనులను ఆటోమేట్ చేయడం ద్వారా కేసుల వేగవంతమైన ప్రాసెసింగ్ను సులభతరం చేస్తాయి, ఇది న్యాయ నిపుణులు మరింత సంక్లిష్టమైన సమస్యలపై దృష్టి పెట్టడానికి వీలు కల్పిస్తుంది. ఇది కేసులు పెండింగ్లను తగ్గించడానికి మరియు వేగవంతమైన పరిష్కారాలకు దారితీస్తుందని అన్నారు.యాక్సెసిబిలిటీ, వర్చువల్ కోర్టులు మరియు ఆన్లైన్ ప్లాట్ఫారమ్లు న్యాయ వ్యవస్థను ప్రజలకు మరింత అందుబాటులోకి తెస్తాయి. వ్యక్తులు ఎక్కడి నుండైనా కేసులు దాఖలు చేయవచ్చు, విచారణలకు హాజరు కావచ్చు మరియు చట్టపరమైన సమాచారాన్ని యాక్సెస్ చేయవచ్చు, తద్వారా భౌగోళిక అడ్డంకులను తొలగించవచ్చని అన్నారు. పారదర్శకత , డిజిటల్ న్యాయం కోర్టు కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేయడం మరియు కేసు రికార్డులను డిజిటలైజేషన్ చేయడం ద్వారా పారదర్శకతను ప్రోత్సహిస్తుంది. ఈ బహిరంగత న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పెంపొందించడంలో సహాయపడుతుందన్నారు. ఖర్చు-సమర్థత , భౌతిక మౌలిక సదుపాయాలు మరియు వ్యక్తిగత విచారణల అవసరాన్ని తగ్గించడం ద్వారా, డిజిటల్ న్యాయ వ్యవస్థలు కోర్టులు మరియు న్యాయవాదులకు ఒకే విధంగా కార్యాచరణ ఖర్చులను తగ్గించగలవని అన్నారు.కేసులను సమర్థ వంతంగా, త్వరగా పరిష్కరించడానికి న్యాయ వ్యవస్థలో డిజిటల్ టెక్నాలజీల ఏకీకరణ చాలా అవసరం. అధికార పరిధులు ఈ ఆవిష్కరణలను కొనసాగిస్తున్నందున, మరింత ప్రాప్యత, పారదర్శకత మరియు ప్రభావవంతమైన న్యాయ వ్యవస్థకు అవకాశం మరింతగా అందుబాటులోకి వస్తుందని డిజిటల్ న్యాయం యొక్క కొనసాగుతున్న పరిణామం చట్టం మరియు పాలన యొక్క భవిష్యత్తును రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ సమావేశానికి హాజరైన జిల్లా అధ్యక్షులు ఇంజమూరి సుధాకర్, కల్లూరి ప్రభాకర్ రావు, తదితరులు వినియోగదారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ రమేష్, ఎల్డిఎం యాదగిరి, ఫుడ్ ఇన్స్పెక్టర్ ధర్మేంద్ర, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, సభ్యులు ఎస్కె జానీ, తదితరులు పాల్గొన్నారు.




## నకిలీ ఈ-చలాన్ లింక్‌పై క్లిక్ చేసిన హైదరాబాదీ.. రూ.6 లక్షల సైబర్ దోపిడీ

-3 పేజి తరువాయి

లావాదేవీల ద్వారా డబ్బులు కాజేశారు.
ఇలాంటి నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ హెచ్చరించారు. ఎస్సెమ్మెస్ ద్వారా వచ్చే లింకుల ద్వారా ఎప్పుడూ ఫైన్‌లు చెల్లించవద్దని విజ్ఞప్తి చేశారు. ఎల్లప్పుడూ అధికారిక ఈ-చలాన్ వెబ్‌సైట్‌ను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఒకవేళ సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సజ్జనార్ సూచించారు.

# అధికారుల నిర్లక్ష్యాన్ని సహించం

-3 పేజి తరువాయి

అందించి విలువైన మానవ వనరులు సృష్టించాలనేది ప్రజా ప్రభుత్వం లక్ష్యం. ప్రభుత్వ, జిల్లా పరిషత్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. జిల్లా కలెక్టర్ మొదలు అధికారులు అందరూ విద్యాసంస్థలను పర్యవేక్షించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఈ కార్యక్రమం పక్కాగా జరిగితే అద్భుతమైన ఫలితాలు సాధిస్తాం. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఏదైనా ఘటన జరిగితే అందుకు ఇన్‌ఛార్జి అధికారిని బాధ్యునిగా చేస్తాం. గోదాముల్లో వస్తువులను కుక్కినట్టుగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులను నమోదు చేసుకుంటున్నారు. ఇక నుంచి ప్రైవేటు విద్యాసంస్థలకు ఉండాల్సిన అర్హతలు, సౌకర్యాలపై ఒక చెక్ లిస్ట్ పెట్టుకొని అవన్నీ ఉంటేనే అధికారులు అనుమతులు ఇవ్వాలి. సౌకర్యాలు లేని విద్యాసంస్థలను అప్‌గ్రేడ్ చేసుకోవాలని వెంటనే తెలియజేయండి" అని డిప్యూటీ సీఎం అన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి నివైకుంఠ ఏకాదశికి రావలసిందిగా ఆహ్వానం పలికిన యాదగిరిగుట్ట ఈఓ



**హైదరాబాద్ డిసెంబర్ 24: పెన్ పవర్:**ఈ నెల 30 న వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రాన్ని దర్శించాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డి ని యాదగిరిగుట్ట ఆలయ ఈఓ వెంకట్రావు ఆలయ అర్చకులు ఆహ్వానించారు.

## ఎయిర్ ప్యూరిఫయర్‌పై జీఎస్టీ తగ్గించండి. ప్రభుత్వాన్ని కోరిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ డిసెంబర్ 24: పెన్ పవర్:**ఢిల్లీలో తీవ్ర వాయు కాలుష్యం ఉన్న విషయం తెలిసిందే. అయితే ఎయిర్ ప్యూరిఫయర్‌లపై జీఎస్టీ తగ్గించకపోవడం పట్ల ఢిల్లీ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. వాయు నాణ్యతను దృష్టిలో పెట్టుకుని, దానిని ఎమర్జెన్సీగా భావించి ఎయిర్ ప్యూరిఫయర్లపై పన్నులు తగ్గించాలని కోర్టు కోరింది. చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావు గేదెలతో కూడిన ధర్మాసనం ఈ కేసులో వాదనలు చేపట్టింది. ఎయిర్ ప్యూరిఫయర్లను మెడికల్ డివైస్‌లుగాభావించి, వాటిపై ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి చేర్చాలని కోర్టులో పిల్ వేశారు.అయితే ఈ అంశంలో ఏమీ చేయలేకపోవడంతో ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రతి పౌరుడికి స్వచ్ఛమైన గాలి కావాలని, కానీ అధికారులు నాణ్యమైన గాలిని అందివ్వలేకపోతున్నట్లు ధర్మాసనం పేర్కొన్నది. ప్రతి రోజు మనిషి సగటున 21వేల సార్లు శ్వాస పీల్చుకుంటారని అంటే అన్ని సార్లు వాయువు పీలిస్తే దాని వల్ల ఎంత హాని జరుగుతుందో అంచనా వేసుకోవానల్నారు. కపిల్ మదన్ అనే వ్యక్తి ఈ పిటీషన్ వేశారు. తీవ్ర సంక్షోభం వేళ ఎయిర్ ప్యూరిఫయర్లను లగ్జరీ ఐటమ్‌లుగా భావించవద్దు అన్నారు.

# రోగాలకు మూలకారణం జన్యువులేనా?

**హైదరాబాద్ డిసెంబర్ 24: పెన్ పవర్:**ఫిలడెల్ఫియాలోని ఒక వైద్య సంస్థలో ఒక అధ్యయనం జరిగింది. ఒక యువ వైద్యుడు గుడ్ల వల్ల నిజంగా హాని జరుగుతుందా కొలెస్ట్రాల్ లెవెల్ లో పెరుగుతాయా అని ఓ ప్రయోగం చేశాడు. అనేక వారాలపాటు ప్రతిరోజూ ఒక 4 నుంచి 6 గుడ్లు తిని ప్రయోగాలు చేశాడు. కొన్నాళ్ల తర్వాత లిపిడ్ ప్రొఫైల్ ను ల్యాబ్లో పరిశీలించాడు అతనికి ఆశ్చర్యం కలిగింది. ల్యాబ్ ఫలితాలు అతని హెచ్‌డిఎల్ పెరగడంతో పాటు కొలెస్ట్రాల్, ఎల్‌డిఎల్ వాస్తవానికి తగ్గినట్లు చూపించాయి. మనం ఒకప్పుడు తప్పు అన్నది ఇప్పుడు ఒప్పుఅవుతుంది. ఇప్పుడు ఒప్పు అన్నది కొన్నాళ్ళు కు తప్పు అవుతుంది. మరి ఇలా ఎందుకు ఫలితాలు రివర్స్ అవుతాయి.. కొన్ని ఆహారాలు, హైపర్ కొలెస్ట్రాల్ ప్రమాదాల గురించి చేసిన అధ్యయనాలు కొంత కాలానికి తిరగబడ్డాయి. కొబ్బరి నూనె, రొయ్యలు, షెల్ ఫిష్, గుడ్లు, కొవ్వు మాంసాలను ఉపయోగించకూడదని 25 సంవత్సరాల క్రితం సలహా బోర్డు హెచ్చరించింది. వెన్న నెయ్యి చాలా చెడ్డది అని ప్రచారం చేయబడ్డది కానీ మనము వెస్టర్న్ ఫుడ్ చూసాం అంటే వాళ్ళు వెన్న నెయ్యి లేనిది అసలు తినరు. బట్టర్ అనేది చాలా కామన్ గా అన్నిటిలో బ్రెడ్ మీద పూసుకునే తింటారు. ఒకప్పుడు బ్యాడ్ ఫుడ్స్ అని చెప్పినవన్నీ కూడా ఇప్పుడు అవన్నీ బెస్ట్ ఫుడ్స్. మరి ఏది మంచిది.. ఈ ఊదరగొట్టుడు సమాచారం అంతా ఎందుకు చేస్తారు. శారీరక శ్రమకు తగ్గట్టుగా ఆహారం తీసుకోవడం మితంగా ఆహారం తీసుకుంటూ ఉండటం ఉత్తమమైన సూచన. 80 నుండి 90% గుండె జబ్బులకు ప్రధాన కారణం ధూమపానం, మద్యపానం, జీవక్రియ వ్యాధులు మెటబాలిక్ డిసీజెస్ హెచ్ టిఎన్ రక్తపోటు, డయాబెటిస్, జన్యుపరమైన హైపర్లిపిడెమియా, హోమోసిస్టినీమియా, విపరీతమైన ఒత్తిడి అని తెలుస్తుంది.

# మెట్రో టేకోవర్ ప్లాన్ సిద్ధం!

**హైద్రాబాద్, డిసెంబర్ 24, పెన్ పవర్:** హైదరాబాద్ వాసుల జీవననాడి, ప్రతి రోజూ లక్షల మందిని గమ్య స్థానాలకు చేర్చే హైదరాబాద్ మెట్రో రైలు చరిత్రలో ఒక భారీ మార్పు చోటు చేసుకోబోతోంది. ఇప్పటి వరకు పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ పద్ధిలో ఎల్ అండ్ టీ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి స్థాయిలో తన ఆధీనంలోకి తీసుకోవాలని సంచలన నిర్ణయం తీసుకుంది. కేవలం నిర్ణయం తీసుకోవడమే కాకుండా, ఈ ప్రక్రియను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తి చేయాలని గడువు విధించుకోవడం ఇప్పుడు నగరంలో హాట్‌టాపిక్‌గా మారింది. మెట్రో రైలు టేకోవర్ ప్రక్రియను అత్యంత ప్రతిష్టాత్మకమైనదిగా భావిస్తున్న ప్రభుత్వం దాన్ని మార్చి 31 నాటికి పూర్తి చేయాలని చూస్తోంది. ఈ భారీ బదిలీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఇప్పటికే కార్యదర్శులు స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ ఇటీవల ఎల్ అండ్ టీ ఉన్నతాధికారులతో ఒక ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించి, ప్రాజెక్టు బదిలీలో ఎదురయ్యే సవాళ్లు, పరిష్కారాలపై లోతుగా చర్చించింది. ప్రభుత్వం లక్ష్యం స్పష్టంగా ఉంది. ఏప్రిల్1 నాటికి మెట్రో రైలు కార్యకలాపాలు ప్రభుత్వ పర్యవేక్షణలోకి వచ్చేలా సర్వ సిద్ధం చేయడం. ఆర్థిక, న్యాయ చిక్కులు లేకుండా ఐడీబీఐ కసరత్తు: వేల కోట్ల రూపాయల ప్రాజెక్టును ఒక ప్రైవేటు సంస్థ నుంచి ప్రభుత్వం తీసుకోవడం అనేది సామాన్యమైన విషయం కాదు. ఇందులో అనేక ఆర్థిక, న్యాయపరమైన మెలికలు ఉంటాయి. వీటికి పరిష్కరించడానికి ప్రభుత్వం ఐడీబీఐ సంస్థను ఫైనాన్స్, లీగల్ అడ్వైజర్‌గా నియమించింది. సమాచారం ప్రకారం ఐడీబీఐ సంస్థ ఇప్పటికే సమగ్రమైన నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందజేసింది. ఎల్ అండ్ టీ సంస్థకు ప్రభుత్వం ఎంత మొత్తం చెల్లించాలి, బకాయిల పరిస్థితి ఏంటీ, ఒప్పంద పత్రాల్లోని నిబంధనలు ఎలా ఉన్నాయి అనే అంశాలై ఈ నివేదికలో స్పష్టత ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ రిపోర్టు ఆధారంగానే హెచ్ఎంఆర్ఎల్, ఎల్ అండ్ టీ ప్రతినిధులు అంతిమ ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు. టెక్నికల్ కన్సల్టెంట్ నియామకం: ఇంజనీరింగ్‌అద్భుతంపై ఆడిట్ మెట్రో అనేది కేవలం రవాణా వ్యవస్థ మాత్రమే కాదు, అది ఒక సంక్లిష్టమైన సాంకేతిక వ్యవస్థ. నిర్మాణం నుంచి ఆపరేషన్స్ వరకు ప్రతి అడుగులోనూ సాంకేతికత కీలకం అందుకే మెట్రో ప్రాజెక్టు నిర్మాణ నాణ్యత, ప్రస్తుత నిర్వహణ తీరు, రైళ్ల ఆపరేషన్స్ వంటి కీలక అంశాలను అంచనా వేయడానికి ప్రభుత్వం క టెక్నికల్ కన్సల్టెంట్‌ను నియమించలని నిర్ణయించింది. ఈ నియామక ప్రక్రియ మరో వారం రోజుల్లో పూర్తికానుంది. ఈ కన్సల్టెంట్ ఇచ్చే సాంకేతిక నివేదిక, ఐడీబీఐ ఇచ్చిన ఆర్థిక నివేదికతో కలిపి మెట్రో టేకోవర్ ప్రక్రియకు ఒక పూర్తి స్థాయి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తుంది. ప్రజలకు కలిగే ప్రయోజనం ఏంటీ? ప్రభుత్వ నిర్ణయం వెనుక లోతైన వ్యూహం కనిపిస్తోంది. మెట్రో పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి వస్తే టికెట్ ధరల నియంత్రణ, మెట్రో రెండో దశ విస్తరణ పనుల్లో వేగం, ఇతర ప్రజా రవాణా వ్యవస్థలతో మెట్రోను అనుసంధానించడం సులభతరం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**సెకండ్ ఫేజ్ పై పెండింగ్**

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం మోడల్‌లో నిర్మించిన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలంటే సుమారు రూ. 15,000 కోట్ల నుంచి రూ. 18,000 కోట్ల వరకు నిధులు అవసరమని అంచనా. ప్రాజెక్టు అప్పులు, ఎల్ అండ్ టీ పెట్టుబడి, ఇతర నిర్వహణ ఖర్చులను లెక్కగడితే ఈ మొత్తం భారీగా ఉంటుంది. ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌పై ఒత్తిడి ఉన్న సమయంలో , కేంద్ర ప్రభుత్వ సహాయం కోరాలా లేక విదేశీ రుణ సంస్థల ద్వారా నిధులు సమీకరించాలా అనే అంశంపై ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. మెట్రో ప్రాజెక్టు ప్రభుత్వ చేతుల్లోకి వస్తే, రెండో దశ విస్తరణ పనులు మరింత వేగవంతం అవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. విమానాశ్రయ మార్గం, పాతబస్తీ మెట్రో వంటి కీలక మార్గాల్లో నిర్ణయాలు తీసుకోవడం ప్రభుత్వానికి సులభతరం అవుతుంది. ప్రైవేట్ భాగస్వామి నిబంధనల అడ్డంకులు లేకుండా, ప్రభుత్వం సొంతంగా నిధులు కేటాయించి నగరం నలుమూలలా మెట్రోను విస్తరించే అవకాశం ఉంటుంది. హైదరాబాద్ మెట్రో స్వాధీనం అనేది కేవలం ఒక వ్యాపార లావాదేవీ మాత్రమే కాదు, ఇది నగర ప్రజా రవాణా ముఖచిత్రాన్ని మార్చే అతిపెద్ద నిర్ణయం. ఎల్ అండ్ టీ నుంచి వాటాల బదిలీకి సంబంధించి ప్రస్తుతం చర్చలు తుది దశలో ఉన్నాయి. ప్రభుత్వం క్లారిటీ ఇస్తే, రాబోయే కొద్ది నెలల్లోనే హైదరాబాద్ మెట్రో పూర్తి స్థాయిలో ప్రభుత్వ సంస్థగా రూపాంతరం చెందనుంది. ఆ తర్వాతే మెట్రో విస్తరణ గురించి అడుగులు ముందుకు పడే అవకాశం ఉంది

# రెడ్డిపల్లి సబ్ స్టేషన్ ను అకస్మాత్తుగా తనిఖీ చేసిన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.

**హైదరాబాద్: పెన్ పవర్:** హరీష్ రావు మాట్లాడుతూరేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు కేవలం 12 గంటల కరెంటు మాత్రమే సరఫరా చేస్తున్నట్టుగా ఉంది నర్సాపూర్ సబ్ స్టేషన్ లో,సునీత లక్ష్మారెడ్డి నేను కలిసి సబ్ స్టేషన్ ను విజిట్ చేయడం జరిగింది.పార్టీ సమావేశానికి వెళ్తుండగా రైతులు కరెంట్ రావడంలేదని ఫోన్ చేస్తే సడన్గా ఆగడం జరిగింది.రెండు గ్రామాల రైతులు రెడ్డిపల్లి, మద్దూరు గ్రామ రైతులు ఫోన్ చేసి మాకు కరెంటు సరిగ్గా రావడంలేదని ఫోన్ చేస్తే మేము ఇక్కడికి సబ్ స్టేషన్ దగ్గర ఆగడం జరిగింది.రేవంత్ రెడ్డి 24 గంటలు కరెంటు ఇస్తమంటున్నాడురెడ్డిపల్లి మద్దూరు గ్రామాల ప్రజలు 12-13 గంటలకు కరెంటు మాత్రమే వస్తుంది. మాకు ఇబ్బంది అవుతుంది నారుబోసే సమయము పొలానికి నారేసే టైం ఇబ్బంది అవుతుందని.. ఫోన్ చేస్తే ఇది నిజమా కాదా అని సమస్య ఏంది అని తెలుసుకుందామని నర్సాపూర్ సబ్ స్టేషన్ కు రావడం జరిగింది.ఇక్కడ లాక్ బుక్ చూస్తే కేవలం 12 గంటల కరెంటు మాత్రమే వచ్చింది.ఇంకొక రోజు చూస్తే సాయంత్రం ఐదు గంటలకు పోయి ఉదయం 3:00 వచ్చింది. అంటే 14 గంటలు మాత్రమే వచ్చింది ఇంకొక రోజు చూస్తే 13 గంటల కరెంట్ వచ్చింది అంటే ఈ విధంగా 12,13 గంటల కరెంటు మాత్రమే వస్తుంది.రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు కరెంటుకు మేమే చాంపియన్, 24 గంటల కరెంటుకు మేమే బ్రాండ్ అంబాసిడర్ అని చెప్పిండు.మరి 12 గంటల కరెంట్ ఎందుకు వస్తుంది నాయనా రేవంత్ రెడ్డి.ఆనాటి కాంగ్రెస్ పాలనలో కరెంటుతో రైతులు ఇబ్బందులు పడ్డారునేడు కాంగ్రెస్ పాలనలో రైతులు కరెంటుతో ఇబ్బందులు పడుతున్నారు.నాడు ఎరువులకు ఇబ్బందులు పడ్డారునేటి కాంగ్రెస్ పాలనలో ఎరువులకు ఇబ్బందులు పడుతున్నారు.మేం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తా ఉన్నాం రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలి.భట్టి విక్రమార్క మీరు పెద్దపెద్ద మాటలు మాట్లాడడం కాదు,

కెసిఆర్ అంటేనే 24 గంటల కరెంటు కు బ్రాండ్ అంబాసిడర్:

ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా రైతుల కోసం 24 గంటలు నాణ్యమైన కరెంటు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం.

కానీ మీరు వచ్చిన తర్వాత 12 13 గంటల కరెంటు కూడా రైతులకు రావడం లేదు,

ఏది చూసినా సగం సగమే ఉంది రేవంత్ ప్రభుత్వంలో

24 గంటల కరెంటు రైతు బంధు, రుణమాఫీ బోనస్ అన్నిట్లో సగం సగం,దమ్ముంటే అసెంబ్లీలో విద్యుత్ సరఫరా మీద చర్చ పెట్టండిప్రతిపక్షాల మీద బురద జల్లడం కాదు,

రైతు సమస్యల మీద ప్రజల సమస్యల మీద చర్చ పెట్టండి

రైతులకు ఇచ్చిన హామీలు ఎగ్గొటినందుకు భయపడి కారు గుర్తు కనపడే ఎన్నికలు పెడుతలేదు.రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే కో ఆపరేటివ్ ఎన్నికలు పెట్టుఈ ప్రభుత్వమే రైతు వ్యతిరేక ప్రభుత్వం. మేం ఒచ్చి చూసినం అని ఈ అధికారుల మీద చర్యలు తీసుకోకూ రేవంత్ రెడ్డి.నీకు నిజాయితీ ఉంటే రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

# దౌలతాబాద్ లో ప్రభుత్వ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు



**సిద్దిపేట: పెన్ పవర్:** క్రిస్మస్ పండగను పురస్కరించుకొని దౌలతాబాద్ లో ప్రభుత్వం నిర్వహించిన క్రిస్మస్ పండుగ సంబరాల కార్యక్రమానికి మంత్రి వివేక్ గడ్డం వెంకటస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమం కోసం ఎప్పుడూ కృషి చేస్తుందని అన్నారు. ప్రపంచమంతటికి శాంతి, క్షమా గుణాలను అందించిన ఏసుక్రీస్తు ను స్మరించుకుంటూ క్రిస్మస్ పండగలో పాలుపంచుకోవడం నాకు చిన్ననాటి నుండి అలవాటని వారిని అనుసరించి క్షమాగుణాన్ని నేర్చుకున్నానని అన్నారు. క్రైస్తవ సోదరులు సంతోషంగా క్రిస్మస్ పండుగను అందరి మధ్య జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా క్రిస్మస్ పండుగను నిర్వహిస్తుందని తెలిపారు. ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతుందని వాటిలో భాగంగా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు 27 వేలకోట్ల రూపాయలను రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అందించింది అని అన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ తదితర కార్యక్రమాలను చేపట్టిందని, త్వరలో కొత్త పెన్షన్ లను కూడా అందిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం మీ మధ్యలో క్రిస్మస్ పండుగను జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. అందరు సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఈ క్రిస్మస్ పండుగ సంబరాల కార్యక్రమం ఏర్పాటుచేయడమైనదని తెలిపారు. కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని, ప్రజలను దేవుడు దీవించాలని ఆశించారు.

అనంతరం ముఖ్య అతిథులు క్రిస్మస్ కేకును కట్ చేసి క్రైస్తవ సోదరులకు తినిపించారు.

ఈ కార్యక్రమంలో దౌలతాబాద్ సర్పంచ్ అనురాధ రమేష్, పాస్టర్లు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పిల్లలను విక్రయిస్తున్న ముఠా అరెస్టు

**మాదాపూర్: పెన్ పవర్:** మాదాపూర్ డీసీపీ రితిరాజ్ మీడియా సమావేశం నిర్వహించారు. మాదాపూర్ పోలీసులు మియాపూర్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించాం. పిల్లలను విక్రయిస్తున్న 11 మంది ముఠా సభ్యులను అరెస్ట్ చేసామని అన్నారు. ఇందులో ఎనిమిది మహిళలు ఉన్నారు.. ముగ్గురు పురుషులు ఉన్నారు.. వారి వద్ద నుండి ఇద్దరు శిశువులను స్వాధీనం చేసుకున్నాము. అహ్మదాబాద్ నుండి నిందితులు హర్ష రాయ్, దారం లక్ష్మీ బాబును కొనుగోలు చేసి తీసుకువచ్చారు అహ్మదాబాద్ లోని లేబర్ క్యాంప్ నుండి బాబు కొనుగోలు చేసి తీసుకు వచ్చారు.. సిద్దిపేటలో ఒక బాబును కొనుగోలు చేసి తీసుకు వచ్చారు. సిద్దిపేట నుండి తీసుకు వచ్చిన బాబు తల్లిదండ్రులను గుర్తించామని అన్నారు.

ఈ గ్యాంగ్ లో నలుగురు పై చాలా కేసులు ఉన్నాయి. గంగాధర్ రెడ్డిపై 13, బాబు రెడ్డిపై రెండు, నాగలక్ష్మి, హర్షపై రెండు కేసులు ఉన్నాయి. గంగాధర్ రెడ్డి వీర్య దాత, సరో గసి కోసం మహిళలను ఐవిఎఫ్ సెంటర్లకు తీసుకు వస్తూ ఉంటాడు. గ్యాంగ్ సభ్యులు పేద దంపతులను గుర్తించి వారికి డబ్బు ఆశ చూపించి వారి వద్ద పిల్లలను కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో పేద దంపతులకు మూడు లక్షలు ఇచ్చి పిల్లలను కొనుగోలు చేస్తున్నారు.



కొనుగోలు చేసిన పిల్లలను డిమాండ్ ఉన్నవారికీ విక్రయిస్తున్నారు. నిందితులకు ఐవీఎఫ్ సెంటర్ లతో సంబంధాలు ఉన్నాయని అన్నారు.అరెస్ట్ అయిన 11 మందిలో సృష్టి కేసుతో ఎవరెవరికీ సంబంధాలు ఉన్నాయో దర్యాప్తు చేస్తాం. గంగాధర్ రెడ్డి, హర్ష రాయ్, సంగీత ముగ్గురు సృష్టి కేసులో నిందితులుగా ఉన్నారు. గోపాలపురం సృష్టి కేసులో రెండో నిందితురాలిగా ఉన్న సంగీత కూడా ఈ కేసులో అరెస్ట్ అయ్యారు. దారం లక్ష్మీ,సంగీత, హర్ష రాయ్ ముగ్గురు శిశువులను కొనుగోలు చేసి తీసుకు వస్తారు. గోపాలపురం పీఎస్ పరిధిలో సృష్టి కేసులో అరెస్ట్ అయిన నిందితులు బెయిల్ పై వచ్చి మళ్ళీ శిశువులను విక్రయిస్తు పట్టుబడ్డారని వెల్లడించారు..

## యేసుక్రీస్తు దీవెనలు ప్రతీ ఒక్కరిపై ఉండాలి

**-ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్**

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది వేడుకలను ప్రభుత్వం నిర్వహించడం సంతోషంగా ఉంది. క్రైస్తవుల ఆరాధ్యుడు యేసుక్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరిపైన ఉండాలి. ఆయన ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలి. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల మనోభావాలను గుర్తించి ప్రభుత్వం అధికారకంగా హిందు, ముస్లిం, క్రైస్తవుల పండుగలను అధికారికంగా నిర్వహిస్తోంది. ఆయా సామాజిక వర్గాల్లోని పేదలకు అవసరమైన సాయం అందిస్తూ ప్రతి కుటుబంలో పండుగ వాతావరణం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు. మంథని నియోజకవర్గం లోని అన్ని చర్చిలలో క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నామని ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ తెలిపారు.

## నూతన సంవత్సర వేడుకల్లో హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవు



**హైదరాబాద్ డిసెంబర్ 24: పెన్ పవర్:** నూతన సంవత్సర వేడుకల్లో హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ సిపి సజ్జనార్ తెలిపారు. నేటి నుంచి హైదరాబాద్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..డిసెంబరు 31 రాత్రి హైదరాబాద్ లోని 100 ప్రాంతాల్లోని డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జరుగుతాయని, తనిఖీల్లో పట్టుబడితే వాహనాలు సీజ్, రూ. 10 వేలు జరిమానా ఉంటుందని సజ్జనార్ హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే 6 నెలల జైలు శిక్ష విధించబడుతుందని, తనిఖీల కోసం 7 ప్లాటూన్ల అదనపు బలగాలు ఏర్పాటు చేశామని తెలియజేశారు. పబ్ లు, త్రీస్టార్, ఆపై హోటళ్లలో అర్ధరాత్రి ఒంటిగంట వరకే అనుమతని.. మాదకద్రవ్యాలు, అశ్లీల నృత్యాలకు యజమానులదే బాధ్యతని సూచించారు. రద్దీ ప్రాంతాలు, పార్టీ వెన్యూలు, జంక్షన్లో మఫ్టీలో 15 షీ టీమ్స్ ఏర్పాటు చేశామని సిపి సజ్జనార్ పేర్కొన్నారు.

## జవహర్ నగర్ డంపింగ్ యార్డును పరిశీలించిన ఎంపి ఈటల



**మేడ్చల్: పెన్ పవర్:** మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ను ఎంపీ ఈటల రాజేందర్ పరిశీలించారు. ఈటల మాట్లాడుతూ హైదరాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని దాదాపు రెండు కోట్ల మంది జనాభా చెత్తను మొత్తం జవహర్ నగర్ లో వేసి లక్షలాదిమంది ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. రాంకీ సంస్థ కోర్టులకు తప్పుడు సమాచారం ఇస్తూ తప్పు త్రోవ పట్టిస్తుందని దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ ప్రభుత్వం గనుక స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## హుస్నాబాద్ నియోజకవర్గం సమస్యలపై మంత్రి పొన్నం సమీక్ష



**హుస్నాబాద్ పెన్ పవర్:** విద్యా,వైద్య వ్యవసాయ, విద్యుత్ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో విద్యుత్ సంబంధిత సమస్యలు, యాసంగి పంటల విధానం, యూరియా సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలు,పాఠశాల మౌలిక వసతులు,మండలాల్లో మెడికల్ క్యాంపులు గ్రామాల్లో ఆరోగ్య పరీక్షలు తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సమీక్షా సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, మెడికల్ ఆఫీసర్లు,ఏఈలు, ఎంపిఓలు, ఎంఈవో లు ఇతర అధికారులు పాల్గొన్నారు.


## తీగుల్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**సిద్దిపేట: పెన్ పవర్:** జగదేవ్ పూర్ మండలంలోనీ తీగుల్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న మేజర్, మైనర్ రిపేర్లను పరిశీలించారు. వాటర్ కనెక్షన్, టాయిలెట్స్ లో ట్యాప్ లీకేజీలు చెక్ చేసుకోవాలని రిపేర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి అయ్యేలా పని చేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. పిఎచ్ సి లోపల ఎల్లపుడు శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అటెండెన్స్ రిజిస్టర్ ఓపి రిజిస్టర్ వెరిఫై చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్ మరియు సిబ్బందిని ఆదేశించారు. ప్రాంగణం బయట చెత్త చెదారం పిచ్చి మొక్కలు తొలగించాలని గ్రామపంచాయతీ అధికారులను ఆదేశించారు.

# తెలంగాణకు పెద్ద ఎత్తున పులులు

**అదిలాబాద్, డిసెంబర్ 24, పెన్ పవర్:** నీరు ఎత్తు నుంచి పల్లం ప్రాంతానికి ప్రవహిస్తుంది. అది సృష్టి నియమం కూడా. కేవలం నీరు మాత్రమే కాదు.. జంతువులకు కూడా ఇది వర్తిస్తుంది. కాకపోతే ఎత్తు, పల్లం నిబంధనలు ఇక్కడ వర్తించవు. కేవలం ఆహారం, గూడు, నీరు అనేవి మాత్రమే జంతువుల వలసకు వర్తిస్తాయి. జంతువులలో మిగతా వాటితో పోల్చి చూస్తే.. పులులు కాస్త విభిన్న తత్వాన్ని ప్రదర్శిస్తుంటాయి. ఆహారం, ఆవాసం, తోడు, సురక్షితం ఇలా అన్ని విషయాలలోనూ పకడ్బందీ లెక్కలతో ఉంటాయితెలంగాణకు సరిహద్దున మహారాష్ట్ర ఉంటుంది. మహారాష్ట్రలో దట్టమైన అడవులు ఉన్నాయి. అయినప్పటికీ అక్కడి పులుల కొన్ని ప్రస్తుతం తెలంగాణకు వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలలో సంచరిస్తున్నట్టు తెలుస్తోంది.సరిగ్గా కొద్ది రోజుల క్రితం టిప్పరేశ్వర్ అభయారణ్యం, తడోబా రిజర్వ్ నుంచి కొన్ని పులులు తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. అందులో కొన్ని పులులు దక్షిణ మార్గంలో ఉన్న ప్రాంతాలలోకి వెళ్లిపోయాయని తెలుస్తోంది. అయితే కొన్ని పులులు ఈ మార్గాల గుండా ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి అనుకూలమైన వాతావరణము లేదు. ఎందుకంటే ఈ ప్రాంతాలలో గతంలో దట్టమైన అడవులు ఉండేవి. అక్రమార్కులు ఈ అడవిని చదును చేయడం వల్ల పులులు ఆ మార్గాల గుండా వెళ్లడానికి అవకాశం లేకుండా పోయిందని టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో మల్యాలపల్లి సమీపంలో పులి ఉన్నట్టు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో సిబ్బంది రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపడుతున్నారు.. " ఇక్కడ పెద్దగా అటవీ ప్రాంతం లేదు. కానీ కొన్ని కొండల వద్ద ఒక మేకల కాపరి పులి కాలి ముద్రలను



చూసినట్టు మాకు చెప్పాడు. మేము పులిని గుర్తించడానికి ప్రయత్నిస్తున్నామని" డిప్యూటీ రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ కొమరయ్య పేర్కొన్నారు.ఈ పులి గతంలో రామగుండం సమీపంలోని సింగరేణి ప్రాంతాలలో కనిపించింది. పులి కనిపించినట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ జిల్లా పరిధిలోని 12 మండలాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కొమురయ్య సూచించారు. కామారెడ్డి జిల్లాలో గత వారం కల్పించిన ఒక పులి ఇప్పటికీ ఆ ప్రాంతంలో కనిపిస్తూనే ఉంది. అది అనేక పశువులను వెంబడించింది. కొన్ని పశువులను చంపి తినేసింది. పులి తిన్న తర్వాత మిగిలిన కళేబరాలను చూసి అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పులి నిరంతరం సంచరిస్తున్న నేపథ్యంలో పశువులను చంపి తినే అవకాశం ఉండవచ్చని అడవి శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు దోమ కుంట, బిబి పెంట, బిక్నూరు మండలాలలో పులి కదలికలు కనిపించాయి.కొత్తగా వచ్చిన పులుల వల్ల.. ఈ ప్రాంతంలో ఉన్న మిగతా పులులు కూడా బయటకు వస్తున్నాయి.

మూడు రోజుల క్రితం నాగర్ కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ మండలం లో ఒక పులి ఉన్నట్టు అటల్ శాఖ అధికారులకు సమాచారం అందింది. ఈ పులి అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ నుంచి మల్లేశ్వరం, వేమకల్, యంగంపల్లి ప్రాంతం నుంచి వచ్చి ఉండవచ్చని అధికారులు భావించారు. " ఈ పులి ఆంధ్రప్రదేశ్ లోని నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ నుంచి కృష్ణ నదికి అవతలి వైపు నుంచి వచ్చింది. గత ఏడాది కూడా ఒక పులి నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ నుంచి తిరిగి వచ్చింది" అని కొల్లాపూర్ అటవీశాఖ అధికారి ముజీబ్ గౌరీ వెల్లడించారు. " అప్పటినుంచి అది కనిపించలేదు. దాని ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నాం. మా రేంజ్ ఆఫీసర్ హుస్సేన్, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర నాయకత్వంలో పులి సంచారం గురించి పరిశీలిస్తున్నాం. ఇక్కడ కెమెరా ట్రాప్ లు అందుబాటులో ఉంచాం. నదిని దాటి నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ లోకి తిరిగి వెళ్లే బదులు అది అమ్రాబాద్ టైగర్ రిజర్వుల్లోకి వెళ్లి ఉండవచ్చుని" గౌరీ ప్రకటించారు. పులి సంచారం ఉన్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో సమీప ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. మహారాష్ట్ర ప్రాంతంలో ఆహారం సరిగా లభించకపోవడం, ఆడపులుల సంఖ్య తక్కువగా ఉండడంతో పులులు ఇటువైపు వస్తున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ లో చిక్కులు తప్పవా

**హైదరాబాద్, డిసెంబర్ 24, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రస్తుతం కీలక మలుపు తిరిగింది. విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం తన దూకుడును పెంచడంతో, ఈ వ్యవహారం ఇప్పుడు నేరుగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావుల ముంగిటకు చేరినట్లు కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లుగా ఆరోపణలు వస్తున్న ఫోన్ ట్యాపింగ్ ఉదంతం కేవలం ఒక క్రైమ్ కేసుగానే కాకుండా, రాజకీయ భూకంపంగా మారింది. సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ నేతృత్వంలోని సిట్ బృందం పకడ్బందీగా ఆధారాలు సేకరిస్తోంది. ఇటీవల కీలక నిందితుడు, మాజీ నిఘా విభాగం చీఫ్ టి. ప్రభాకర్ రావు విచారణలో వెల్లడించిన అంశాలు ఇప్పుడు గులాబీ బాస్ చుట్టూ ఉచ్చు బిగించేలా ఉన్నాయి.అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే విపక్ష నేతలు, వ్యాపారవేత్తలు, చివరకు సొంత పార్టీలోని అసంతృప్త నేతల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేసినట్లు దర్యాప్తులో తేలింది. ముఖ్యంగా విదేశాల నుంచి విచారణకు సహకరిస్తున్నట్లు చెబుతున్న ప్రభాకర్ రావు, అప్పటి ప్రభుత్వంలోని అగ్రనేతల సూచనల మేరకే ఈ వ్యవస్థ నడిచినట్లు కీలక సమాచారం అందించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో నిధుల మళ్లింపును పర్యవేక్షించడానికి, ప్రతిపక్షాల వ్యూహాలను చిత్తు చేయడానికి ఈ ట్యాపింగ్ పరికరాలను వాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మారబోతోందని తెలిసిన వెంటనే ఇంటెలిజెన్స్ కార్యాలయంలోని హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేయడం ఈ కేసులో అతిపెద్ద నేరంగా పరిగణించబడుతోంది.అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, సిట్ అధికారులు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులకు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. త్వరలోనే రాజకీయంగా ఎలాంటి అడ్డంకులు లేకుండా నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభాకర్



రావుతో పాటు ఇతర నిందితుల స్టేట్‌మెంట్లలో వీరి పేర్లు ప్రస్తావనకు రావడంతో, అసలు ఈ నిర్ణయాల వెనుక ఎవరున్నారు? దీనికి నిధులు ఎక్కడి నుండి వచ్చాయి? అనే కోణంలో ప్రశ్నలు సిద్ధం చేసినట్లు సమాచారం.ఈ పరిణామాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సానుకూలంగా స్పందించారు. "చట్టం ఎవరికీ చుట్టం కాదు, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష అనుభవించాల్సిందే" అని ఆయన వ్యాఖ్యానించారు. నిజానిజాలు వెలుగులోకి రావాలని, బాధితులకు న్యాయం జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ యుద్ధంలా కాకుండా, ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశంగా బీజేపీ చిత్రీకరిస్తోంది.ఈ కేసు కేవలం నోటీసులతో ఆగిపోతుందా లేదా అరెస్టుల వరకు వెళ్తుందా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కేసును లాజికల్ ఎండ్‌కు తీసుకెళ్లాలని పట్టుదలతో ఉంది. ఇది రాజకీయ కక్ష సాధింపు అని బీఆర్ఎస్ వాదిస్తున్నప్పటికీ, సాంకేతిక ఆధారాలు బలంగా ఉంటే తప్పించుకోవడం కష్టమే. ధ్వంసం చేసిన హార్డ్ డిస్క్‌ల నుండి రికవరీ చేసిన డేటా, నిందితుల మధ్య జరిగిన వాట్సాప్ చాట్స్ ఈ కేసులో కీలకం కానున్నాయి.తెలంగాణ రాజకీయ చరిత్రలో ఇదొక చీకటి అధ్యాయంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత గోప్యతను హరించడం క్షమించరాని నేరం. ఒకవేళ సిట్ సేకరించిన ఆధారాలు కోర్టులో నిలబడితే, బీఆర్ఎస్ అగ్రనాయకత్వం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోక తప్పదు. వచ్చే కొన్ని వారాలు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకం కానున్నాయి.

# బీఆర్ఎస్ సోషల్ మీడియా ఫుల్లీ లోడెడ్




**హైదరాబాద్, డిసెంబర్ 24, పెన్ పవర్:** నేటి కాలంలో రాజకీయ పార్టీలకు బలమైన సోషల్ మీడియా ఉండాల్సిందే. నిజమో లేదా అబద్ధమో గట్టిగా చెప్పగలగాలి. ప్రస్తుతం ప్రపంచం మొత్తం సోషల్ మీడియా చుట్టూ తిరుగుతోంది కాబట్టి.. రాజకీయ పార్టీలకు బలమైన సోషల్ మీడియా అనేది ఒక కనీస అనివార్యతగా మారిపోయింది. అధికారంలో ఉన్న పార్టీ సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ సోషల్ మీడియాను మరింత పద్ధతిగా ఉపయోగించుకోవాల్సి ఉంటుంది.. ఏతా వాతా సోషల్ మీడియా అనేది ప్రస్తుత కాలంలో రాజకీయ పార్టీలకు కనీస అవసరం.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉంది. దశాబ్ద కాలం రాష్ట్రంలో అధికారానికి దూరమైన తర్వాత కాంగ్రెస్ పార్టీ 2023లో గద్దెనెక్కింది.. ఇలాంటి క్రమంలో ప్రభుత్వ పథకాలను.. ప్రభుత్వం చేస్తున్న పనులను.. గత ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన అక్రమాలను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా బలంగా చెప్పగలగాలి. అవసరమైతే విస్తృతమైన నెట్వర్క్ ఏర్పాటు చేసుకొని ప్రజల్లో స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలి.. కానీ ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మర్చిపోయినట్టు కనిపిస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాదిరిగానే ఇప్పుడు కూడా సోషల్ మీడియా ను అంతంతమాత్రంగానే ఉపయోగిస్తుంది.ఇటీవల కెసిఆర్ బయటికి వచ్చారు. రేవంత్ ప్రభుత్వం మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అనుకూల సోషల్ మీడియా మొన్నటి నుంచి అన్ని విభాగాలలో అధికార కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు మొదలుపెట్టింది. అంతేకాదు కేసీఆర్ మాత్రమే తెలంగాణకు రక్షకుడు అన్నట్టుగా ప్రచారం ప్రారంభించింది.. కెసిఆర్ చెప్పిన ప్రతి మాటను నిజమని నమ్మించే ప్రయత్నం చేసింది. ఈ విషయంలో గులాబీ పార్టీ సోషల్ మీడియా విజయవంతమైనది కూడా. వాస్తవానికి ఇలాంటి సమయంలో గులాబీ పార్టీ సోషల్ మీడియాకు బలమైన కౌంటర్ ఇవ్వడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ కు కర్త ఎవరు? కర్మ ఎవరు? క్రియ ఎవరు? అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదు. పైగా కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు

ఆ పార్టీ సోషల్ మీడియా విభాగానికి కీలక స్థాయిలో పనిచేసిన వారంతా సరైన గుర్తింపు లేకపోవడంతో బయటకు వెళ్లిపోయారు. ఇప్పుడు ఎవరో కొందరిని రిక్రూట్ చేసుకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి సోషల్ మీడియా ఆశించిన స్థాయిలో బలాన్ని ఇవ్వలేకపోతోంది.కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ ఎంత బలహీనంగా ఉందో ఏబీఎన్ లో పనిచేసే కీలక న్యూస్ ప్రజెంట్ వెంకటకృష్ణ చేసిన వ్యాఖ్యలే బలమైన నిదర్శనం. సోమవారం నాటి ఏబీఎన్ ప్రైమ్ టైం బులిటెన్ లో వెంకటకృష్ణ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. గులాబీ పార్టీ సోషల్ మీడియా విపరీతంగా ప్రచారం చేస్తుంటే.. కనీసం కౌంటర్ కాదు కదా.. ఏమీ ఇవ్వకుండా ముసుగు తన్ని పడుకున్నారని వెంకటకృష్ణ ఆరోపించారు. దీనిని బట్టి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఎలా మార్పు చెందాలి? ఎలా బలోపేతం అవ్వాలి? అనే విషయాల మీద ఆ పార్టీ పెద్దలు దృష్టి పెడితే మంచిది. లేకపోతే అంతే సంగతులు. ప్రతిపక్ష పార్టీ సోషల్ మీడియా ముందు అధికార పార్టీ సోషల్ మీడియా సైలెంట్ అయిపోతే అంతకుమించిన దరిద్రం మరొకటి ఉండదు.

# ఆధ్యాత్మికత ఆత్మ-పరమాత్మల అనుసంధాత"

**హైదరాబాద్ డిసెంబర్ 24: పెన్ పవర్:** మానవ జీవితం ఆధ్యాత్మికతో ము డిపడి ఉన్న మహోన్నత స్థితి అని, దానికి పలు రచనలు, శ్లోకాలు ధన్యతను చేకూర్చుతాయని డాక్టర్ కె.వి. రమణాచారి అన్నారు.శ్రీ మానస ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయితలు డావ వేదాన్తం ఆంజనేయ కుమారస్వామి, బండారుపల్లి రామచంద్రరావులు శ్రీ వెంకటేశ స్తోత్రములకు తెలుగు భావార్థముల సంకలన గ్రంథాన్ని, ప్రముఖ కవి రఘుశ్రీ రచించిన "రఘుశ్రీ హైకూలు" పుస్తకాన్ని తెలంగాణ ప్రభుత్వ పూర్వసలహా దారులు డా. కె.వి.రమణ చారి ఆవిష్కరించి, ప్రసంగించారు. మాసబ్యాంక్లో ని డా.రమణాచారి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు కడియాల ప్రభాకరరావు అధ్యక్షత వహించారు.డాక్టర్ కె.వి. రమణాచారి ప్రసంగిస్తూ శ్రీ వెంకటేశ్వరస్వామి పద్దెనిమిది శ్లోకాలను ఎంచుకుని తెలుగు భావార్థ రచన గావించిన కుమా రస్వామి, సంకలనకర్త బండారు పల్లి రామచంద్రరావుల కృషి ప్రశంసనీయమని ద్వైతాద్వైతములు, కర్మ యోగములు, భక్తియోగ జ్ఞానయోగ, రాజయోగ, బుద్ధి యోగముల విశ్లేషణ విశేషముగా ఉన్నావని, ఇటువంటి రచనలు మనస్సును ఉద్దీపింపజేసి అలౌకిక తత్వాన్ని, ఆధ్యాత్మిక ఆనందాన్ని కలుగ జేస్తాయని అన్నారు. ఇది నేటి యువతకు అవసరమైన గ్రంథమని అన్నారు. రఘుశ్రీ హైకూ లులో సామాజిక స్పృహ, హాస్యం, వ్యంగ్యం, ఇమిడి ఉన్నాయని కొనియాడారు.అనంతరం గ్రంథకర్తలను ఘనంగా సత్కరించారు.

## కాళేశ్వరం పై ఆశలు



**హైద్రాబాద్, డిసెంబర్ 24, పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు రాజకీయాలు నీళ్ల చుట్టూ తిరుగుతున్నాయి. గత ఆదివారం మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పై కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్య మంత్రి చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో చర్చ కు దారి తీస్తూనే ఉన్నాయి. కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను మర్చిపోక ముందే.. ఆయన కుమారుడు రంగంలోకి వచ్చారు. ఈసారి ఏకంగా ఆయన కాళేశ్వరం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మంగళవారం సిరిసిల్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఆయన పరిపాలన మాఫియా మాదిరిగా ఉందని మండిపడ్డారు.. కెసిఆర్ పరిపాలన కాలంలో చేసిన మంచి పనులకు అనేక రకాలుగా రేవంత్ ప్రభుత్వం వక్ర భాష్యం చెబుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఇందుకోసం రేవంత్ ప్రభుత్వం చేయని పని లేదంటూ మండిపడ్డారు.2023 ఎన్నికల సమయంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేశారని కేటీఆర్ ఆరోపించారు. ఆ పథకం పై బాంబులు వేయడం వల్లే దెబ్బ తిన్నదని అనుమానించారు.. ఆ ప్రాంతంలో ఇసుక మాఫియా చెలరేగిపోతుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్ డ్యాం ల మీద బాంబులు వేశారని మండిపడ్డారు. మానవ నిర్మిత అద్భుతమైన కట్టడాల మీద మానవ విధ్వంసం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా గా పేరుపొందిన రాజేంద్ర సింగ్ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలిస్తున్న తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. "ఇసుకను తరలించడానికి ప్రాజెక్టులకు రంధ్రాలు చేస్తున్నారు. అందులో బాంబులు పెట్టి పేల్చుతున్నారు. ఇసుకను దోచుకోవడానికి ప్రాజెక్టులు అడ్డుగా ఉన్నాయని భావించి.. కోట్ల రూపాయల ప్రజల సొమ్ముతో నిర్మించిన చెక్ డ్యాములను పడగొడుతున్నారు. భూగర్భ జలాల పెంపుదల కోసం మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చెక్ డ్యాములను నిర్మించాం. ఇసుక కోసం వాటిని కూల్చివేసి.. పొలాలను ఎడారులుగా మారుస్తున్నారు. ఈ పరిణామాలు తెలంగాణ రాష్ట్రానికి ఎంత మాత్రం మంచిది కాదు. వీటిని చూస్తూ ఊరుకోమని" కేటీఆర్ వ్యాఖ్యానించారు.కేటీఆర్ చేసిన వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ నాయకులు కూడా అదే స్థాయిలో సమాధానం చెప్పారు. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసిందని ప్రశ్నించారు.. బాంబులతో పెట్టి కూల్చేస్తే కూలిపోయే స్థాయిలో కాళేశ్వరం ఉందా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పడ్డది చిన్న పర్రే అని.. రిపేర్ చేస్తే సరిపోతుంది అని కేటీఆర్ గతంలో అన్నారని.. ఇప్పుడేమో బాంబులు పెట్టి కూల్చేశారని ఆరోపిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఏదైనా ఒక మాట మీద కేటీఆర్ నిలబడాలని సూచించారు.

## నేను ఏ పార్టీలో వుంటే ఆ పార్టీ గెలుస్తుంది

**హైదరాబాద్: పెన్ పవర్:** ఖైతరాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హాట్ కామెంట్స్ చేసారు. చ ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎవ్వరు ఏ పార్టీ లో ఉన్నారో నాకు తెలియదు కానీ... నేను మాత్రం కాంగ్రెస్ పార్టీ లోనే ఉన్నానని అన్నారు. జీహెచ్ఎంసి పరిధి ఓఆర్ఆర్ వరకు విస్తరించడం తో హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుంది. ఎంఐఎం తో



కలుపుకొని కాంగ్రెస్ 300 డివిజన్ లలో గెలుస్తుంది. నేను ఏ పార్టీ లో ఉంటే ఆ పార్టీ గెలుస్తుందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 300 డివిజన్ లను తిరుగుతా. కాంగ్రెస్ పథకాలకు ప్రజల వివరిస్తానని అన్నారు.

## మేడారంలో గద్దెలపై కొలువుదీరిన గిడిద్దరాజు, గోవిందరాజులు



**ములుగు డిసెంబర్ 24: పెన్ పవర్:** మేడారం మహా జాతర కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గద్దెలపై పగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువుదీరారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గోవిందరాజును బుధవారం ఉదయం 6 గంటలకు, పగిడిద్దరాజును 9.45 గంటలకు పూజారులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భక్తులను గద్దెల ప్రాంగణంలోకి రానివ్వకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులు కుటుంబాలతోపాటు హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. మేడారం జాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరుగనుంది. దీనికి తెలంగాణతోపాటు చుట్టుపక్కల ఉండే రాష్ట్రాల నుంచి కోటి మందికిపైగా భక్తులు తరలి వస్తారని అంచనా.ఈ సారిగా నూతనంగా నిర్మించిన గద్దెలపై సమ్మక్క, సారలమ్మతోపాటు పగిడిద్ద రాజు, గోవిందరాజులను కొలువుదీర్చుతున్నారు. జాతర ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. దాని మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పు ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది.పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను సమ్మక్క-సారలమ్మ గద్దెలు ఉండే వరుసలోకి మార్చారు. ఈ ఏర్పాటు ద్వారా భక్తులంతా ఒక వరుసలో దర్శనానికి వెళ్లేందుకు వీలు కలుగనుంది. వృత్తాకారంలో ఉండే గద్దెల చుట్టూ 8 స్తంభాలు ఉంటాయి. వాటి మధ్యలో వెదురు బొంగులతో డెకరేషన్ చేస్తారు.

# సర్ తో అంతా సరౌతుందా...

**హైదరాబాద్, డిసెంబర్ 24, పెన్ పవర్:**
భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. మరోవైపు మేధావి వర్గం సైతం అభ్యంతరాలు చెబుతోంది. ఈ సవరణలో భాగంగా చాలా రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారు. దీంతో ఇది దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఎన్నికల సంఘం తాజాగా తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాల ప్రకారం తమిళనాడులోని 97.37 లక్షల ఓట్లను తొలగించినట్లు ఈసీ అధికారికంగా ప్రకటించింది. గుజరాత్ లోను 73 లక్షల ఓట్లను జాబితా నుంచి తొలగించారు. తొలుత బీహార్లో ఈ ప్రక్రియ చేపట్టి ఎన్నికలు నిర్వహించారు. అక్కడ ఎన్డీఏ ఘనవిజయం సాధించడంతో ప్రత్యేక సమగ్ర సవరణ అనేది రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్నది అనే వాదన బలపడింది. ప్రజాస్వామ్యం పారదర్శకంగా ఉండాలన్న ఆలోచనతోనే ఈ ప్రక్రియ చేపట్టినట్లు కేంద్ర ఎన్నికల సంఘం చెబుతోంది. బీహార్లో ప్రత్యేక ఏజెన్సీ ద్వారా అధ్యయనం చేసిన తరువాత మాత్రమే ఈ ప్రక్రియ చేపట్టినట్లు చెప్పుకోస్తోంది ఈసీ. వాస్తవానికి ప్రతి రాష్ట్రంలోనూ మరణించిన వారి పేరుతో ఓట్లు ఉంటున్నాయి. వలస వెళ్లిన వారి పేరుతో ఓట్లు ఉంటున్నాయి. ఒక్కొక్కరికి రెండు చోట్ల కూడా ఓట్లు ఉంటున్నాయి. ఈ విషయంలో ప్రత్యేక సమగ్ర సవరణ మంచిదే. కానీ ప్రజలతో పాటు మేధావుల సందేహాలను నివృత్తి చేయడంలో మాత్రం ఎలక్షన్ కమిషన్ అనుకున్న స్థాయిలో శ్రద్ధ చూపడం లేదు. అందుకే రాజకీయ పార్టీల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికల సంఘం మాత్రం ఈ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరుగుతోందని స్పష్టం చేస్తోంది. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల అనంతరం అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పిస్తున్నామని.. అర్హులైన వాటర్లు తమ పేరును తొలగించబడితే సంబంధిత బూత్ లెవెల్ అధికారులను కానీ.. ఈసీ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచిస్తుంది. తుది జాబితా విడుదలకు ముందు అన్ని అభ్యంతరాలను పరిశీలిస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే బీహార్లో తమ ఓట్లు గల్లంతయ్యాయని.. చాలామంది ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తమ ఓట్లను దూరం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ అభ్యంతరాలు ఉంటే చెప్పాలని చెబుతోంది. తమ ఓటు ఉందో లేదో తెలుసుకోవాలని సూచిస్తుంది. అయితే ఇప్పటివరకు తమ సొంత ప్రాంతంలో ఓటు వేసేవారు.. తాము నిజంగా ఓటర్లమని ధ్రువీకరించుకోవాల్సి వస్తోంది. దీనిపైనే ఎక్కువగా ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. చనిపోయారని చెప్పి చాలా మంది ఓట్లను తొలగించారు. అటువంటి వారు న్యాయస్థానాలను ఆశ్రయించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే ఈ సమగ్ర సవరణ అనేది మంచి కార్యక్రమమే. కానీ సరైన అధ్యయనం చేయకుండా చేస్తే మాత్రం ఇబ్బందికరమే. మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ ఓటు అనేది ఆయుధం. అటువంటి ఓట్లను సవరించే క్రమంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

బీహార్లో అధ్యయనం చేసిన తరువాత మాత్రమే మిగతా రాష్ట్రాల్లో చేస్తున్నామని ఎలక్షన్ కమిషన్ చెబుతోంది. కానీ ఈ అధ్యయనం ఎవరు చేశారు? ఏ సంస్థ చేసింది? ఏమని నివేదిక ఇచ్చింది? అనే విషయాలను మాత్రం ఎలక్షన్ కమిషన్ బయట పెట్టడం లేదు. అందుకే ఇప్పుడు అందరిలోనూ అదే అనుమానం. దేశవ్యాప్తంగా సమాజం పట్ల అవగాహన ఉన్న పౌరులతో పాటు తటస్థులు, మేధావులు ఇదే విషయంపై ప్రశ్నిస్తున్నారు. కానీ ఎన్నికల కమిషన్ నుంచి ఆశించిన స్థాయిలో జవాబు రావడం లేదు. ఇప్పటికే ఎన్ డి ఏ పై ఒక అపవాదు ఉంది. ఈవీఎంల టెంపరింగ్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. దానిపై ఒక వైపు గలాటా నడుస్తుంటే.. కొత్తగా సమగ్ర సవరణ విషయంలో ఎన్నికల కమిషన్ ఎంత జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి. రాజ్యాంగబద్ధమైన ఓ స్వతంత్ర సంస్థగా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎన్నికల కమిషన్ పై ఉంది. దానినే గుర్తు చేస్తున్నారు మేధావులు. ఆపై పౌర సమాజం. ఇక తేల్చుకోవాల్సింది ఎన్నికల కమిషన్ మాత్రమే.

# ఆ రెండు పార్టీలు కమలంపై కయ్యానికి దిగుతాయా

**హైదరాబాద్, డిసెంబర్ 24, పెన్ పవర్:**
భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ , వైసీపీ అధినేత జగన్ ఇటీవల కొన్ని ప్రత్యేకమైన సిగ్నల్స్ పంపుతున్నారు. తాము బీజేపీకి వ్యతిరేకంగా భారీ యుద్ధం చేసేందుకు రెడీ అన్నట్లుగా వారు సంకేతాలు ఇస్తున్నారు. జగన్ ఎప్పుడూ లేని విధంగా ప్రధాని మోదీ చేపట్టిన కార్యక్రమాలపై అవినీతి ఆరోపణలు చేస్తూండటం, కేసీఆర్ నేరుగా ప్రెస్‌మీట్‌లో మోడీ వచ్చాకే తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతోందన్నట్లుగా మాట్లడుతూండటంతో ఏదో జరుగుతోందన్న అభిప్రాయం బలపడుతోంది. వీరిద్దరూ ఇతర కూటముల్లోకి వెళ్లలేరు. కానీ కలసి రాజకీయాలు చేస్తే బలంగా ఉంటామని మాత్రం నమ్ముతున్నారు. దేశ రాజకీయాలంతా ఓ వైపు సాగుతూంటే.. బీఆర్ఎస్, వైసీపై మాత్రం మరో వైపు సాగుతూంటాయి. వారు కాంగ్రెస్ కూటమిలోకి వెళ్లలేరు. బీజేపీ కూటమిలోకి వెళ్లలేరు. కాంగ్రెస్ కూటమిలోకి వెళ్తే ఎక్కడ టార్గెట్ అవుతామో.. ఎక్కడ కేసుల పాలవుతామోనన్న భయం ఉంటుంది. అదే సమయంలో వీర బీజేపీ కూటమిలోకి వెళ్లలేరు. ఇద్దరికీ ఓటు బ్యాంక్ సమస్య ఉంటుంది. జగన్ బీజేపీతో పొత్తులు పెట్టుకుంటే ఆయన పార్టీ నిర్వీర్యం అయిపోతుంది. కేసీఆర్ ఇప్పుడు చాలా ఓటు బ్యాంక్ ఆ పార్టీకి కోల్పోయారు కాబట్టి.. పొత్తులు పెట్టుకోవడానికి రెడీనే .కానీ బీజేపీనే ఆసక్తి చూపించడం లేదు. పార్టీని విలీనం చేయడానికి కూడా సిద్ధపడ్డారని సీఎంరమేష్ చెప్పారు. సాధ్యం కాలేదు. అందుకే తాము ఓ కూటమిగా ఉండాలని కేసీఆర్, జగన్ అనుకుంటున్నారు. జగన్ పుట్టినరోజు సందర్భంగా సజ్జల..జగన్మోహన్ రెడ్డి దేశవ్యాప్తంగా చక్రం తిప్పుతారని జోస్యం చెప్పారు. అందరి లక్ష్యం అదే. కేసీఆర్ కూడా అలాంటి లక్ష్యం కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. కానీ కలసి రావడం లేదు. గత ఎన్నికల్లో ఏపీ,తెలంగాణ, మహారాష్ట్ర ఇలా కొన్ని రాష్ట్రాలను టార్గెట్ చేసి రాజకీయాలు చేస్తే జీరో ఫలితం వచ్చింది. అటు జగన్ పరిస్థితి అంతే. అంతే వచ్చే ఎన్నికల్లో అయినా ఆ చక్రం తమ చేతికి వస్తుందని అనుకుంటున్నారు. వైసీప బలం తనకు అదనపు బలం అవుతుందని కేసీఆర్ అనుకుంటున్నారు. జగన్ అలా అనుకోకపోయినా.. ఇప్పటికైతే కేసీఆర్ తో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. వచ్చే ఆరు నెలల్లో తమ రాజకీయ వ్యూహాన్ని మార్చుకుని బీజేపీపై వీరు యుద్ధం ప్రకటించబోతున్నారని తాజా పరిణామాలను బట్టి అర్థం అవుతోందని రాజకీయ వర్గాలంటున్నాయి. కానీ ఇప్పుడు మాట్లాడే మాటలన్నీ కేవలం బీజేపీకి తామున్నామని గుర్తు చేయడానికేనని కొంత మంది అంటున్నారు. ప్రస్తుతం బీజేపీ హైకమాండ్ వీరి ఉనికిని పెద్దగా గుర్తించడం లేదు. వీరు కనుక.., బీజేపీపై యుద్ధం ప్రకటిస్తే.. రాజకీయాల్లో కాస్త మార్పు వస్తుంది. కానీ వీరు ఆ ధైర్యం చేస్తారా..? ఆరంభ శూరత్వమా అన్నది త్వరలో తెలుస్తుంది.

## ఏడాదిలో కండోమ్స్ కోసం లక్ష రూపాయిలు...

# వాడు మగాడురా బుజ్జీ

**ముంబై, డిసెంబర్ 24, పెన్ పవర్:**
మరికొద్ది రోజుల్లో 2025 కాలగర్భంలో కలిసిపోనుంది.. ఈ నేపథ్యంలో ఈ ఏడాదికి సంబంధించిన అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ఈ కామర్స్ అనేది ప్రస్తుతం మన జీవితంతో అవినాభావ సంబంధాన్ని ఏర్పరచుకున్న నేపథ్యంలో.. ఈ కామర్స్ సంస్థలు తమ లావాదేవీలను వెల్లడిస్తుంటాయి. తమకు ఎదురైన అనుభవాలను పంచుకుంటాయి. మనదేశంలో ఈ కామర్స్ సంస్థలలో దిగ్గజ కంపెనీ ఇన్ స్టా మార్ట్ ఈ ఏడాదికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. ఆ సంస్థ వెల్లడించిన ఈ ఏడాది వార్షిక నివేదిక ప్రకారం.. అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. బెంగళూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి అత్యంత కనిష్టంగా ఖర్చు పెట్టాడు. అతడు కేవలం పది రూపాయల ఆర్డర్ మాత్రమే ఇచ్చాడు. పది రూపాయల విలువైన ప్రింట్ అవుట్ కావాలని అతడు ఆర్డర్ పెట్టాడు. వాటిని మాత్రమే అతడు తెప్పించుకున్నాడు. ఈ ఏడాది ఇన్స్టా మార్ట్ లో అత్యంత కనిష్టమైన లావా దేవి ఇదేనని ఆ సంస్థ పేర్కొంది.. హైదరాబాద్ నగరానికి చెందిన ఓ వ్యక్తి లేటెస్ట్ ఐఫోన్ కోసం ఏకంగా 4.3 లక్షలు ఖర్చు పెట్టాడు.. ఇది అత్యంత ఖరీదైన లావాదేవీ అని ఇన్స్టా మార్ట్ ప్రకటించింది. కేవలం అతడు ఫోన్ల కోసమే భారీగా ఖర్చు పెట్టాడని ఇన్స్టా వెల్లడించింది. మరోవైపు ఓ వ్యక్తి ఏడాదిలో 22 లక్షల ను వివిధ ఉత్పత్తుల కొనుగోలుకు ఖర్చు పెట్టాడు.




ముంబై నగరానికి చెందిన ఓ వ్యక్తి దాదాపు 15.16 లక్షల విలువైన బంగారాన్ని కొనుగోలు చేశాడు. చెన్నై నగరానికి చెందిన ఓ వ్యక్తి కలిడోలిమ్ ల కోసం ఏకంగా లక్ష రూపాయలు ఖర్చు పెట్టాడు. ఇన్ స్టా మార్ట్ నివేదిక ప్రకారం మనదేశంలో టైర్ 2 నగరాలలో రాజ్ కోట్ వేగవంతమైన అభివృద్ధిని నమోదు చేస్తోంది. ఇప్పటికే ఈ నగరం 10రెట్ల వృద్ధిని నమోదు చేసింది. లుధియానా ఏడు, భువనేశ్వర్ నాలుగు రెట్ల వృద్ధిని శ్రద్ధ చేసుకుంది.. ప్రజలు ఎక్కువగా ఆర్డర్ చేసిన వాటిల్లో కరివేపాకు మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత పెరుగు, గుడ్లు, పాలు, పండ్ల వంటివి ఉన్నాయి.. కేరళ రాష్ట్రంలోని కొచ్చి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఏకంగా 368 సార్లు కరివేపాకు కోసం ఆర్డర్ పెట్టాడు. ఈ ప్రకారం చూసుకుంటే రోజుకు సగటున ఒకసారి అతడు ఆర్డర్ పెట్టినట్టు అర్థమవుతుంది. బెంగళూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి తరచూ ఇన్ స్టా మార్ట్ లో కొనుగోలు జరిపాడు. అదే కాదు తనకు వస్తువులను డెలివరీ చేయడానికి వచ్చిన వ్యక్తికి ఏకంగా 68,600 టిప్ గా చెల్లించాడు. ఇక మిగతా తినుబండారాలు కూడా భారీగానే విక్రయమయ్యాయని ఇన్ స్టా మార్ట్ వెల్లడించింది. ఉదయం 7:00 నుంచి 11 గంటల వరకు.. సాయంత్రం 4గంటల నుంచి ఏడు గంటల వరకు తమకు ఆర్డర్లు ఎక్కువగా వచ్చినట్టు ప్రకటించింది.

# ప్కిస్తాన్ కు ట్రంప్ అల్టిమేటం

**న్యూయార్క్, డిసెంబర్ 24, పెన్ పవర్:**
పాకిస్తాన్ ప్రస్తుతం విచిత్ర పరిస్థితి ఎదుర్కొటోంది. కరవ మంటే కప్పకు కోపం.. విడవ మంటే పాముకు కోపం అన్నట్లుగా మారిపోయింది. పెద్దలు మంచివారితో స్నేహం చేయమంటారు. ఎందుకంటే తాను కూడా బాగుపడతారని, కానీ పాకిస్తాన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్నేహితుడి భావిస్తున్నారు. అయితే పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌కు తాజాగా ఓ అల్టిమేటం జారీ చేశారు. గాజాలోని హమాస్ ఉగ్రవాదులను అంతం చేయడానికి పాకిస్తాన్ సైనికులను పంపాలని ఆదేశాలు జారీ చేశారు. కోరిలేషన్ ఆఫ్ ముస్లిం సోల్జర్స్ (సీఎంఎస్) కూటమి ఏర్పాటుతో ఈ ప్రణాళిక మరింత తీవ్రతరం అవుతోంది. పాకిస్తాన్‌లో 7 లక్షల మంది సైనికులు ఉండటం ప్రధాన కారణం. ఇతర ముస్లిం దేశాలతో పోల్చితే ఇక్కడే అత్యధిక సైన్యం ఉంది. అంతేకాకుండా, ట్రంప్‌కు ఆసిమ్ మునీర్‌పై పూర్తి నమ్మకం ఉంది. ‘నా ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తారు‘ అనే విశ్వాసంతో ఒత్తిడి పెంచారు. చేయకపోతే ఆర్థిక, సైనిక సహాయాలను ఉపసంహరిస్తామని హెచ్చరించారు. పాకిస్తాన్ ప్రజలు పాలస్తీనాకు బలమైన మద్దతు ప్రదర్శిస్తున్నారు. ఇక్కడి సైన్యం హమాస్‌పై దాడి చేస్తే, ఇస్లామిక్ సమాజంలో పాకిస్తాన్‌కు వ్యతిరేకత పెరుగుతుంది. ఇప్పటికే ఇమ్రాన్ ఖాన్ అనుచరులతో ఆసిమ్ మునీర్ పోరాడుతున్నారు. గాజా మిషన్‌కు సైన్యం పంపితే, విపక్ష పార్టీలు ఏకమై మునీర్‌పై తిరుగుబాటు ప్రారంభించే ప్రమాదం ఉంది. ఇటీవల మునీర్ త్రివిధ దళాల అధినేతగా నియమితులైనా, ఇంకెంత డ్యామేజ్ కంట్రోల్ చేయగలరో సందేహం. పాకిస్తాన్ సైన్యానికి హమాస్‌ను జయించే శక్తి లేదని నిపుణులు అంచనా. స్వంత దేశంలో తెహ్రీక్‌ఎతాలిబాన్ వంటి ఉగ్రవాద గుండాలను అరికట్టలేకపోతున్నారు. గాజాలో ఓటమి జరిగితే అంతర్జాతీయ స్థాయిలో పాకిస్తాన్ ప్రతిష్ట పడిపోతుంది. ఇప్పటికే ఆఫ్గానిస్తాన్ సరిహద్దుల్లో దాడులు జరుగుతున్న నేపథ్యంలో భారత్ 'ఆపరేషన్ సిందూర్ 2.0' ప్రారంభించే అవకాశం కూడా ఉంది. అంతర్గత రాజకీయాలు, ప్రజల భావోద్వేగాలు ఈ ప్లాన్‌ను కుప్పకూల్చే అవకాశం ఉంది. మునీర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అంతర్జాతీయ వర్గాలు ఆసక్తిగా చూస్తున్నాయి.

# బాలినేనికి కలిసి రాని కాలం

**ఒంగోలు, డిసెంబర్ 24, పెన్ పవర్:** బాలినేని శ్రీనివాస్ రెడ్డి. తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అక్కర్లేని పేరు. థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా.. సీనియర్ పొలిటీషియన్‌గా పేరున్న బాలినేని ఒంగోలులో మంచి పట్టున్న నేత. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు.. ఆ పార్టీలో అసంతృప్తిగానే కొనసాగారు బాలినేని. గత ఎన్నికల తర్వాత..జనసేన గూటికి చేరారు. వైసీపీలో మంత్రిగా పనిచేసినా..తనకు సరైన గుర్తింపు ఇవ్వలేదని..రెండున్నరేళ్లు మాత్రమే మంత్రి ఇచ్చారని అసంతృప్తి వ్యక్తం చేస్తూ చాలాసార్లు అలకపాన్పు ఎక్కారు. ఎన్నికలకు ముందే జనసేనలో చేరాలని అనుకున్నా సమీకరణాలు సెట్ అవ్వకపోవడంతో వెయిట్ చేశారు. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి కూటమి అధికారంలోకి వచ్చాక పవన్ కల్యాణ్ నేరుగా బాలినేనిని పార్టీలోకి తీసుకున్నారు. ఆయన కూడా ఉత్సాహంగా జనసేనలో చేరారు. బాలినేని జనసేనలో చేరి ఏడాది దాటినా ఇప్పటికీ పార్టీలో సెట్ అయిపోలేదట. పార్టీ నుంచి వెళ్లిపోయినందుకు అటు వైసీపీ నేతలు అప్పుడప్పుడు ఆయనపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఇటు కూటమి పార్టీల లీడర్లు కూడా.. బాలినేని వైసీపీ కోవర్ట్ అంటూ టార్గెట్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒంగోలు జిల్లాలో బాలినేనికి పరిస్థితులు అనుకూలంగా కనిపించడం లేదట. అక్కడున్న లోకల్ టీడీపీ లీడర్లు బాలినేనికి వ్యతిరేక గళం వినిపిస్తూనే ఉన్నారు. ఇక జనసేన మెల్లిగా బాలినేనిని ఓన్ చేసుకుంటున్నా అప్పుడప్పుడు కొన్ని సమస్యలు, ప్రోటోకాల్ ఇష్యూస్ వస్తున్నాయ్. ఇవన్నీ గమనించిన పవన్ కల్యాణ్ బాలినేనిపై సాఫ్ట్ కార్నర్ చూపిస్తున్నారట. బాలినేనికి రెండు వైపులా ఇబ్బందులు ఉన్నాయని పవన్ ఓపెన్ స్టేట్‌మెంట్ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. పైగా అన్నీ తట్టుకుని నిలబడుతున్నారంటూ బాలినేనిని అభినందించారు పవన్. దీంతో అధినేత మనసులో చోటు సంపాదించుకున్న బాలినేనికి త్వరలోనే ఏదో ఒక పదవి ఖాయమంటూ ప్రచారం జరుగుతోంది. బాలినేనిని పార్టీలోకి తీసుకున్నప్పుడే ఆయనకు ఎమ్మెల్సీ పోస్ట్ ఇవ్వాలనుకున్నారట పవన్. ఆ టైమ్‌లో ఈక్వేషన్స్ కుదరలేదంటున్నారు. నాగబాబును మండలికి పంపడంతో జనసేనకు అవకాశం లేకుండా పోయిందట. ఆ తర్వాత వైసీపీ ఎమ్మెల్సీగా రాజీనామా చేసి జనసేనలో చేరిన జయమంగళ వెంకటరమణ స్థానాన్ని బాలినేనికి ఇవ్వాలని డిసైడ్ అయ్యారట. ఆ బెర్త్ విషయంలో కూడా చిక్కు వచ్చి పడింది. జయమంగళ వెంకటరమణ రాజీనామాను మండలి ఛైర్మన్ ఆమోదించకుండా చాలా కాలంగా పెండింగ్‌లో పెట్టారు. ఈ అంశం ఇప్పుడు కోర్టు పరిధిలోకి వెళ్లింది. జయమంగళ రిసిగ్నేషన్ యాక్సెప్ట్ అయితే ఎమ్మెల్సీ స్థానం బాలినేనికి ఇవ్వడానికి రెడీగా ఉన్నారట పవన్. అయితే మండలి ఛైర్మన్ ఎప్పుడు డెసిషన్ తీసుకుంటారోనని బాలినేని ఎదురుచూడక తప్పట్లేదు. దీంతో మొత్తానికి బాలినేనికి టైమ్ బాలేదన్న చర్చ జరుగుతోంది. అధికార పార్టీలో ఉన్నానన్న ఫీల్ లేకుండా పోయిందంటున్నారు. వైసీపీలో ఎలా అయితే ఇబ్బంది పడ్డారో జనసేనలో కూడా అంతకు మించి ఇబ్బందులు పడుతున్నారట బాలినేని. అయితే జనసేన అధినేత పవన్ సాఫ్ట్ కార్నర్‌తో ఉండటం బాలినేనికి కలిసొచ్చే అంశమంటున్నారు. బాలినేనికి కోరుకున్న పదవి దక్కేదెప్పుడో చూడాలి మరి.

# న్యూ ఇయర్ జోష్ లో తప్పులు చేస్తే...

**హైదరాబాద్, డిసెంబర్ 24, పెన్ పవర్:** కొత్త సంవత్సరానికి ఓ మంచి వాతావరణంలో స్వాగతం పలకండి, గలీజు పనుల జోలికి వెళ్లొద్దు, సెలబ్రేషన్స్‌ని ఇల్లీగల్‌గా చేసుకొని కేసుల బారిన పడొద్దు అని కూల్‌కూల్‌గా మెసేజ్ ఇస్తున్నారు ఖాకీలు. కాదూకూడదూ అని రెచ్చిపోతే, కథ కటకటాల్లోకే అని గట్టి వార్నింగూ వినిపిస్తోంది. మరో వారం రోజుల్లో న్యూఇయర్ జోష్ షురూ. అంబరాన్నంటే సంబరాలే కాదు, ఓవరాక్షన్లు, ఆవారా పనులూ కూడా అప్పుడే. వెర్రెక్కిన కుర్రకారుకు అడ్డూ అదుపూ ఉండదు. పోలీసులకు ఏడాదంతా ఒక ఎత్తయితే, కొత్త సంవత్సర సీజన్ ఒక్కటీ ఒక ఎత్తు. ఎందుకంటే, సెలబ్రేషన్స్ పేరుమీద అక్కడ జరిగే అరాచకాలకు అంతే ఉండదు. అందుకే, ఎక్సైజ్, డ్రగ్ కంట్రోల్, లా అండ్ ఆర్డర్, టాస్క్‌ఫోర్స్.. అన్ని శాఖలూ ఒక్కటయ్యాయి. ఈగల్ టీములు కూడా ఎటెన్షన్‌లోకొచ్చేశాయి. +ఎవీజతోపాటు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో స్పెషల్ డ్రైవ్‌కి సిద్ధమైంది ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్. హైదరాబాద్‌లోని పబ్బులు, ఫామ్ హౌస్‌లపై డేగ కన్నేశారు ఖాకీలు. డ్రగ్స్ అమ్మేవాళ్లతోపాటు వినియోగించేవాళ్లు కూడా దొరికితే లోపలేయడం పక్కా. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీల్లో కనిపించకూడదు. ఇంతేకాదు, పరిమితికి మించి లిక్కర్ వాడినా నేరమే. అటు, నాన్ పెయిడ్ డ్యూటీ లిక్కర్ మీద కూడా ఫోకస్ పెట్టింది ఖాకీ శాఖ. గంజాయి విక్రయాల్లో స్టూడెంట్స్ కూడా ఉండడంతో కాలేజ్ యాజమాన్యాలు, హాస్టళ్ల ఓనర్స్‌తో మీటింగ్స్ పెట్టి క్లాసులు పీకారు పోలీసులు. ఇటు, ఏపీ, ఒడిషా, మహారాష్ట్ర నుంచి గంజాయి తరలిస్తున్నారన్న వార్తలతో అప్రమత్తమయ్యారు పోలీసులు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు పెట్టి వాహనాలను ఎక్కడిక్కడే తనిఖీ చేసి పంపిస్తున్నారు. ఈగల్ టీమ్స్, ఎస్ఓటీ పోలీసులు కంబైన్డ్ ఆపరేషన్స్ స్పీడప్ చేశారు. నిన్నటికి నిన్న హైదరాబాద్ రాయదుర్గంలో ఐదుగురిని అరెస్ట్ చేసి, 12 గ్రాముల వీణహీూ, 7 గ్రాముల గంజాయి సీజ్ చేశారు. పబ్‌లపై కూడా నిఘా పెంచేశారు. రూల్స్ ఉల్లంఘించిన పబ్‌లపై కేసులు నమోదయ్యాయి. ఇటీవలే ఆపరేషన్ దూల్‌పేట్ పేరుతో జూలు విదిల్చి, వంద కేసులు నమోదు చేసింది. వరుస తనిఖీలతో డ్రగ్స్ ట్రాఫిక్ నియంత్రణలోకొచ్చి, గంజాయి అమ్మకాలు 90 శాతం తగ్గినట్టు లెక్కుంది. అయినా సరే, న్యూ ఇయర్ వేడుకలను తేలిగ్గా తీసుకోవడం లేదు పోలీసులు.

# నాగోబా జాతర షురూ...

**అదిలాబాద్, డిసెంబర్ 24, పెన్ పవర్: :** మెస్రం వంశీయుల ఆరాధ్య దైవం కేస్లాపూర్ నాగోబా మహా పూజలకు మెస్రం వంశీయులు శ్రీకారం చుట్టారు. పుష్యమాస అమవాస్యను పురస్కరించుకొని 2026 జనవరి 18న కేస్లాపూర్ నాగోబా జాతర నిర్వహించనున్న సందర్భంగా సోమవారం రాత్రి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మెస్రం వంశీయులు ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామానికి చేరుకొని నాగోబా మురాడి దేవస్థానంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మెస్రం వంశీయుల పటేల్ కేస్లాపూర్ నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సాంప్రదాయం ప్రకారం నెలవంకను దర్శించుకునీ, నాగోబాకు పూజలు నిర్వహించారు. ఆదివాసీలకు పవిత్ర మాసం ఈ పుష్యమాసం.. కాళ్లకు చెప్పులు ధరించకుండ, మద్యం, మాంసాలకు దూరంగా ఉంటూ నెలరోజుల పాటు అత్యంత పవిత్రంగా పుష్యమాసంలో అడవి బిడ్డలు తమ ఆరాధ్య దైవాలను కోలుస్తుంటారు. ఒక్కో గోత్రానికి ఒక్కో రకమైన ఆచారాలు సాంప్రదాయాలు వారి దైవాలు ఉంటాయి. అయితే ఈ మెస్రం వంశీయులకు నాగోబా కుల దైవం. మెస్రం వంశీయులలోనూ భయ్ గొట్టే మెస్రం వంశీయులు పడియోర్ అని పిలుస్తుంటారు. ఆదివాసీలు తమ ఆచార సాంప్రదాయాల ప్రకారం సూర్య చంద్రులను దైవాలుగా కోలుస్తారు. అందులో ఒక భాగమే నేలవంక దర్శనం. మాసాలను గుర్తించే దిశగా ఈ నెలవంక సూచిస్తుంది. పుష్యమాసం ప్రారంభంతో నెల రోజుల పాటు భక్తి శ్రద్ధలతో తమ దైవాలను కోలుస్తుంటారు. మెస్రం వంశీయులు ప్రతియేటా నాగోబాను పుష్యమాసంలో భక్తి శ్రద్ధలతో కొలుస్తూ దర్శించుకుంటారు. వచ్చే 2026 జనవరి18న నాగోబాకు పవిత్ర గంగాజలంతో అభిషేకం నిర్వహించి మహాపూజ చేయనున్నారు. మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం కానుంది. అయితే నాగోబాకు అభిషేకం కోసం కావలసిన పవిత్ర గంగాజలం సేకరణ, నాగోబా మహాపూజ, జాతర గురించి 7 గ్రామాల్లో, 7 రోజుల పాటు ప్రచారం నిర్వహించే (ఛకడ) ఎడ్లబండి నాగోబా ప్రచార రథయాత్రను నేడు మంగళవారం ప్రారంభించనున్నారు. నేడు మరోసారి అందరూ మెస్రం వంశీయులు సమావేశమై ఈ నాగోబా ప్రచార రథయాత్ర గురించి రూట్ మ్యాప్ ను తయారు చేసి నాగోబాకు పూజలు చేసి ఛకడ వాహనం ఎడ్లబండిపై నాగోబా ప్రచార రథయాత్ర ప్రయాణం చేయనున్నారు.

7 రోజులపాటు 7 గ్రామాలలో జాతర

7 రోజుల పాటు ఆయా గ్రామాల గుండా ఈ రథయాత్ర కొనసాగుతుంది. ఏడు గ్రామాలలో ఏడు రోజులపాటు నాగోబా జాతర ప్రారంభం గురించి మహాపూజకు కావాల్సిన కుండలు ఇతర వాటి సేకరణ గురించి కార్యాచరణ మొదలుపెడతారు. అనంతరం ఏడు రోజుల తర్వాత తిరిగి కేస్లాపూర్ కు చేరుకొని, నాగోబా అభిషేకం మహాపూజ కోసం కావలసిన పవిత్ర గంగాజలం కోసం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని గోదావరినదిలో గల హస్తలమడుగు వద్దకు పాదయాత్రగా బయలుదేరనున్నారు

# ముస్తాబయిన చర్చులు

**సికింద్రాబాద్: పెన్ పవర్:** క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సికింద్రాబాద్ లోని చర్చిలన్నీటిని నిర్వాహకులు సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. గంటల వ్యవధిలో వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో క్రైస్తవ సోదరులు షాపింగ్ లతో బిజీ బిజీగా మారిపోయారు. ముఖ్యంగా ఈ రోజు కోసం వారు ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తారని చెప్పడంలో ఎటువంతో అతిశకయోక్తి లేదు. క్రిస్మస్ పండుగకు ఒక రోజు ముందుగా అనగా నేటి రాత్రి 11గంటలకే తమ తమ చర్చిలు వద్దకు చేరుకొని ప్రార్థనలు చేస్తూ భక్తి పారవశ్యంలో మునిగి తెలుతారు. ఒకరికొకరు కరచాలనం, ఆలింగనాలూ చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొని అర్ధరాత్రి 12 గంటల తరువాత తమతమ నివాసాల వద్దకు వెళ్లి ఇళ్లముందు రంగురంగుల హరివిల్లులతో అందంగా తీర్చిదిద్దుతారు. ముఖ్యంగా క్రైస్తవులంతా దాదాపు 10 రోజుల ముందునుండే ఇళ్ల వద్ద స్టార్ (విద్యుత్ దీపాల నక్షత్రాన్ని) ఏర్పాటు చేసుకొని ప్రతి రోజు రాత్రుళ్లు తమతమ చర్చిల సభ్యుల ఇళ్ళవద్దకు వెళ్లి ప్రార్థనలు చేస్తారు. డిసెంబర్ 31వరకు కొనసాగిస్తారు. సర్వమానవ సౌభ్రాతృత్వం, శాంతిని కాంక్షిస్తూ దేవదేవుడ్ని ప్రార్థిస్తామని క్రైస్తవ ప్రతినిధులు, పాస్టర్లు తెలిపారు.

## సోషల్ మీడియా వారియర్స్ ఆర్తనాదాలు

**విశాఖపట్టణం డిసెంబర్ 24, పెన్ పవర్:** వైసీపీ కార్యకర్తలు సాయం కోసం అల్లాడిపోతున్నారు. వైసీపీ కోసం విదేశాల్లోఉన్నా కెరీర్ ను నిర్లక్ష్యం చేసి మరీ పార్టీ కోసం పని చేస్తూ బ్రెయిన్ స్ట్రోక్ కు గురైతే కనీసం పార్టీ నుంచి పట్టించుకునేవారు లేకపోవడం వారిని ఆందోళనకు గురి చేస్తోంది. ఇటీవలి కాలంలో ఇలాంటి వారు పెరిగిపోతున్నారు. కానీ పార్టీ నుంచి మాత్రం సాయం అందకపోవడంతో వారిని ఆందోళనకు గురి చేస్తోంది.చదువు కోసమో.. ఉద్యోగం కోసమో అమెరికాకు వెళ్లిన కృష్ణారెడ్డి అనే వైసీపీ కార్యకర్త.. అక్కడి నుంచి సోషల్ మీడియా వారియర్ గా పని చేస్తూంటారు. కూటమి నేతలను ట్రోల్ చేయడం, అసభ్యంగా పోస్టులుపెట్టడం వంటివి వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు కామన్ కాబట్టి విదేశాల్లో ఉన్నా అవన్నీ చేస్తూంటాడు. అయితే హఠాత్తుగా అతను బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. ఆయన ఆరోగ్యం ప్రస్తుతం విషమంగా ఉండటంతో ఆసుపత్రిలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు.డల్లాస్‌లో జరిగిన వైఎస్ జగన్ జన్మదిన వేడుకల సందర్భంగా వైసీపీ ఎమ్మెల్సీ పీవీవీ సూర్యనారాయణ రాజు కృష్ణారెడ్డికి వైద్య సాయం కోసం వెయ్యి డాలర్లు ఇచ్చారు. ఆయన వ్యక్తిగతంగా సాయం చేశారు. కృష్ణారెడ్డి వైద్య ఖర్చుల భారం భారీగా ఉండటంతో, ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు స్నేహితులు మరియు శ్రేయోభిలాషులు '+శీఖీబఅఎవీవ' ద్వారా విరాళాలు సేకరిస్తున్నారు. రెండున్నర లక్షల డాలర్లు సాయంకావాలని కోరుతున్నారు. కొంత మంది స్పందిస్తున్నారు. కానీ పార్టీ పరమైన సాయం ఇంకా ప్రకటన రాలేదు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ పార్టీ కోసం పనిచేసిన కృష్ణారెడ్డికి సహాయం చేయాలని ఆయన కుటుంబసభ్యులు ఎన్ఆర్ఐ వైసీపీ శ్రేణులు, అభిమానులను కోరుతున్నారు.అమెరికాలోనే కాదు.. ఏపీలోనూ వైసీపీ కార్యకర్తలు ఇలాంటి కష్టాల్లో పడితే పట్టించుకునేవారు లేకుండా పోయింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు శ్యామ్ కలకడ అనే సోషల్ మీడియా వారియర్ ను అలాగే వదిలేయడంతో ఆయన చనిపోయారు. ఇప్పుడు విపక్షంలో ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. చివరికి ఎవరికి వారు లోకేష్ సాయం కోరుతూ ట్వీట్లు పెట్టి కొంత మంది సాయం పొంది ప్రాణాలు కాపాడుకున్నారు. కానీ వైసీపీ నుంచి మాత్రం ఎలాంటి మద్దతూ లభించడం లేదు. ఇది వారి క్యాడర్ ను బాధిస్తోంది.

## పవన్ జాతీయ స్థాయిలో ముద్ర...



**కాకినాడ డిసెంబర్ 24, పెన్ పవర్: ):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జాతీయస్థాయిలో సైతం తన ముద్రను చాటుకుంటున్నారు. జాతీయస్థాయి రాజకీయాలను శాసిస్తున్న ఆయన ఇప్పుడు ఏపీలో నిర్వర్తిస్తున్న శాఖలను సైతం ముందంజలో తీసుకెళు న్నారు. ఏపీలో ఆయన నిర్వహిస్తున్న పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జాతీయస్థాయిలో నంబర్ వన్ గా నిలిచింది. గతంలో జాతీయస్థాయిలో 23వ స్థానంలో ఉన్న ఏపీ 22 స్థానాలను మెరుగుపరుచుకొని ఒకటో స్థానంలో నిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. నేషనల్ మీడియాలో సైతం ఇప్పుడు పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.రాజకీయంగాను తనదైన మార్క్ చూపిస్తున్నారు పవన్ కళ్యాణ్. ఏపీలో కూటమి కట్టడంలో ఆయనదే కీలక పాత్ర. అప్పటివరకు బిజెపితో పాటు టిడిపి మధ్య గ్యాప్ ఉండేది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారం నుంచి దూరం చేయాలంటే మూడు పార్టీల కలయికను ముందే గుర్తు చేశారు పవన్ కళ్యాణ్. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేస్తే సంఘీభావం తెలిపి నేరుగా టిడిపితో పొత్తు ఉంటుందని సంచలన ప్రకటన చేశారు. బిజెపిని కూటమిలోకి తేవడంలోనూ.. తెలుగుదేశం పార్టీని ఎన్డీఏలో చేర్చడంలోనూ చురుకైన పాత్ర పోషించారు. ఏపీలో మూడు పార్టీల కలయిక సూపర్ హిట్ గా నిలవగా.. జాతీయస్థాయిలో నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి రావడానికి కూడా ఒక విధంగా ఏపీ కారణం. ఇదంతా పవన్ కళ్యాణ్ కృషి ఫలితం.ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎం హోదా దక్కింది. అటు పవన్ కళ్యాణ్ సైతం తనకు గ్రామీణ నేపథ్యం ఉన్న శాఖలు కావాలని కోరారు. అందుకే పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి తో పాటు అటవీ శాఖను ఇచ్చారు చంద్రబాబు. దాదాపు 5 శాఖలు పవన్ కళ్యాణ్ వద్ద ఉన్నాయి. ఆ శాఖల విషయంలో పవన్ కళ్యాణ్ కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. దీంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన నిధులు గ్రామీణ శాఖలకు కేటాయిస్తూ.. అభివృద్ధికి బాటలు వేశారు పవన్ కళ్యాణ్. పల్లె పండుగ పేరుతో రికార్డు స్థాయిలో గత రెండేళ్లుగా అభివృద్ధి పనులు చేశారు. దీంతో గ్రామాల్లో మౌలిక వసతులు సమకూరాయి. అందుకే జాతీయస్థాయిలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ నెంబర్ వన్ గా నిలిచింది. ఈ క్రెడిట్ మాత్రం వన్ అండ్ ఓన్లీ పవన్ కళ్యాణ్.

## వాజ్ పేయి విగ్రహంతో మొదలు

**విజయవాడ, డిసెంబర్ 24, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విగ్రహాల రాజధానిగా రూపుదిద్దుకుంటోంది. అధికార కూటమిలోని పార్టీలు తమ నాయకులను గౌరవించుకుంటూ భారీ విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. బీజేపీ ఇప్పటికే అటల్, మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వాజ్‌పేయీ విగ్రహాలను ఏర్పాటు చేస్తుండగా, అమరావతిలోని వెంకటపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు సమీపంలో ఒక భారీ కాంస్య విగ్రహాన్ని నెలకొల్పనుంది. ఈ విగ్రహ ఆవిష్కరణ ఈ నెల 25న జరగనుందని, కేంద్ర మంత్రి అమిత్ షా హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.చీణూలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ ఆధ్వర్యంలోని ఏపీ ప్రభుత్వం.. రాష్ట్ర నూతన రాజధానిలో బీజేపీ దిగ్గజ దివంగత నేత అటల్ బిహారీ వాజ్ పేయీ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం పెరుగుతుందని టీడీపీ భావిస్తోంది. అభివృద్ధి, సమన్వయం, ప్రజాస్వామ్య విలువలతో కూడిన పాలనకు ప్రతిరూపంగా వాజ్‌పేయిని భావిస్తూ.. అదే దిశలో అమరావతిని ముందుకు నడిపించాలన్న సందేశం ఇందులో ప్రతిఫలిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.వాజ్ పేయీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా వెంకటపాలెంలో ఏర్పాట్ల చేయబోయే వాజ్‌పేయి విగ్రహ ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీ.వీ.ఎన్. మాధవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో అమరావతిలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న తొలి విగ్రహం వాజ్‌పేయిదే కావడం గర్వకారణమని చెప్పారు. అందరికీ స్ఫూర్తి, ప్రేరణ కలిగించేలా వాజ్‌పేయి విగ్రహం ఉండబోతుందని మాధవ్ పేర్కొన్నారు.14 అడుగుల ఎత్తులో కాంస్యంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మాధవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఢిల్లీలోని ఇతర కార్యక్రమాల కారణంగా హాజరుకావడం లేదని చెప్పారు. అయితే ఢిల్లీ నుంచి పలువురు కేంద్ర నాయకులు ఆవిష్కరణ కార్యక్రమానికి రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నట్లు మాధవ్ వెల్లడించారు. అమరావతిలో వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటు కేవలం ఒక విగ్రహ ఆవిష్కరణ మాత్రమే కాదని, భవిష్యత్ రాజధానికి ఒక ఆలోచనాత్మక ఆరంభమని బీజేపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

# వై.ఎస్.జగన్ అక్రమాస్తుల కేసు మళ్లీ మొదటికి



**విజయవాడ, డిసెంబర్ 24,పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసు దశాబ్ద కాలంగా తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లోనే కాకుండా, న్యాయ వ్యవస్థలోనూ ఒక సంచలనంగా మారింది. 2011లో ప్రారంభమైన ఈ కేసు విచారణ, అనేక మలుపులు తిరుగుతూ నేటికీ ఒక కొలిక్కి రాలేదు. తాజాగా నాంపల్లి సీబీఐ కోర్టు ప్రధాన న్యాయమూర్తి టి. రఘురాం బదిలీ అవ్వడం, ఆయన స్థానంలో కె. పట్టాభిరామారావు నియామకం జరగడంతో ఈ కేసు విచారణ మళ్లీ మొదటికి వచ్చిందనే చర్చ మొదలైంది. ఈ కేసు విచారణ నత్తనడకన సాగడానికి అనేక కారణాలున్నాయి.కేసు విచారణలో ఎదురవుతున్న అతిపెద్ద అవరోధం న్యాయమూర్తుల బదిలీలు. జగన్ అక్రమాస్తుల కేసులో వేల పేజీల డాక్యుమెంట్లు, వందలాది సాక్ష్యాలు, 11 ఛార్జ్‌షీట్లు ఉన్నాయి. ఒక న్యాయమూర్తి ఈ కేసు పూర్వాపరాలను అర్థం చేసుకుని, విచారణను ఒక దశకు తీసుకొచ్చే సమయానికి వారు బదిలీ అవుతున్నారు. కొత్తగా వచ్చే న్యాయమూర్తి మళ్లీ మొదటి నుండి కేసును అధ్యయనం చేయాల్సి రావడం వల్ల విచారణ ప్రక్రియ నిరంతరం జాప్యం అవుతోంది.సీబీఐ ఈ కేసులో దాదాపు 11 ప్రధాన ఛార్జ్‌షీట్లు దాఖలు చేసింది. ఇందులో పెట్టుబడులు, క్విడ్ ప్రో కో భూ కేటాయింపులు వంటి అనేక అంశాలు ముడిపడి ఉన్నాయి. నిందితులు తమపై ఉన్న ఆరోపణలను కొట్టివేయాలని కోరుతూ డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు చేయడం వల్ల ప్రధాన విచారణ ప్రారంభం కావడం లేదు. అంతేకాక, విచారణ జరుగుతున్న ప్రతిసారీ ఏదో ఒక సాంకేతిక కారణాన్ని చూపుతూ అనుబంధ పిటిషన్లు వేయడం వల్ల కోర్టు సమయం వృధా అవుతోంది.కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ , ఈడీ ( లపై కూడా పలు విమర్శలు ఉన్నాయి. విచారణను వేగవంతం చేయడంలో ఈ సంస్థలు విఫలమవుతున్నాయని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లు లేదా వ్యూహాత్మక జాప్యం వల్లనే సీబీఐ కోర్టులో గట్టిగా వాదనలు వినిపించడం లేదనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది.జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పాలనాపరమైన కారణాలను చూపుతూ వ్యక్తిగత హాజరు నుండి మినహాయింపు పొందేవారు. ప్రధాన నిందితులు కోర్టుకు హాజరు కాకపోవడం, వారి తరపు న్యాయవాదులు వాయిదాలు కోరడం వల్ల విచారణ ముందుకు సాగడం లేదు. సీబీఐ కోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు, నిందితులు ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించి స్టే తీసుకురావడం లేదా విచారణపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం వల్ల విచారణ ప్రక్రియ నిలిచిపోతోంది. ఒక ఛార్జ్‌షీట్‌పై విచారణ జరుగుతున్నప్పుడు మరొక దానిపై స్టే రావడం వల్ల గందరగోళం ఏర్పడుతోంది.న్యాయమూర్తి కె. పట్టాభిరామారావు బాధ్యతలు చేపట్టడంతో, ఈ కేసు మరోసారి కీలకాంశంగా మారింది. అయితే, కొత్త న్యాయమూర్తి ఈ భారీ కేసును ఎంత వేగంగా అర్థం చేసుకుంటారు, దర్యాప్తు సంస్థలు ఎంతటి సహకారాన్ని అందిస్తాయి అనే దానిపైనే ఈ కేసు భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సామాన్య ప్రజల్లో న్యాయ వ్యవస్థపై నమ్మకం కలగాలంటే, ఇలాంటి కీలక కేసుల్లో విచారణ కాలపరిమితితో కూడి ఉండాలని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# సిబిఐ వలలో టిడిపి మాజీ ఎంపీ వారసులు!




**తిరుపతి, డిసెంబర్ 24, పెన్ పవర్:**
దివంగత డీకే ఆదికేశవుల నాయుడు పేరు మరోసారి ప్రముఖంగా వినిపించింది. ఆయన వారసులు సిబిఐ వలలో పడ్డారు. 2019లో జరిగిన రియల్టర్ రఘునాథ్ అనుమానాస్పద మృతి కేసులో ఆది కేశవులు కుమారుడు డీకే శ్రీనివాస్, కుమార్తె కల్పజాను సిబిఐ అధికారులు అరెస్టు చేశారు. వీరితోపాటు అప్పటి డిఎస్పి మోహన్ ను కూడా అదుపులో తీసుకున్నారు. రఘునాథ మృతి వెనుక ఆర్థిక లావాదేవీలు, బెదిరింపులు ఉన్నాయన్న ఆరోపణలపై సుదీర్ఘ దర్యాప్తు కొనసాగింది. అందులో భాగంగానే ఈ అరెస్టులు జరిగాయి. రాజకీయంగా దూరంగా ఉన్న డీకే కుటుంబం ఇప్పుడు ఈ ఘటనతో మళ్లీ వెలుగులోకి వచ్చింది.2019 నాటి కేసు ఇది. డీకే ఆదికేశవులు నాయుడుకు సన్నిహితుడు రఘునాథ్. ఆయన అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మొదట బెంగళూరు పోలీసులు దర్యాప్తు చేశారు. ఆ తర్వాత బాధితులు హైకోర్టును ఆశ్రయించడంతో దర్యాప్తును సిబిఐ చేశారు. సుప్రీంకోర్టు సైతం సీబీఐ దర్యాప్తునకు ఓకే చెప్పడంతో రంగంలోకి దిగిన అత్యున్నత విచారణ సంస్థ ఈ కేసులో విచారణ చేపట్టింది. అందుకే కీలక అరెస్టులు జరిపినట్లు తెలుస్తోంది. టిటిడి చైర్మన్ పోస్ట్ తో పాటు తిరుపతి ఎంపీగాను పనిచేశారు డీకే ఆదికేశవులు నాయుడు. సుదీర్ఘకాలం టిడిపిలోనే పనిచేశారు.డీకే ఆదికేశవుల నాయుడుకు కర్ణాటకలోవిలువైన ఆస్తులు ఉండేవట. బెంగళూరు తో పాటు ఇతర ప్రాంతాల్లో భారీగా ఆస్తులు ఉండేవని తెలుస్తోంది. మరోవైపు రఘునాథ్ కూడా బెంగళూరు పరిసర ప్రాంతాల్లో స్థితిమంతుడుగా ఉండేవారు. 2013లో ఆదికేశవులు మృతి చెందిన తర్వాత రఘునాథ్ ఆయనకు చెందిన అనేక ఆస్తులను తన ఆధీనంలోకి తీసుకున్నారు. వాటిని తమ పేర్ల మీద బదలాయించాలని.. తండ్రి ఆస్తులకు తాము వారసులమని అప్పట్లో శ్రీనివాస్, కల్పజ, మరికొందరు రఘునాథ్ తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2019 మే లో రఘునాథ్ అనుమానాస్పద స్థితి లో మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే నిందితులుగా ఉన్న ఆది కేశవులు వారసులు పోలీసులపై ఒత్తిడి తెచ్చి దర్యాప్తును నీరుగాచుతున్నారని మృతుడి బంధువులు ఆరోపించారు. ఈ కేసును సిబిఐ కి బదలాయించాలంటూ కర్ణాటక కోర్టుకు ఆశ్రయించారు. సిబిఐ రంగంలోకి దిగడంతో వీరి అరెస్టు జరిగింది. డీకే ఆదికేశవులు టిడిపి నుంచి ఎంపీ అయ్యారు. టీటీడీ చైర్మన్ గాను వ్యవహరించారు.

# గొల్లపూడిలో శాటిలైట్ రైల్వేస్టేషన్...

**విజయవాడ, డిసెంబర్ 24,పెన్ పవర్:**
గొల్లపూడిలో కొత్త శాటిలైట్ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎంపీలు కేశినేని శివనాథ్, దగ్గుబాటి పురందేశ్వరి రైల్వేమంత్రిని కోరారు. దీనివల్ల విజయవాడ స్టేషన్‌పై భారం తగ్గుతుందని, అమరావతి కనెక్టివిటీ పెరుగుతుందని తెలిపారు. అలాగే, కొండపల్లి రైల్వే స్టేషన్ వద్ద నీటి సమస్యను పరిష్కరించి, రైళ్ల రాకపోకలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలపై రైల్వే మంత్రి నిర్ణయం కీలకం కానుంది.ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా శాటిలైట్ రైల్వే స్టేషన్ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. గొల్లపూడి సమీపంలో శాటిలైట్ రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానిక ఎంపీ కేశినేని శివనాథ్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు.. వినతిపత్రం సమర్పించారు. గొల్లపూడిలో శాటిలైట్/హాల్ట్ రైల్వేస్టేషన్ ఏర్పాటు చేస్తే విజయవాడ రైల్వేస్టేషన్ పై భారం తగ్గుతుందని ఎంపీలు వివరించారు. ఈ శాటిలైట్ స్టేషన్ ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం బల్బ్‌లైన్స్ చుట్టూ ఖాళీ స్థలాలున్నాయని, వాటిని రైల్వే అవసరాలకు సులభంగా సేకరించవచ్చని రైల్వేమంత్రికి వివరించారు. ఈ ప్రాంతం కొత్త రైలు, వాయుమార్గాలతో అనుసంధానం కానుందని.. అమరావతి రైల్వేలైన్ నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. ఈ ప్రాంతం విజయవాడ నగరానికి అన్ని సౌకర్యాలకు సెంటర్‌గా ఉంది కాబట్టి, గొల్లపూడిలో హాల్ట్/శాటిలైట్ స్టేషన్ నిర్మించాలన్నారు.అలాగే అంతేకాదు కొండపల్లి రైల్వేస్టేషన్ దగ్గర నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కొండపల్లి రైల్వేస్టేషన్ నుంచి కృష్ణా మిల్క్ యూనియన్ వరకు రైల్వే ట్రాక్‌పై నీరు చేరకుండా నీటి నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా ఎంపీలు కోరారు. ఈ రెండు సమస్యల పరిష్కారం వల్ల ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. కొండపల్లి రైల్వేస్టేషన్ నుండి విజయవాడలోని కృష్ణా మిల్క్ యూనియన్ వరకు ఉన్న రైల్వే ట్రాక్‌పై మురుగునీరు, వర్షపునీరు నిలిచిపోవడం వల్ల రైళ్ల రాకపోకలకు భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని వారు వివరించారు.చిన్నపాటి వర్షం వచ్చినా ఇక్కడ నీరు నిలిచిపోతోందని, దీనివల్ల రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని ఎంపీలు కేశినేని శివనాథ్, దగ్గుబాటి పురందేశ్వరి కేంద్రమంత్రికి తెలిపారు.ఈ సమస్యను పరిష్కరించడానికి, ట్రాక్ పక్కన డ్రైనేజీ కాలువలు, కల్వర్టులు నిర్మించి వర్షపునీరు సులభంగా వెళ్లిపోయేలా చూడాలని వారు కోరారు. ఇందుకోసం వెంటనే నిధులు కేటాయించి, పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ చర్యల వల్ల రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, ప్రయాణికుల భద్రత కూడా మెరుగుపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. మరి ఎంపీల ప్రతిపాదనలపై రైల్వే మంత్రి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.'కొండపల్లి రైల్వే స్టేషన్ నుంచి విజయవాడలోని కృష్ణ మిల్క్ యూనియన్ వరకు ఉన్న రైల్వే ట్రాక్ వెంట మురుగునీరు, వర్షపు నీరు నిల్వ అవుతున్న సమస్యలను కూడా కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవి గారికి వివరించాను. వర్షాకాలంలోనే కాకుండా సాధారణ వర్షపాతం సమయంలో కూడా శాస్త్రీయంగా రూపొందించిన డ్రైనేజ్ నెట్వర్క్, క్రాస్ డ్రైనేజ్ నిర్మాణాలు, కాలువలు అనుసంధానం లేకపోవడం వల్ల ట్రాక్ వెంట మురుగు నీరు నిల్వవుంటుందని తెలియజేశాను.. ఈ నీటి నిల్వల వల్ల స్థానిక నివాసితులు, పరిశ్రమలు ముఖ్యంగా కృష్ణ మిల్క్ యూనియన్ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని తెలిపాను. ఈ ప్రతిపాదనకు అమల్లోకి వస్తే విజయవాడ నగరంలో రైల్వే రవాణా మరింత సవ్యంగా మారడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, రైల్వే భద్రత, పరిశ్రమలు, స్థానిక ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని ఆశభావం వ్యక్తం చేశాను.. ఈ ప్రతిపాదనలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ గారు సానుకూలంగా స్పందించారు' అంటూ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

# ఎడ్యూ్యసిటీకి 1000 కోట్ల భూమి విరాళం

**విజయనగరం, డిసెంబర్ 24, పెన్ పవర్:**
విశాఖపట్నం – విజయనగరం సరిహద్దుల్లో ఏవియేషన్ ఎడ్యు సిటీ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. దీనికి సంబంధించి ఇటీవలే ఒప్పందం కుదిరింది. జీఎంఆర్ గ్రూప్ – మాన్సాస్ ట్రస్టు ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు చేయనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు కోసం మాన్సాస్ ట్రస్టు తరుపున రూ.1000 కోట్లు విలువైన 136.63 ఎకరాల భూమిని దానంగా ఇచ్చేందుకు పూసపాటి వంశీయులు అంగీకరించారు. ఈ ప్రాజెక్టుకు తమ వంశీయుడైన అలక్ మహారాజా గజపతి పేరు పేట్టాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరుతున్నారు.పూసపాటి వంశీయులు మరోసారి తమ పెద్ద మనసు చాటుకున్నారు. భావితరాల భవిష్యత్ కోసం సుమారు రూ.1000 కోట్లు విలువైన భూమిని దానంగా అందించారు. విశాఖపట్నం – విజయనగరం సరిహద్దుల్లోఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీనిర్మాణానికి ఏపీ ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే. జీఎంఆర్ గ్రూప్. మాన్సాస్ ట్రస్టు ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. ఇటీవలే మంత్రి నారా లోకేష్ సమక్షంలో జీఎంఆర్ – మాన్సాస్ ఎడ్యు సిటీ ప్రాజెక్టుకు ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం 160 ఎకరాల విస్తీర్ణంలో క్యాంపస్ ఏర్పాటు చేయనున్నారు. అయితే ఈ ఏవియేషన్ ఎడ్యు సిటీ కోసం పూసపాటి వంశీయులు రూ.1000 కోట్లు విలువైన భూమిని దానంగా అందించారు.ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రాజెక్టు కోసం 136.63 ఎకరాలు భూమిని అందించేందుకు మాన్సాస్ ట్రస్టు ముందుకు వచ్చింది. విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరం వద్ద ఉన్న ఈ భూమిని ఏవియేషన్ ప్రాజెక్టుకు ఇచ్చేందుకు పూసపాటి వంశీయురాలు, అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో జీఎంఆర్ – మాన్సాస్ ఎడ్యు సిటీ ప్రాజెక్టుకు పూసపాటి రాజవంశీయుడైన అలక్ మహారాజా గజపతి పేరు పెట్టాలని అదితి గజపతిరాజు కోరారుమరోవైపు విజయనగరం జిల్లా భోగాపురం వద్దఅల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి.

2026 మే లేదా ఆగస్ట్ నెలల్లో భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలు ప్రారంభించేందుకు విమానయాన శాఖ చర్యలు చేపడుతోంది. అయితే విమానయాన రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా.. భోగాపురం సమీపంలో ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీని ఏర్పాటుచేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఏవియేషన్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల బ్రాంచ్‌లను ఇక్కడ ఏర్పాటు చేయించాలని లక్ష్యంయా పెట్టుకుంది. ఇందులో భాగంగానే రైతుల వద్ద నుంచి సేకరించిన భూమి లేదా ప్రభుత్వ భూములలో ఈ ఎడ్యు సిటీని ఏర్పాటు చేయాలని తొలుత నిర్ణయం తీసుకుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## క్రిస్మస్ పండుగ - దేవుని కుమారుడి జన్మదినోత్సవం

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న 2 బిలియన్ల క్రిస్టియన్లు 25 డిసెంబర్ శుభ గడియల్లో ఘనంగా జరుపుకునే ప్రధాన పండుగ క్రిస్మస్ అని మనకు తెలుసు. "గాడ్స్ సన్ లేదా దేవుని కుమారుడు"గా జీసస్ క్రీస్ట్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ పర్వదినాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకుంటారు. క్రీస్తు బోధించిన ప్రేమ, త్యాగం, కరుణ, శాంతి, సద్భావనలు, క్షమాగుణాలను మరోసారి మననం చేసుకోవడం, ప్రవక్తల ప్రవచనాల ద్వారా వినడం ఆ పండుగ ప్రత్యేకం. దురాశ, చేటు భావనలకు తావులేని మానవజాతి నిర్మింపబడాలని క్రీస్తు బోధించడం జరిగింది. ఇండ్లను విద్యుత్తు దీపాలతో అందంగా అలంకరించడం, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయడం, బంధుమిత్రులతో కలిసి శుభాకాంక్షలు పంచుకోవడం, క్రీస్తు జననాన్ని ఆహ్వానిస్తూ ప్రార్థనా గీతాలను (లేదా కరోల్స్) ఆలపించడం, కానుకలు పంచుకోవడం, ప్రత్యేక వంటలను ఆస్వాదించడం, కేకులు పంచడం, క్రిస్మస్ ట్రీని అలంకరించడం, శాంతా క్లాజ్ రూపాలను ధరించడం లేదా ఆహ్వానించడం లేదా రూపాలను ఏర్పాటు చేసుకోవడం, అరటి/మామిడి కొమ్మలతో అలంకరించడం, మట్టి ప్రమిదల్లో చమురు వేసి ఇంటిపై భాగాన అమర్చి వెలిగించడం లాంటి పలు కార్యక్రమాలను పవిత్ర భావనలతో చేయడం చూస్తుంటాం. ప్రభుత్వాలు సెలవు దినంగా ప్రకటించిన ఈ పండుగలో అన్ని మతాల ప్రజలు కూడా పాల్గొనడం, శుభాకాంక్షలు తెలియజేయడం గమనిస్తున్నాం. బెత్లహామ్ నగరంలో మేరీ మాతకు క్రీస్తు జన్మించారని మనకు తెలుసు. బైబిల్లో జీసస్ క్రీస్తు పుట్టిన రోజును స్పష్టంగా వర్ణించనప్పటికీ క్రీస్తుశకం 336 ప్రాంతంలో రోమన్ రాజులు శీతాకాల ముగింపు వేళల్లో "అజేయ సూర్యుడి పునర్జన్మ లేదా ది రీబర్త్ ఆఫ్ ఇన్విన్సిబుల్ సన్"గా 25 డిసెంబర్ను నిర్వహించుకోవడం ఆచారంగా మారింది. జీసస్ క్రీస్తు ప్రపంచాన్ని వెలుగుమయం (లైట్ ఆఫ్ ది వరల్డ్) చేసిన రోజుగా 25 డిసెంబర్కు ప్రాధాన్యం ఇవ్వబడింది. కొన్ని క్రిస్టియన్ సమూహాలు క్రిస్మస్ పండుగను జనవరి 06 లేదా మార్చి 25న (మేరీ మాత గర్భవతి అయిన రోజు) కూడా నిర్వహించుకుంటున్నారు. క్రీస్తు శకం 52 ప్రాంతంలో సెయింట్ థామస్ అనే క్రైస్తవ బోధకుడు భారత దేశానికి క్రిస్టియానిటీని పరిచయం చేసినట్లు చెబుతారు. నేడు భారత దేశవ్యాప్తంగా 24 మిలియన్ల క్రిస్టియన్లు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈశాన్య రాష్ట్రాలు, గోవా, కేరళ, తమిళనాడు, పాండుచ్చేరి లాంటి రాష్ట్రాల్లో క్రిస్టియన్ల జనాభా అధికంగా కనిపిస్తుంది. ముంబాయి మహానగరంలో కూడా ఈ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతున్నది. క్రీస్తు బోధించిన ప్రేమ, శాంతియుత సహజీవనం, కరుణ, దయ, క్షమాగుణాలను అలవాటు చేసుకొని విశ్వ మానవాళి సమైక్య భావనలతో జీవితాలను సుసంపన్నం చేసుకోవాలని, దురాశ, చెడు ఆలోచనలకు దూరంగా ఆదర్శప్రాయంగా జీవితాలను గడపడానికి కృషి చేయడమే అసలైన క్రీస్మస్ పండుగ కావాలని కోరుకుందాం. క్రిస్టియన్ సమాజానికి జీసస్ క్రీస్ట్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేద్దాం.

## వలసదారుల పిల్లలపై విషం కక్కిన ట్రంప్ సలహాదారు

**హైదరాబాద్ పెన్ పవర్:** వలసదారుల పిల్లలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారు స్టీఫెన్ మిల్లర్ విషం కక్కారు. 70 ఏళ్లుగా వలసదారులకు పుట్టిన మిలియన్ల మంది పిల్లలు అమెరికాకు చేసింది తక్కువేనని వ్యాఖ్యలు చేశారు. సోమాలియా వలసదారులను ఉదాహరణగా చూపుతూ ఫాక్స్ న్యూస్కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అందరి పైనా వ్యాఖ్యలు చేశారు."ఇన్ని వలస సమూహాల్లో ఏ ఒక్క తరం విజయవంతం కాలేదు. వీరంతా అమెరికాకు చేసింది ఏమీ లేదు. అందుకు సోమాలియా స్పష్టమైన ఉదాహరణ. సంక్షేమ పథకాలను భారీస్థాయిలో వినియోగించుకుంటున్నారు. నేర కార్యకలాపాల్లో వీరి సంఖ్య పెరుగుతూనే ఉంది" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జన్మతః పౌరసత్వం కల్పించే పద్ధతిని రద్దు చేస్తూ జారీ చేసిన కార్యనిర్వాహక ఆదేశాన్ని సమర్థించాలని ట్రంప్ యంత్రాంగం అమెరికా సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మిల్లర్ నుంచి స్పందన వచ్చింది. తాత్కాలిక ప్రాతిపదికన లేదా అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించిన తల్లిదండ్రులు ఇక్కడే పిల్లల్ని కన్నప్పుడు ఆ పిల్లలకు జన్మతః లభించే పౌరసత్వాన్ని రద్దు చేస్తూ ట్రంప్ ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. ట్రంప్ యంత్రాంగ అప్పీలుపై కోర్టు విచారణ జరిపి ప్రభుత్వం జన్మతః పౌరసత్వంపై విధించిన ఆంక్షలు రాజ్యాంగబద్ధమైనవా, కావా అన్నది తేలుస్తుంది.

## కాలిఫోర్నియాలో 30 మంది భారతీయుల అరెస్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలోని కాలిఫోర్నియాలో ఇమిగ్రేషన్ చెక్ పోస్టుల వద్ద బోర్డర్ పెట్రోల్ ఏజెంట్లు 49 మంది అక్రమ వలసదారులను అరెస్టు చేసినట్లు యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ పేర్కొంది. వారిలో 30 మంది భారతీయులు ఉన్నట్లు తెలిపింది. వీరిలో కొందరు కమర్షియల్ ట్రక్ డ్రైవర్ లైసెన్స్లతో సెమీ ట్రక్కులు నడుపుతున్నట్లు, మరికొందరు అక్రమంగా నివసిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అమెరికాలో ఇటీవల జరిగిన ట్రక్కు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోవడంతో ట్రంప్ సర్కారు విదేశీ ట్రక్కు డ్రైవర్లకు వర్క్ వీసాలు, కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్ల జారీని ఇప్పటికే నిలిపివేసింది. ప్రస్తుతం వాణిజ్య డ్రైవింగ్ లైసెన్స్లతో సెమీ ట్రక్కులను నడుపుతున్న వారిపై దృష్టిసారించింది. ఇందులోభాగంగా నవంబర్ 23 నుంచి డిసెంబర్ 12 మధ్య బోర్డర్ ప్రొటెక్షన్ ఏజెంట్లు నిర్వహించిన ఆపరేషన్లో వాణిజ్య డ్రైవింగ్ లైసెన్స్లతో సెమీట్రక్కులు నడుపుతున్న 42 మంది అక్రమ వలసదారులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో 30 మంది భారత్కు చెందినవారు కాగా మిగిలినవారు చైనా, మెక్సికో, రష్యా, తుర్కియే మొదలైన దేశాలకు చెందినవారని అధికారులు వెల్లడించారు. అనంతరం కాలిఫోర్నియాలోని వాణిజ్య ట్రక్కింగ్ కంపెనీలను లక్ష్యంగా చేసుకొని చేపట్టిన ఆపరేషన్ 'హైవే సెంటినెల్'లో మరో ఏడుగురు అక్రమ వలసదారులను అరెస్టు చేసినట్లు తెలిపారు. దీంతో ఇప్పటివరకు అరెస్టైన వారి సంఖ్య 49కు చేరింది. వలస చట్టాల ఉల్లంఘనలను నివారించడం, దేశంలోని హైవేలను రక్షించడం కోసం ఈ చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## కెనడాలో భారతీయ మహిళ హత్య..!

**హైదరాబాద్ పెన్ పవర్:** కెనడాలో భారతీయ మహిళ హిమాన్షీ ఖురాన హత్యకు గురైంది. ఈ కేసులో అనుమానితుడిగా భావిస్తున్న అబ్దుల్ గఫూరీ కోసం టొరెంటో పోలీసులు గాలిస్తున్నారు. ఈనెల 19న ఖురాన అదృశ్యమైనట్లు తొలుత పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మరుసటి రోజు ఓ ఇంటిలో ఆమె మృతదేహాన్ని కనుగొన్నారు. ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా పోలీసులు దీన్ని హత్యగా పేర్కొన్నారు. ఆమెపై లైంగిక దాడి కూడా జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి అబ్దుల్ గఫూరీ (32)ని నిందితుడిగా భావిస్తున్నారు. అతడిని పట్టుకునేందుకు దేశవ్యాప్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. వీరిద్దరికీ ముందునుంచే పరిచయమున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ ఘటనపై కెనడాలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. ఖురాన హత్య తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొంది. బాధితురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసింది. స్థానిక కెనడా అధికారుల సమన్వయంతో బాధిత కుటుంబానికి సాధ్యమైన సహాయం అందించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించింది. హత్య దర్యాప్తునకు సంబంధించి నిందితుడిని కనుగొనేందుకు స్థానిక పోలీసులతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది.

## భారత్తో గొడవలు కోరుకోవడం లేదు

**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్లోని తాత్కాలిక ప్రభుత్వం పొరుగుదేశమైన భారత్తో సత్సంబంధాలు మాత్రమే కోరుకుంటోందని ఆ దేశ ఆర్థిక సలహాదారు డాక్టర్ సలేహుద్దీన్ అహ్మద్ అన్నారు. ఇటీవల బంగ్లాలో భారత్కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. దీనిపై సలేహుద్దీన్ విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం భారత్ వంటి పెద్ద పొరుగుదేశంతో గొడవలు కోరుకోవడం లేదన్నారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలపరిచేందుకు, ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించి, భారత్తో సంబంధాలు పునరుద్ధరించేందుకు ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ వ్యక్తిగతంగా ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇది ఇరుదేశాలకు ప్రయోజనకరమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇటీవల బంగ్లాలో (%ద్ఙుఅస్త్రశ్రీఙుసవంష్ట్ర%) చెలరేగిన భారత వ్యతిరేక ఆందోళనలు పూర్తిగా రాజకీయపరమైనవని అహ్మద్ అన్నారు. వాటికి ప్రభుత్వంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. ఇక, ప్రస్తుత పరిస్థితులు ఇరుదేశాల మధ్య వాణిజ్యంపై ఎలాంటి ప్రభావం ఉండదన్నారు. ఆర్థిక సహకారం బలోపేతం చేసుకోవడంలో భాగంగా భారత్ నుంచి 50వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని దిగుమతి చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. భారత్తో సంబంధాలు దెబ్బతీసేందుకు బయటి నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. జాతీయ ప్రయోజనాలు కాపాడుకుంటూ.. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై తాత్కాలిక ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.

# విద్యావేత్త, కర్మయోగి మాలవ్య

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశ వాసులచే -మహాత్ముని'గా గౌరవించబడిన మహా మనీషి జాతిపిత మోహన్ దాస్ కరంచంద్ గాంధీ. అలాంటి గాంధీ చేతే -మహామాన- బిరుదు పొందిన నేత పండిట్ మదన్ మోహన్ మాలవ్య. మదన్ మోహన్ మాలవ్య (1861-1946) భారతీయ విద్యావేత్త, రాజకీయవేత్త. భారతీయ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న సమరయోధుడు. ఆయన 'పండిట్ మదన్ మోహన్ మాలవీయ'గా కూడా సుపరిచితుడు. ఆయన "మహాత్మా" గా కూడా గౌవరింపబడ్డాడు. మాలవ్య1915 లో బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం వ్యవస్థాపకుడు. వారణాసిలో ఈ విశ్వ విద్యాలయాన్ని స్థాపించాడు. భారత జాతీయ కాంగ్రెస్కు అధ్యక్షునిగా నాలుగు సార్లు పనిచేశాడు.1861, డిసెంబర్ 25 తేదిన అలహాబాదులో మూనాదేవి, బ్రిజ్నాథ్ దంపతులకు జన్మించిన మదన్ మోహన్ మాలవ్య పూర్వీకులు మధ్యప్రదేశ్లోని మాల్వా ప్రాంతం నుండి వలస వచ్చారట. అందుకే ఆయన ఇంటి పేరు కూడా మాలవ్యగా సార్థకమైంది. ఆయన అసలు ఇంటి పేరు చతుర్వేది. మాలవ్యాలు బెనార్స్ లోని అగర్వాల్ వర్తకులకు ఇంటి పురోహితులుగా ఉన్నారు. ఆయన తండ్రి సంస్కృత గ్రంథములను అభ్యసించేవాడు. ఆయన శ్రీమద్భాగవతమును చెప్పి ధనం సంపాదించేవాడు. మాలవ్య సంప్రదాయకంగా రెండు సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసం చేశాడు. ఆ తరువాత ఆయన ఆంగ్ల పాఠశాలలో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు. పాఠశాల రోజుల నుండే మకరంద్ అనే కలంపేరుతో కవిత్వం రాయడం ప్రారంభించాడు మాలవ్య. 1879 లో ముయిర్ సెంట్రల్ కాలేజీ నుండి మెట్రిక్యులేషన్ పూర్తి చేశాడు. ఆ కళాశాల ప్రస్తుతం అలహాబాదు విశ్వ విద్యాలయంగా ప్రసిద్ధి చెందినది. మాలవ్యా కలకత్తా విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. లో పట్టభద్రులైనాడు. సంస్కృతం లో ఎం.ఎ చేయాలనుకున్నప్పటికీ ఆయన కుటుంబ పరిస్థితులు సహకరించలేదు. తర్వాత ఉపాధ్యాయునిగా తన జీవితాన్ని మొదలు పెట్టాడు. అంతకు ముందే ఆయన 'ది ఇండియన్ ఒపీనియన్' అనే పత్రికకు సబ్ ఎడిటర్గా పనిచేశాడు.

అలాగే న్యాయ శాస్త్రంలో కూడా పట్టా పొందాడు.1907లో మాలవ్య స్వయంగా 'అభ్యుదయ' అనే వార్తాపత్రిక ప్రారంభించాడు. 1909 లో అలహాబాదు నుండి వెలువడుతున్న ఆంగ్ల పత్రిక లీడర్పత్రికను స్థాపించాడు. ఆయన 1924 నుండి 1946 వరకు హిందూస్థాన్ టైమ్స్ కు చైర్మన్గా ఉన్నాడు.ఆయన సేవలు 1936 లో హిందీ ఎడిషన్ ప్రారంభానికి ఉపయోగపడ్డాయి. 1908లో బ్రిటీష్ ప్రభుత్వం పత్రికలపై ఆంక్షలు విధించినప్పుడు.. వాటికి వ్యతిరేకంగా అలహాబాద్లో అఖిలభారత కాన్ఫరెన్సును నిర్వహించాడు. 1922లో హిందు మహాసభ అధ్యక్షుడుగా పనిచేశాడు.

జయతే" అనే నినాదాన్ని తొలినాళ్లలో ప్రాచుర్యంలోకి తీసుకొచ్చింది మాలవ్యనే.మాలవ్య భారత జాతీయ కాంగ్రెస్కు అధ్యక్షునిగా నాలుగు సార్లు (1909, 1913,1919,1932) పని చేశాడు. ఆయన 1934లో కాంగ్రెస్ ను విడిచిపెట్టాడు. హిందూ మహాసభలో ముఖ్యమైన నాయకునిగా కూడా ఉన్నాడు. 1931లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీతో కలిసి కాంగ్రేసు పార్టీకి ప్రాతినిధ్యం వహించాడు. 1922లో చౌరీ చౌరా దాడుల ఘటనలో మరణశిక్షపడిన 225 మంది స్వాతంత్ర్య సమరయోధులు, సాధారణ ప్రజానీకం తరపున వాదించి వారిలో 153 మందికి ఆ శిక్ష పడకుండా కాపాడగలిగాడు. గంగా నది పరిరక్షణ కోసం 'గంగా మహాసభ' పేరుతో ఉద్యమాన్ని కూడా లేవదీశాడు మాలవ్య. భారతీయ స్కౌట్స్ మరియు గైడ్సు వ్యవస్థాపకులలో మాలవ్య ఒకడు. బ్రిటీష్ నియంతల రాజ్యానికి ఊతమిచ్చేందుకు ప్రారంభించిన సైమన్ కమీషన్కు వ్యతిరేకంగా గళం విప్పాడు. బ్రిటిష్ రాజ్యంలో భారత భవిష్యత్తును నిర్ధారించడానికి ఏర్పాటైన సైమన్ కమీషన్ ను వ్యతిరేకించడానికి లాలా లజపతి రాయ్, జవహర్ లాల్ నెహ్రూ ఇంకా ఇతర స్వాతంత్ర్య సమర యోధులతో కలిశాడు. 1931లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీతో కలిసి కాంగ్రేసు పార్టీకి ప్రాతినిధ్యం వహించాడు."సత్యమేవ జయతే" అనే నినాదాన్ని వ్యాపింపచేసాడు. ఆయన గొప్ప విద్యావేత్త, కర్మయోగి, భగవద్గీతను అనుక్షణం అనుసరించడానికి ఇష్టపడేవాడు. సమకాలిక నాయకుల వలే కులమత భేదములను పోగొట్టడానికి ప్రయత్నించాడు. 1932 ఆగష్టులో జరిగిన రెండవ రౌండు టేబులు సమావేశం తరువాత రామ్సే మెక్డొనాల్డ్ ప్రధాన మంత్రిగా ఉన్న బ్రిటిషు ప్రభుత్వం, బి.ఆర్.అంబేద్కర్ ప్రతిపాదన మేరకు బ్రిటిషు ప్రభుత్వం కమ్యూనల్ అవార్డును తీసుకొచ్చింది.

ప్రభుత్వం అల్ప సంఖ్యాక మతస్తులకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయడం ఈ అవార్డు లక్ష్యం. అయితే ముస్లిములు, సిక్కులతో పాటు, దళితులను కూడా అల్ప సంఖ్యాక మతస్తులుగా ఈ అవార్డు ప్రకటించింది. అయితే మహాత్మా గాంధీ దీన్ని వ్యతిరేకించాడు. దళితులను విడదీస్తే హిందూ మతం విచ్ఛిన్నం అవుతుందని భావించి, అందుకు నిరసనగా గాంధీ పూనాలోని ఎరవాడ జైల్లో నిరాహారదీక్ష చేపట్టాడు. కాంగ్రెసు నాయకులు గాంధీ వాదనకు మద్దతు తెలిపారు. ఆ సమయంలో అంబేద్కరు ఎరవాడ జైల్లో గాంధీతో చర్చలు జరిపాడు. వారి చర్చల ఫలితంగా వెలువడిందే పూనా ఒప్పందం. 1932లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రతిపాదించిన పూనా పాక్ట్ అగ్రిమెంట్ పై ఆయనతో కలిసి మాలవ్య సంతకం చేశాడు. మాలవ్య బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు. వారణాసిలో ఈ విశ్వ విద్యాలయాన్ని స్థాపించాడు. ఇది ఆసియాలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ విశ్వ విద్యాలయం, ప్రపంచంలోనే పెద్ద విశ్వ విద్యాలయం. ఇందులో 12,000 లకు పైగా విద్యార్థులు కళలు, విజ్ఞానశాస్త్రము, ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీలలో విద్యనభ్యసిస్తున్నారు. మాలవ్య ఆ విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సలర్ గా 1919 నుండి 1938 వరకు పనిచేశాడు. జీవితకాలం మొత్తం బ్రహ్మచారిగానే గడిపిన మాలవ్య 1946 నవంబరు 12 (వయసు 84)న బనారస్ మరణించాడు. డిసెంబర్ 24,2014 న మదన్ మోహన్ మాలవ్యను ఆయన మరణాంతరం భారతదేశంలోని ప్రతిష్ఠాత్మక అవార్డు భారతరత్నకు వరించింది.

## భారత ఎన్నికల యంత్రాంగం లోపభూయిష్టం



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలోని వివిధ రాజ్యాంగ సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై దాడి చేసేందుకు బీజేపీ ఉపయోగించుకుంటోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడానికి ఈడీ, సీబీఐలను బీజేపీ వాడుకుంటోందని, అదే సమయంలో తనతో కలిసి ఉన్న పార్టీల జోలికి వెళ్లడం లేదని మండిపడ్డారు. జర్మనీలో ఐదు రోజుల పర్యటనలో ఉన్న రాహుల్ బెర్లిన్లోని ఓ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ 'మా రాజ్యాంగ సంస్థలన్నింటినీ గంపగుత్తగా స్వాధీనం చేసుకున్నారు. ఇది మా రాజ్యాంగ వ్యవస్థపై పూర్తి స్థాయిలో జరిగిన దాడి' అని అన్నారు. ఈడీ, సీబీఐ సంస్థలు బీజేపీపై ఒక్క కేసు కూడా నమోదు చేయలేదని, ఆ పార్టీని వ్యతిరేకించే వారి పైనే ఎక్కువగా రాజకీయ కేసులు పెడుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్కు ఎవరైనా వ్యాపారవేత్త మద్దతు ఇస్తే బెదిరిస్తున్నారని రాహుల్ చెప్పారు. భారత్లోని రాజ్యాంగ సంస్థలు ఎలా పనిచేయాలో ఇకపై అలా పనిచేయబోవని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ వాటిని సొంత సంస్థలుగా చూడలేదని, వాటిని దేశానికి చెందినవిగానే పరిగణించిందని తెలిపారు. కానీ బీజేపీ అలా చూడడం లేదని, అవి తమ జేబు సంస్థలేనని భావిస్తోందని, రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి వాటిని ఓ సాధనంగా వాడుకుంటోందని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని, దానిని అడ్డుకోవాల్సిన అవసరం ఉన్నదని రాహుల్ అభిప్రాయపడ్డారు. 'ఒక ప్రతిఘటన వ్యవస్థను నిర్మిస్తాం. అది విజయం సాధిస్తుంది. మేము బీజేపీతో పోరాడడం లేదు. వారు భారత రాజ్యాంగ సంస్థలను స్వాధీనం చేసుకోవడాన్నే వ్యతిరేకిస్తున్నాం' అని చెప్పారు. రాహుల్ తన ప్రసంగంలో ఓట్ల చోరీని మరోసారి ప్రస్తావించారు. గత సంవత్సరం హర్యానా శాసనసభకు జరిగిన ఎన్నికలను బీజేపీకి అనుకూలంగా రిగ్గింగ్ చేశారని ఆరోపించారు. 'మేము తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో గెలుపొందాం. ఎన్నికలలో నిష్పాక్షికత అంశాన్ని మేము లేవనెత్తుతూనే ఉంటాం. హర్యానా ఎన్నికలలో మేమే గెలిచామన్న విషయాన్ని విలేకరుల సమావేశాలలో ఎలాంటి అనుమానాలకూ ఆస్కారం లేకుండా స్పష్టంగా చెప్పాం. మహారాష్ట్ర ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగాయని మేము భావించడం లేదు' అని చెప్పారు.

## ఉన్నావో అత్యాచార దుండగుడికి బెయిల్



**న్యూఢిల్లీ పెన్ పవర్:** ఎనిమిదేళ్ళ క్రితం దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన 'ఉన్నావో' అత్యాచార కేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న బిజెపి బహిష్కృత నేత, మాజీ ఎంఎల్ఎ కుల్దీప్ సింగ్ సెన్గర్ జైలు శిక్షను సస్పెండ్ చేస్తూ ఢిల్లీ హైకోర్టు అతడికి బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్, జస్టిస్ హరీష్ వైద్యనాథన్ శంకర్తో కూడిన ధర్మాసనం బెయిల్పై కుల్దీప్ సింగ్ను విడుదల చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. రూ.15 లక్షల వ్యక్తిగత పూచీకత్తును సమర్పించాలని, అంతే మొత్తానికి మూడు ష్యూరిటీలు కూడా అందచేయాలని ఆదేశించింది. బాధితురాలి ఇంటికి ఐదు కిలోమీటర్ల పరిధిలోకి రావద్దని, అలాగే ఆమెను గానీ ఆమె తల్లిని గానీ బెదిరించరాదని కూడా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానం విధించిన షరతుల్లో ఏ ఒక్కటి ఉల్లంఘించినా అది, బెయిల్ రద్దుకు దారి తీస్తుందని కోర్టు స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టుకు పాస్పోర్టును అప్పగించాలని, ప్రతి సోమవారం స్థానిక పోలీసు స్టేషన్లో రిపోర్టు చేయాలని కూడా బెంచ్ షరతులు విధించింది. అత్యాచార కేసులో తనను దోషిగా నిర్ధారించి, శిక్ష విధించడాన్ని సవాలు చేస్తూ కుల్దీప్ సింగ్ పెట్టుకున్న అప్పీల్ను పరిష్కరించేవరకు హైకోర్టు, సింగ్ శిక్షను నిలుపుచేసింది. ఈ అత్యాచార కేసులో 2019 డిసెంబరులో ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును ఆయన సవాలు చేశాడు. కుల్దీప్ సెన్గర్ 2017లో మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి ఒడిగట్టాడు. 2019 ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ అత్యాచార కేసును, ఇతర సంబంధిత కేసులను ఉత్తరప్రదేశ్లోని ట్రయల్ కోర్టు నుండి ఢిల్లీకి బదిలీ చేశారు. కస్టడీలో వుంటుండగా జరిగిన బాధితురాలి తండ్రి హత్య కేసులో కూడా తనను దోషిగా నిర్ధారించడాన్ని సవాలు చేస్తూ కుల్దీప్ పెట్టుకున్న అప్పీల్ కూడా పెండింగ్లో వుంది. ఇప్పటికే జైల్లో చాలాకాలం గడిపినందున తన శిక్షను రద్దు చేయాలని ఆయన ఆ అప్పీల్లో కోరారు. కస్టడీ హత్య కేసులో ఆయనకు పదేళ్ల జైలు శిక్ష విధించారు.

## బిజెపి మతోన్మాద రాజకీయాలకు చెంపపెట్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** అఖ్లక్ మూక దాడి కేసులో నిందితుడికి రక్షణ కల్పించాలని కోరుతూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ను గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా కోర్టు తిరస్కరించడం న్యాయానికి ఒక విజయమని, మతోన్మాద శక్తుల ఓటమి అని సిపిఎం ఢిల్లీ కమిటీ వ్యాఖ్యానించింది. ఈ తీర్పును స్వాగతించింది. కీలకమైన ఈ విచారణ సందర్భంగా సిపిఎం సీనియర్ నేత బృందాకరత్ కోర్టులోనే వున్నారు. రాజ్యాంగ విలువలు, చట్టబద్ధ పాలనకు పెద్ద పీట వేసిన ఈ తీర్పు, మూక దాడి వంటి హేయమైన నేరాలకు పాల్పడిన దోషులను రక్షించాలన్న బిజెపి ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా గట్టి సందేశం పంపిందని బృందా కరత్ వ్యాఖ్యానించారు. అఖ్లక్ను దారుణంగా హత్య చేయడమనేది యాధృచ్ఛికంగా జరిగిన సంఘటన కాదన్నారు. ఇదే రీతిలో అనేక దాడులు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలో వున్న వారి నుండి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు పొందిన బిజెపి విద్వేష, మతోన్మాద రాజకీయాల ఫలితమే అఖ్లక్ హత్యగా అని ఆమె పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పదే పదే జోక్యం చేసుకోవడం ద్వారా న్యాయ ప్రక్రియను బలహీనపరచడానికి ప్రయత్నించిందని విమర్శించారు. కానీ, కోర్టు ఇచ్చిన తీర్పు ఇటువంటి అన్ని ప్రయత్నాలను నిర్ణయాత్మకంగా ఓడించిందని బృందా కరత్ తెలిపారు. దేశంలో న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యాన్ని, చట్టబద్ధ పాలనను పరిరక్షించే దిశగా ఈ తీర్పు ముఖ్యమైన చర్య అని పేర్కొన్నారు. మూక దాడులకు, మతోన్మాద హింసాకాండకు వ్యతిరేకంగా పోరాడే అన్ని శక్తులకు ఈ తీర్పు ఒక ఆశాకిరణంగా పనిచేస్తుందని అన్నారు.


## అక్రమ వలసదారులకు అమెరికా ఆఫర్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ ఏడాది ముగింపు లోగా స్వచ్ఛందంగా అమెరికాను వీడేందుకు అంగీకరించే అక్రమ విదేశీ వలసదారులకు 3,000 డాలర్లు(రూ.2.68 లక్షలు), ప్రయాణ ఖర్చులను చెల్లిస్తామని ట్రంప్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. అక్రమ వలసదారుల తరలింపును వేగవంతం చేసి బలవంతపు తరలింపు ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగా అమెరికా సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ పథకం కింద సీబీపీ హోం యాప్ను ఉపయోగించి స్వచ్ఛందంగా అమెరికాను వీడేందుకు ముందుకు వచ్చే అక్రమ వలసదారులకు హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ ప్రయాణ ఏర్పాట్లు చేయడంతో పాటు నగదు కూడా చెల్లిస్తుంది.గతంలో జరిమానాలు ఏవైనా విధించి ఉంటే వాటిని కూడా మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది మేలో ప్రకటించిన 1,000 డాలర్ల సహాయం కన్నా మూడు రెట్లు అధికంగా సహాయం చేయనున్నట్లు ట్రంప్ సర్కార్ వివరించింది. క్రిస్మస్ సెలవుల సీజన్ కావడంతో ఈ సమయంలోనే సాధ్యమైనంత ఎక్కువ మంది అక్రమ వలసదారుల బెడదను వదిలించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వలసదారులు ఇప్పటికైనా దేశాన్ని వీడకపోతే ఏ దేశానికి చెందని వారిగా మిగిలిపోతారని కూడా హెచ్చరించింది. ఈ బహుమతిని అవకాశంగా తీసుకుని అక్రమ వలసదారులు స్వచ్ఛందంగా దేశాన్ని వీడాలని, లేకపోతే వారిని అరెస్టు చేస్తామని హోంల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ హెచ్చరించారు.

## లక్షల పేర్లు తొలగించారు

**న్యూఢిల్లీ: పెన్ పవర్:** ప్రస్తుత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మంగళవారం ప్రచురించబడిన అండమాన్ మరియు నికోబార్, కేరళ, ఛత్తీస్గఢ్ మరియు మధ్యప్రదేశ్లలో దాదాపు 95 లక్షల పేర్లు డ్రాఫ్ట్ జాబితా నుండి తొలగించబడ్డాయి. అండమాన్ మరియు నికోబార్ దీవులలో, 3.10 లక్షల మంది ఓటర్లలో 64,000 మందిని డ్రాఫ్ట్ జాబితా నుండి తొలగించారు. కేరళలో, 2.78 కోట్ల ఓటర్లలో 24.08 లక్షల మంది పేర్లను తొలగించారు. ఛత్తీస్గఢ్లో 2.12 కోట్ల మంది ఓటర్లలో 27.34 లక్షల మంది పేర్లను తొలగించారు. మధ్యప్రదేశ్లో 5.74 కోట్ల మంది ఓటర్లలో 42.74 లక్షల మంది పేర్లను ఎస్ఐఆర్ యొక్క మొదటి దశ తర్వాత తొలగించారు. పేర్లు తొలగించబడిన ఓటర్లు తిరిగి చేర్చడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులపై ఎన్నికల అధికారులు తుది నిర్ణయం తీసుకుంటారని, తుది జాబితాలను ఫిబ్రవరి 14, 2026న జారీ చేస్తారని అధికారులు పేర్కొన్నారు. ముసాయిదా జాబితాలను సంబంధిత రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారి వెబ్సైట్, ఎన్నికల సంఘం ఓటరు పోర్టల్ అందుబాటులో ఉంచారు.

## ఎక్స్కు 91 నోటీసులు ఇచ్చాం



**న్యూఢిల్లీ పెన్ పవర్:** దేశంలో జరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం మార్చిలో సహయోగ్ పోర్టల్ను ప్రారంభించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' కార్పొరేషన్కు 91 కంటెంట్ తొలగింపు నోటీసులు జారీ చేసింది. 1,100 యూఆర్ఎల్స్కు (వెబ్ చిరునామాలు. ఇవి ఇంటర్నెట్లో వెబ్ పేజీ లేదా ఫైల్ ఎక్కడ ఉందో తెలుపుతాయి) హెచ్చరికలు చేసింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయన్న కారణంతో 566 యూఆర్ఎల్స్కు, రాజకీయ నేతలు, ప్రముఖులను లక్ష్యంగా చేసుకుంటున్నాయన్న ఆరోపణలతో 124 యూఆర్ఎల్స్కు హెచ్చరికలు జారీ అయ్యాయి. 2024 మార్చి 20 నుంచి ఈ ఏడాది నవంబర్ 7వ తేదీ వరకూ జారీ చేసిన నోటీసుల వివరాలను కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టు ముందు ఉంచింది. కంటెంట్ తొలగింపునకు సంబంధించి గత సంవత్సరం సోషల్ మీడియా వేదిక ఎక్స్కు 58 నోటీసులు ఇచ్చారు. మొత్తంమీద ఇరవై నెలల కాలంలో ఇచ్చిన 91 నోటీసులలో 14 మాత్రమే క్రిమినల్ కార్యకలాపాలకు సంబంధించినవి. గత సంవత్సరం మే 14న జారీ చేసిన ఒకే ఒక నోటీసు అత్యధికంగా 115 యూఆర్ఎల్స్ను లక్ష్యంగా ఎంచుకుంది. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే ఉద్దేశంతో తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేసేందుకు వీడియో వక్రీకరణ జరిగిందని అందులో ఆరోపించారు.

## పరుగులు పెడుతోన్న పసిడి ధరలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మహిళలు బంగారు అభరణాలు ధరిస్తారు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లోని మహిళలందరూ బంగారానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు.అనేక రకాల డిజైన్లతో లక్షల్లో విలువ చేసే కమ్మలు, నెక్లెస్లు, బ్యాంగిల్స్ వంటివి కొనుగోలు చేస్తుంటారు. ఆడవాళ్లకు ప్రతిరోజూ షాపింగ్ చేసిన బోర్ కొట్టదనడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పవచ్చు. కాగా గోల్డ్ రేట్లు ఎప్పుడెప్పుడు తగ్గుతాయా? అంటూ మహిళలు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. కాస్త పసిడి ధరలు తగ్గుముఖం పట్టగానే బంగారం షాపుల్లో ఎగబడుతారు. అయితే ఇటీవల బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ రేట్లతో మహిళల్లో ఓసారి ఉత్సాహం నెలకొనగా... మరోసారి నిరాశకు గురవుతుంటారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో బంగారం రేట్లు భారీగా పెరుగుతున్నాయి. కొంచెం తగ్గగానే డబుల్, త్రిబుల్ ధర పెరుగుతుంది. ఇవాళ గోల్డ్ ప్రియులకు కాస్త ఊరట లభించింది. నిన్న 22 క్యారెట్లు.. 10 గ్రాముల బంగారం రూ.1,27, 000) ఉండగా.. నేడు రూ. 350 పెరిగి రూ. 1,27,350గా ఉంది. ఇక నిన్న 24 క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర రూ.1,38, 550 గా ఉంది. నేడు రూ.380 పెరిగి రూ.1, 38, 930 గా ఉంది. కాగా ఈ నేపథ్యంలో నిన్నటి ధరతో పోలిస్తే ఇవాళ పసిడి ధరల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.

## రిటైల్ రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ రంగ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైల్ లోన్లపై వడ్డీ రేట్లను తగ్గించినట్టు ప్రకటించింది. వివిధ రుణాలను బట్టి 30 బేసిస్ పాయింట్లు మొదలుకొని 160 బేసిస్ పాయింట్ల వరకు కోత విధించినట్టు బ్యాంకు అధికారిక ప్రకటనలో తెలిపింది. సవరించిన వడ్డీ రేట్లు డిసెంబర్ 18 నుంచే అమల్లోకి వచ్చాయని పేర్కొంది. ఈ నిర్ణయంతో గృహ రుణాల వడ్డీ రేట్లు 30 బేసిస్ పాయింట్లు తగ్గాయని, దీనివల్ల గతంలో ఇళ్ల రుణాలపై వడ్డీ 7.45 శాతం వర్తించగా, ఇప్పుడిది 7.15 శాతానికి చేరిందని బ్యాంకు వివరించింది. వాహన రుణాలపై వడ్డీ రేట్లను 40 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో ఈ రుణాలు 7.50 శాతం నుంచి, వ్యక్తిగత రుణాలపై అత్యధికంగా 160 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో ఇవి 8.75 శాతం నుంచి లోన్లు మొదలవుతాయి. వడ్డీ రేట్ల తగ్గింపుతో పాటు అర్హత కలిగిన గ్రీన్ ఫైనాన్స్ కింద ఇళ్ల, వాహన రుణాలపై అదనంగా 0.10 శాతం రాయితీ ఇస్తున్నట్టు బ్యాంకు స్పష్టం చేసింది. ఈ నెల ప్రారంభంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) కీలక రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన సంగతి తెలిసిందే. దీనికి అనుగుణంగానే వివిధ బ్యాంకు రిటైల్ రుణాలపై వడ్డీని తగ్గిస్తున్నాయి.

## ద్రవ్యోల్బణ డేటా కోసం ఈ-కామర్స్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి వివరాల సేకరణ



**హైదరాబాద్ పెన్ పవర్:** వినియోగదారుల ధరల సూచిక (సీపీఐ) డేటా విశ్వసనీయత, ఖచ్చితత్వం, నాణ్యతను మరింత మెరుగుపరిచే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని లెక్కించడానికి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లను కూడా సమీక్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్‌లు, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి ధరలతో పాటు, రిటైల్ స్టోర్ల నుంచి ధరల సమాచారం చేర్చడం ద్వారా రిటైల్ ద్రవ్యోల్బణం లెక్కింపును మెరుగుపరచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇదే సమయంలో గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ(మోస్పీ) ద్రవ్యోల్బణం (సీపీఐ), పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ), దేశ స్థూల జాతియోత్పత్తి (జీడీపీ) లను లెక్కించడానికి ఉపయోగించే బేస్ సంవత్సరాలను కూడా మార్చాలని భావిస్తోంది. 2024ని బేస్ ఇయర్‌గా ఉన్న కొత్త ద్రవ్యోల్బణ సూచీ 2026, ఫిబ్రవరిలో విడుదల చేయనున్నారు. అయితే సవరించిన సంవత్సరాల ఆధారంగా కొత్త జీడీపీ, పారిశ్రామిక డేటా 2026 తరువాత విడుదల అవుతాయి. మెరుగైన డేటా కోసం ప్రభుత్వం విమాన టిక్కెట్లు, మొబైల్ సేవలు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల వంటి వాటి కోసం ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ల నుంచి, ఇంధన ధరలు, రైల్వే ఛార్జీలు, పోస్టల్ ఛార్జీల కోసం ప్రభుత్వ విభాగాల నుంచి ధరలను సేకరిస్తుంది. 12 పెద్ద నగరాల్లో ఆన్‌లైన్ ధరల డేటాను సేకరించనుండగా, పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా వివరాలు సేకరిస్తారు.

## వచ్చే ఐదేళ్లలో టాటా మోటార్స్ నుంచి 5 ఈవీలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ దేశీయ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) విభాగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈవీ విభాగాన్ని మరింత విస్తరించాలని భావిస్తున్నట్టు తాజాగా ఓ ప్రకటనలో తెలిపింది. దీనికోసం 2030 నాటికి కొత్తగా ఐదు ఈవీ మోడళ్లను మార్కెట్లోకి తీసుకొచ్చే ప్రణాళిక సిద్ధంగా ఉందని తెలిపింది. వీటిలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ప్రీమియం అవిన్య మోడల్ కూడా ఉంది. దీని ద్వారా దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈవీ ప్యాసింజర్ వాహన విభాగంలో స్థిరంగా 45-50 శాతం వాటాను దక్కించుకోవాలని కంపెనీ భావిస్తోంది. 2029-2030 మధ్య కాలంలో ఈవీ వ్యాపారంలోకి రూ. 16,000-18,000 కోట్ల పెట్టుబడులు పెడతామని, కొత్త మోడళ్లతో పాటు దేశవ్యాప్తంగా 10 లక్షలకు పైగా ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటు కోసం మౌలిక సదుపాయాలను పెంచుతామని కంపెనీ స్పష్టం చేసింది. ఇప్పటికే తాము దేశీయ ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహన మార్కెట్లో ఆధిపత్యం కొనసాగిస్తున్నాం. ఈ విభాగంలోని మొత్తం అమ్మకాల్లో దాదాపు మూడింట రెండు వంతులు అంటే దాదాపు 66 శాతం వాటాతో కొనసాగుతున్నాయి. ఇతర కంపెనీలతో పోటీ పెరుగుతున్నప్పటికీ, అనుకున్న సమయానికి స్థిరమైన 50 శాతం వరకు వాటాను కొనసాగించగలమని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ శైలేష్ చంద్ర అన్నారు.

# వచ్చే ఐదేళ్లలో ఐదు రెట్ల వృద్ధి లక్ష్యం





**హైదరాబాద్ పెన్ పవర్:** నీటి నిర్వహణ, ఇండిస్టియల్ పార్కులు, అర్బన్ సొల్యూషన్స్ రంగాల్లో వ్యాపారాలను నిర్వహిస్తోన్న రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తన కార్యకలాపాలను మరింత బలోపేతం చేస్తోన్నట్లు ప్రకటించింది. ఇటీవల అప్పురహిత సంస్థగా మార్చినట్లు వెల్లడించింది. వచ్చే ఐదేళ్లలో రెవెన్యూలో ఐదు రెట్ల వృద్ధిని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. హైదరాబాద్‌లో రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) సునీల్ నాయర్, చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ (సిఎఫ్ఒ) శ్రవంత్ రాయపూడితో కలిసి మీడియాతో మాట్లాడారు. 2025 ముగింపు నాటికి తమ కార్యకలాపాలను మరింత పటిష్టం చేసుకోవడానికి వీలుగా అప్పురహిత కంపెనీగా మార్చామన్నారు. గత ఐదేళ్లుగా చేపట్టిన పునర్నిర్మాణ ప్రక్రియ ముగిసిందని.. ప్రస్తుతం స్టాండ్‌లోన్ స్థాయిలో ఎటువంటి టర్మ్ అప్పులు లేవన్నారు. కేవలం పూర్తి చేసిన ఒక ప్రాజెక్టుకు సంబంధించి రూ.160 కోట్ల రుణం మాత్రమే ఉందన్నారు. ప్రస్తుతం కంపెనీ రెవెన్యూ రూ.2వేల కోట్ల పైగా ఉందన్నారు. ప్రతీ ఏడాది సగటున 25-30 శాతం వృద్ధితో వచ్చే ఐదేళ్లలో ఐదు రెట్ల వృద్ధితో 1 బిలియన్ డాలర్ల (దాదాపు రూ9వేల కోట్లు) రెవెన్యూ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అంతర్జాతీయంగా ముఖ్యంగా ఒమన్, సౌదీ ఇతర మిడిల్ ఈస్ట్ దేశాల్లోని ఇండిస్టియల్ పార్కులు, నీటి ప్రాజెక్టులపై దృష్టి కేంద్రీకరించామన్నారు. మహారాష్ట్రలో లైఫ్ సైన్సెస్ సహా మరో పెద్ద ఇండిస్టియల్ పార్కులను నిర్మించడానికి ప్రాథమిక ఒప్పందాలను కుదుర్చుకుందన్నారు. ఇండిస్టియల్ ఇన్‌ఫ్రా, వాటర్, అర్బన్ సొల్యూషన్స్ రంగాల్లో వస్తున్న అవకాశాలను అందుకోవడానికి తాము సిద్దంగా ఉన్నామని సునీల్ నాయర్ పేర్కొన్నారు. తాము రూ.2,085 కోట్ల కొత్త ఆర్డర్లను సాధించడం ద్వారా
ఆర్డర్ బుక్ రూ.9,000 కోట్లకు పైగా పెరిగిందని శ్రవంత్ రాయపుడి తెలిపారు. అదనంగా సుమారు రూ.3,000 కోట్ల విలువైన ప్రాజెక్టుల కోసం కంపెనీ అత్యల్ప ధరను కోట్ చేసిన బిడ్డర్‌గా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు.

# బలహీన రూపాయి ప్రభావం.. ధరలు పెంచిన మెర్సిడెస్ బెంజ్



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలోని ప్రీమియం విదేశీ కార్ల తయారీ కంపెనీలు వరుసగా ధరల పెంపును ప్రకటిస్తున్నాయి. ఇటీవలే బీఎండబ్ల్యూ పెంపు నిర్ణయం తీసుకోగా, మరో లగ్జరీ కార్ల తయారీ కంపెనీ మెర్సిడెస్ బెంజ్ కూడా తమ కార్ల ధరలు పెంచుతున్నామని స్పష్టం చేసింది. ఇటీవలి పరిణామాల మధ్య యూరోతో పోలిస్తే భారత కరెన్సీ రూపాయి మారకం విలువ క్షీణించడం వల్ల దిగుమతులు, సరఫరా, ఇతర ఖర్చులు పెరిగాయని, ఆ భారాన్ని అధిగమించేందుకు వచ్చే ఏడాదిలో దశల వారీగా ప్రతి త్రైమాసికానికి ఒకసారి ధరలు పెంచుతామని కంపెనీ ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యార్ తెలిపారు. జనవరి 1 నుంచి మొదటి దశలో భాగంగా అన్ని మోడళ్లపై 2 శాతం వరకు పెంపు ఉండనుంది. 2025లో యూరో-రూపాయి మారకపు రేటు నిలకడగా రూ. 100 మార్కు కంటే ఎక్కువగా ఉండటం, ఇది చారిత్రక సగటుల కంటే గణనీయంగా ఎక్కువ కావడం వంటి విదేశీ మారకపు సవాళ్లు ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని కంపెనీ పేర్కొంది. వచ్చే ఏడాది ప్రతి త్రైమాసికంలో ధరల పెంపు గురించి ఆలోచిస్తున్నాం. 18 నెలల క్రితం యూరోకు రూ. 89 ఉండేది. ఇప్పుడు రూ. 104-105కి చేరింది. అంటే 15-18 శాతం క్షీణత. జనవరిలో పెంపు తర్వాత కూడా 10-15 శాతం అంతరం ఉంటుందని సంతోష్ అయ్యర్ వెల్లడించారు.

# విజయ్ మాల్యా లొంగిపోతేనే పిటిషన్లు పరిశీలిస్తాం



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత న్యాయవ్యవస్థకు లొంగిపోయే వరకు, విజయ్ మాల్యా పిటిషన్లను పరిశీలించేది లేదని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. 'పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల (ఎఫ్ఈఓ) చట్టానికి' వ్యతిరేకంగా వ్యాపారవేత్త విజయ్ మాల్యా దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఆయన లొంగిపోయే వరకు, కోర్టు సదరు పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్, న్యాయమూర్తి జస్టిస్ గౌతమ్ అంఖద్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. మాల్యా భారతదేశానికి ఎప్పుడు తిరిగి రావాలని యోచిస్తున్నారని ప్రశ్నించింది. 2016 నుంచి యూకేలో నివసిస్తున్న మాల్యా, హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఇందులో ఒకటి తనను పారిపోయిన ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించిన ఉత్తర్వులను సవాలు చేశారు. 2018 ఎఫ్ఈఓ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును ప్రశ్నిస్తూ మరొక పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లను విచారించాలంటే, మాల్యా ముందుగా భారత న్యాయవ్యవస్థ పరిధిలోకి రావాలని ఆయన న్యాయవాది అమిత్ దేశాయ్‌కు కోర్టు సూచించింది. పారిపోయిన ఆర్థిక నేరస్థుడు, మన దేశ కోర్టుల పరిధిలోకి రాకుండానే, ఎఫ్ఈఓ చట్టాన్ని వ్యతిరేకిస్తూ వేసిన పిటిషన్‌ను అనుమతించకూడదని ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు.

# అజాత శత్రువు అటల్ జీ

**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్న గొప్ప నాయకుడు వాజ్ పెయి. ప్రజా సేవ కోసం బ్రహ్మచారిగా ఉండిపోయి... తన జీవితం మొత్తం దేశం కోసం అంకితం చేశారు. రెండు సీట్ల పార్టీని దేశ రాజకీయ చరిత్రలోనే అధికార పార్టీగా మలచిన అపర చాణుక్యుడు. పార్లమెంట్ సాక్షిగా నెహ్రూలాంటి నేతల్ని సైతం గడగడలాడించారు. హీటెక్కించే ప్రసంగాలు చేయడంలోనే కాదు.. హాస్యం పండిచండంలోనూ ఆయనకు ఆయనే సాటి. ప్రసంగాల్లో... చట్ట సభల్లో మధ్యమధ్యలో కవిత్వాన్ని కలగలిపి అందరితో శెభాష్ అనిపించుకున్నారు. ఆయన వాగ్ధాటి ఎలాంటిదంటే.. భారత ప్రధానిగా ఉన్న నెహ్రూనే ఓ సందర్భంలో.. అటల్ జీ దేశానికి ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీని, దాని మిత్రపార్టీలను ధీటుగా ఎదుర్కొని.. మిత్రపక్షాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి అధికారం హస్తగతం చేసుకున్న నేత వాజ్‌పేయి. ప్రధానిగా పూర్తి పదవీకాలం పూర్తి చేసిన తొలి కాంగ్రెసేతర నేతగా వాజ్‌పేయి నిలిచారు. ఆర్ఎస్ఎస్, జనసంఘ్ నుంచి వచ్చినా... బీజేపీ లీడర్ గా ఎదిగినా.. అన్నివర్గాల ప్రజల మనసును గెలుచుకున్న వ్యక్తి అటల్ బీహారీ వాజ్ పేయి. కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ఏర్పడ్డ ఎన్డీయే కూటమికి సెక్యూలర్ ఫేస్ ఇవ్వడానికి ఎంతగానో కృషిచేశారాయన. అటల్ బిహారీ వాజపేయి డిసెంబర్ 25 1924 న గ్వాలియర్ లోని ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు కృష్ణాదేవి, కృష్ణబిహారీ వాజపేయి. ఆయన తాత పండిట్ శ్యాం లాల్ వాజపేయి వారి పూర్వీకుల నివాస ప్రాంతమైన ఉత్తరప్రదేశ్ లోని బటేశ్వర్ నుండి గ్వాలియర్ లోని మోరీనాకు వలస వెళ్ళాడు. ఆయన తండ్రి కృష్ణబిహారీ వాజపేయి గ్వాలియర్ ప్రాంతంలో ఒక ఉపాధ్యాయుడు, కవి. వాజపేయి గ్వాలియర్ లోని సరస్వతి శిశు మందిర్ లో విద్యాభ్యాసం చేశాడు. గ్వాలియర్ విక్టోరియా కళాశాల (ప్రస్తుతం లక్ష్మీబాయి కళాశాల)లో చేరి హిందీ, ఆంగ్లము, సంస్కృతంలో అత్యంత ప్రతిభావంతునిగా పట్ట భద్రుడైనాడు. కాన్పూరు లోని దయానంద ఆంగ్లో వైదిక కళాశాలనుండి రాజనీతిశాస్త్రంలో ఎం.ఎ పట్టాను పొందాడు. ఎం.ఎ డిగ్రీని ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనాడు. వాజపేయి గ్వాలియర్లో ఆర్య సమాజపు యువ విభాగమైన ఆర్య కుమార్ సభతో తన సామాజిక కార్యశీలతను ప్రారంభించి, 1944లో ఆ విభాగానికి ప్రధాన కార్యదర్శి అయ్యాడు. ఆయన 1939 లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.)లో కూడా చేరాడు. బాబా ఆమ్టే ప్రభావంతో ఆయన 1940-44 లలో అధికార్ల శిక్షణా కేంద్రానికి హాజరైనాడు. ఆయన 1947 లో "పూర్తి స్థాయి సేవకుడు" అనగా ఆర్.ఎస్.ఎస్. ప్రచారక్ అయ్యాడు. ఆయన దేశ విభజన తర్వాత జరిగిన అల్లర్ల వల్ల న్యాయ శాస్త్ర విద్యాభ్యాసాన్ని మధ్యలోనే ఆపేశాడు. రాష్ట్రీయ స్వయంసేయక్ సంఘ్ విస్తారక్ గా ఉత్తరప్రదేశ్ వెళ్ళిన వాజపేయి, అక్కడ దీన్ దయాళ్ ఉపాధ్యాయ నడుపుతున్న "రాష్ట్రధర్మ" (హిందీ మాసపత్రిక), "పాంచజన్య" (హిందీ వారపత్రిక) పత్రికలలోను, స్వదేశ్", "వీర్ అర్జున్" వంటి దిన పత్రికలలోనూ పనిచేయటం ప్రారంభించాడు. వాజపేయి జీవితాంతం బ్రహ్మచారిగా జీవించాడు. 1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో, ఆయన తన అన్న ప్రేమ్‌తో కలిసి 23 రోజుల పాటు అరెస్టయిన సందర్భంలో వాజపేయికి తొలిసారిగా రాజకీయాలతో పరిచయ మేర్పడింది. 1951 లో క్రొత్తగా ఏర్పడిన భారతీయ జనసంఘ్ అనే హిందూ దక్షిణ పక్ష రాజకీయ పార్టీలో పనిచేయడానికి, దీన్ దయాళ్ ఉపాధ్యాయతో పాటు వాజపేయిని ఆర్.ఎస్.ఎస్ నియమించింది. ఇది ఆర్.ఎస్.ఎస్ తో కలిసి పనిచేస్తున్న రాజకీయ పార్టీ. ఆయన ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న పార్టీ ఉత్తర విభాగానికి జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాడు. అనతి కాలంలోనే జనసంఘ్ నాయకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అనుయాయిగా, సహాయకునిగా మారాడు. 1957లో వాజపేయి బల్రామ్‌పూర్ నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యాడు. ఆయన వాగ్ధాటి మూలంగా, అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఏదో ఒకరోజు వాజపేయి దేశ ప్రధాని అవుతాడని ఊహించాడు. ఆయనకు గల వాగ్ధాటి, సంస్థాగతమైన నైపుణ్యాల కారణంగా జనసంఘ్‌లో ముఖ్యనేతగా ఎదిగాడు. దీన్దయాళ్ ఉపాధ్యాయ మరణానంతరం జనసంఘ్ మొత్తం బాధ్యత, యువ వాజపేయిపై పడింది. 1968 లో జనసంఘ్ జాతీయ అధ్యక్షునిగా ఎదిగాడు. నానాజీ దేశ్‌ముఖ్, బాల్‌రాజ్ మధోక్, లాల్ కృష్ణ అద్వానీ లతో కలిసి జనసంఘ్‌ను జాతీయస్థాయి ప్రాముఖ్యతను సంతరించుకునే దిశగా నడిపించాడు. 1975, 1977 ల మధ్య, భారత జాతీయ కాంగ్రెసు పార్టీకి చెందిన ప్రధాని, ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన ఎమర్జన్సీ కాలంలో అనేకమంది విపక్ష నాయకులతో పాటు అరెస్టు అయ్యాడు. 1977 లో సంఘ సంస్కర్త జయప్రకాశ్ నారాయణ్, కాంగ్రెసు పార్టీకి వ్యతిరేకంగా సంఘటితమై పోరాడటానికి, అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు ఇచ్చిన పిలుపు మేరకు, వాజపేయి జనసంఘ్‌ను క్రొత్తగా ఏర్పడిన సంకీర్ణ కూటమి, జనతాపార్టీలో విలీనం చేశాడు. 1977 సార్వత్రిక ఎన్నికలలో జనతా పార్టీ విజయం తరువాత ఆయన మొరార్జీ దేశాయ్ మంత్రివర్గంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేశాడు. విదేశీ వ్యవహారాల మంత్రిగా ఆయన ఐక్యరాజ్య సమితి యొక్క సర్వప్రతినిధి సభలో హిందీలో ప్రసంగించిన మొట్టమొదటి వ్యక్తిగా నిలిచాడు. 1979లో జనతా ప్రభుత్వం కూలిపోయే నాటికి వాజపేయి, స్వతంత్రంగా గౌరవప్రథమైన రాజకీయవేత్తగా, అనుభవజ్ఞుడైన నాయకునిగా ఎదిగాడు. వాజపేయి, జనసంఘ్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ల నుండి వచ్చిన తన సహచరులను, ముఖ్యంగా దీర్ఘకాల స్నేహితులైన ఎల్.కె.అద్వానీ, భైరాన్ సింగ్ షెకావత్ లను కలుపుకొని 1980 లో భారతీయ జనతా పార్టీని ఏర్పరచి, మొట్టమొదటి అధ్యక్షునిగా పనిచేసాడు. జనతా ప్రభుత్వం తర్వాత వచ్చిన ఇందిరా కాంగ్రెసు ప్రభుత్వానికి బలమైన విమర్శకునిగా అవతరించాడు. 1995 నవంబరులో ముంబాయిలో జరిగిన బి.జె.పి సమావేశంలో బి.జె.పి అధ్యక్షుడైన లాల్ కృష్ణ అద్వానీ వాజపేయిని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించాడు. 1996 మే నెలలో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో బి.జె.పి విజయం సాధించింది. వాజపేయి 1996 నుండి 2004 ల మధ్య మూడు పర్యాయాలు ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించాడు. వాజపేయి ప్రభుత్వం యేర్పడిన నెలరోజులలోనే ప్రోక్రాన్ అణు పరీక్షలు జగిపారు. ఢిల్లీ-లాహెూర్ బస్సును 1999 ఫిబ్రవరిలో ప్రారంభించారు. కార్గిల్ యుద్ధం, భారత్ పాకిస్తాన్ మధ్య మే - జూలై 1999 లో కాశ్మీర్ లోని కార్గిల్ జిల్లాలోను, మరికొన్ని సరిహద్దుల వద్దనూ జరిగింది. మూడవ దఫా పరిపాలనా కాలంలో అనేక దేశీయ ఆర్థిక, మౌలిక సంస్కరణలను చేపట్టాడు. వాటిలో ప్రైవేటు రంగాన్ని, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించాడు.

నేషనల్ హైవే డెవలప్‌మెంటు ప్రాజెక్టు", "ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన" వాజపేయి అభిమాన ప్రాజె క్టులు చేపట్టాడు. 2001 లో వాజపేయి ప్రభుత్వం, ప్రాథమిక, మాధ్యమిక విద్యాభివృద్ధి లక్ష్యంగా సర్వశిక్షా అభియాన్ అనే ప్రసిద్ధ కార్యక్రమాన్ని ప్రారంభించింది. 2005 డిసెంబర్ నెలలో వాజపేయి క్రియాశీల రాజకీయాలనుండి నిష్క్రమిస్తున్నట్లు ప్రకటించి, "ఇకనుండి లాల్ కృష్ణ అద్వానీ, ప్రమోద్ మహాజన్‌లు భారతీయ జనతా పార్టీకి రామలక్ష్మణుల వంటివారు" అని ప్రకటించాడు. భారతదేశ రాజ్యసభలో అప్పటి ప్రధాని డా.మన్మోహన్ సింగ్ తన ప్రసంగంలో వాజపే యిని రాజకీయ భీష్మునిగా అభివర్ణించాడు. అటల్ బిహారీ వాజ్‌పేయిని ఆయన శత్రువులు కూడా విమర్శించరు. 'అజాత శత్రువు, సర్వప్రియుడు, సర్వమాన్య' లాంటి ఉపమానాలను ఆయన పేరుతో జోడిస్తారు. అనారోగ్య కారణాలతో అటల్ జీ 2018 ఆగష్టు 16న మృతి చెందారు. ఆటల్ జీ జన్మదినమైన డిసెంబర్ 25 ను భారత ప్రభుత్వం సుపరి పాలనా దినంగా ప్రకటించింది.

# రోజూ గుడ్డు తింటే క్యాన్సర్ వస్తుందా?



గత కొన్ని రోజులుగా గుడ్ల గురించి సోషల్ మీడియాలో ఓ వార్త చక్కర్లు కొడుతుంది. కొన్ని బ్రాండ్ల గుడ్లలో నైట్రోఫ్యూరాన్ అనే నిషేధిత యాంటీబయాటిక్ అవశేషాలు అధికంగా ఉన్నాయని, ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని కలిగిస్తుందని చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా గుడ్ల గురించి సోషల్ మీడియాలో ఓ వార్త చక్కర్లు కొడుతుంది. కొన్ని బ్రాండ్ల గుడ్లలో నైట్రోఫ్యూరాన్ అనే నిషేధిత యాంటీబయాటిక్ అవశేషాలు అధికంగా ఉన్నాయని, ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని కలిగిస్తుందని చెబుతున్నారు. ఈ క్రమంలో ఖీూూా× ఈ విషయంపై కీలక ప్రకటన వెలువరించింది. ఈ ప్రకటనలో ఏముందో, గుడ్లు తినడం వల్ల నిజంగా క్యాన్సర్ వస్తుందో లేదో ఇక్కడ తెలుసుకుందాం.. గుడ్లు ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాల నిధి. వాటిలో విటమిన్ ఎ, బి12, డి, ఇ, ఐరన్, జింక్, కోలిన్ వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి కండరాలను బలోపేతం చేస్తాయి. అవి మంచి కంటి చూపును కాపాడుతాయి. ఎముకలను బలోపేతం చేస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అందుకే రోజుకు 1-2 గుడ్లు తినడం చాలా మందికి ప్రయోజనకరంగా ఉంటుంది. వైద్యుల అభిప్రాయం ప్రకారం, గుడ్లు పూర్తి ప్రోటీన్ మూలం. అవి కండరాలను నిర్మించడానికి, మెదడు ఆరోగ్యానికి, కళ్ళకు మంచివి. ఖీూూా× నివేదిక గుడ్లపై వస్తున్న పుకార్లను కొట్టిపారేసింది. ప్రతిరోజూ గుడ్లు తినడం వల్ల ఏ రకమైన క్యాన్సర్ రాదని స్పష్టం చేసింది. గుడ్లలో మెదడు, కాలేయానికి అవసరమైన కోలిన్ ఉంటుందని తెలిపింది. ఇది స్త్రీలు, పిల్లలకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. క్యాన్సర్ పుకార్ల కారణంగా భయపడాల్సిన అవసరం లేదని తెలిపింది. దేశంలో విక్రయిస్తున్న గుడ్లు పూర్తిగా సురక్షితమైనవని ఖీూూా× పేర్కొంది. గుడ్లు తినడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం లేదు. ఈ వాదనలు తప్పుదారి పట్టించేవి. వాటికి ఎలాంటి శాస్త్రీయ ఆధారం లేదు. ఖీూూా× ప్రకారం కోళ్ల ఉత్పత్తి, గుడ్ల ఉత్పత్తిలో నైట్రోఫ్యూరాన్ వాడకం పూర్తిగా నిషేధించబడింది. శాస్త్రీయ ఆధారాల ప్రకారం నైట్రోఫ్యూరాన్ తక్కువ మొత్తంలో తీసుకోవడం వల్ల క్యాన్సర్ లేదా ఏదైనా ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం లేదు. ఉడికించిన లేదా వేయించిన గుడ్లు ఎలా తీసుకున్నా మంచిదే. అయితే వేయించిన గుడ్లను తక్కువగా తినాలి. ఎందుకంటే గుడ్లు వేయించడానికి నూనెను ఉపయోగిస్తారు. ఉడికించిన కూరగాయలతో కలిపిన గుడ్లను తినడం ఎల్లప్పుడూ శరీరానికి మంచిది.

# టమోటాలు ఎక్కువగా తింటున్నారా?

టమోటాలను చాలా మంది ఇష్టంగా తింటారు.. కూరగా అలాగా చట్నీగా తింటారు.. అలాగే.. పప్పుతోపాటు అనేక రకాల వంటల్లో టామాటాలను వేస్తారు.. ఇవి కూర రుచిని మరింత పెంచుతాయి.. అయితే.. టమోటాలు అధికంగా తీసుకోవడం వల్ల మీ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని, కొన్ని ఆరోగ్య సంబంధిత సమస్యలను ఎదుర్కోవలసి రావచ్చని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.. టమోటాలు పోషకాలతో నిండి ఉంటాయి. టమోటాల్లోని విటమిన్లు, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు ఆరోగ్యంగా ఉండేందుకు సహాయపడతాయి.. కానీ టామాటలను ఎక్కువగా తీసుకోవడం వల్ల మీ ఆరోగ్యంపై సానుకూల ప్రభావాలకు బదులుగా ప్రతికూల ప్రభావాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.. అదుకే.. కొంతమంది టమోటాలను నివారించాలని కూడా సలహా ఇస్తారు. ఎక్కువ టమోటాలు తినడం వల్ల పేగు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఆమ్లత్వం - ఉబ్బరం వంటి కడుపు సమస్యలను నివారించడానికి.. పరిమితుల్లో టమోటాలు తినాలని సూచిస్తున్నారు. టమోటాలు ఎక్కువగా తినే వ్యక్తులు ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ లక్షణాలను అనుభవించవచ్చు. ఇంకా, టమోటాలు ఆమ్లత్వం, గుండెల్లో మంట వంటి సమస్యలను కూడా కలిగిస్తాయి. మీకు ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ ఉంటే, మీరు టమోటాలు తినకుండా ఉండాలి. మీకు ఎసిడిటీ, గుండెల్లో మంట ఉంటే టమోటాలు తినకుండా ఉండటం కూడా మంచిది. వాస్తవానికి టమోటాలు ఆమ్ల స్వభావం కలిగి ఉంటాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, టమోటాలను పెద్ద పరిమాణంలో తీసుకోవడం వల్ల



మూత్రాశయ చికాకు వస్తుంది. మీరు అలాంటి సమస్యలతో బాధపడకూడదనుకుంటే, టమోటాలను ఎక్కువగా తినడం మానుకోండి.. లేకుంటే మీరు తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది. టమోటాలు సరైన పరిమాణంలో, సరైన పద్ధతిలో తీసుకుంటేనే అవి మీ ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటాయి.టమోటా గింజలు కిడ్నీలో రాళు ఏర్పడే ప్రమాదాన్ని పెంచుతాయి. అందుకే కిడ్నీలో రాళ్లు ఉన్నవారు టమోటాలకు దూరంగా ఉండటం మంచిది. ఇంకా, పెద్ద మొత్తంలో టమోటాలు తినడం వల్ల అలెర్జీ ప్రతిచర్యలు కూడా వస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే.. ఏదైనా మితంగా తీసుకుంటే మంచిదని.. ఎక్కువగా తీసుకుంటే హాని తప్పదంటూ పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు.. ఏమైనా అనారోగ్య సమస్యలుంటే వైద్యులను సంప్రదించడం మంచిది.

# సులువుగా బరువు తగ్గాలా?

నేటి కాలంలో అనారోగ్యకరమైన ఆహారం, నిశ్చల జీవనశైలి కారణంగా బరువు పెరగడం సర్వసాధారణమైపోయింది. దీంతో బరువు తగ్గడం, ఫిట్‌గా, స్లిమ్‌గా మారడం చాలా మందికి సవాలుగా మారింది. అయితే ఇవన్నీ ప్రయత్నించినప్పటికీ బరువు తగ్గడం లేదని చాలా మంది ఫిర్యాదు చేస్తుంటారు. నేటి కాలంలో అనారోగ్యకరమైన ఆహారం, నిశ్చల జీవనశైలి కారణంగా బరువు పెరగడం సర్వసాధారణమైపోయింది. దీంతో బరువు తగ్గడం, ఫిట్‌గా, స్లిమ్‌గా మారడం చాలా మందికి సవాలుగా మారింది. అయితే ఇవన్నీ ప్రయత్నించినప్పటికీ బరువు తగ్గడం లేదని చాలా మంది ఫిర్యాదు చేస్తుంటారు. ఇదేవిధంగా మీరు కూడా బరువు తగ్గడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారా? అయితే మీ ఉదయం దినచర్యలో ఈ కింది కొన్ని అలవాట్లను అలవాటు చేసుకుంటే చాలు.. సులువుగా బరువు తగ్గిపోతారు. ఉదయం నిద్రలేచిన వెంటనే ఒకటి నుంచి రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లు తాగాలి. ఈ అలవాటు శరీర జీవక్రియను సక్రియం చేస్తుంది. నిర్జలీకరణాన్ని తొలగిస్తుంది. గోరువెచ్చని నీళ్లు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. శరీరం నుంచి విషాన్ని బయటకు పంపుతుంది. జీవక్రియ రేటును పెంచుతుంది. నీటిలో నిమ్మరసం, తేనె, చిన్న అల్లం ముక్కను కూడా జోడించవచ్చు. ఇది కొవ్వును కరగతీసే ప్రక్రియను వేగవంతం చేయడంలో సహాయపడుతుంది. విటమిన్ డి పొందడానికి ఉదయం ఎండలో కొంత సమయం గడపడం చాలా అవసరం. అంతేకాకుండా కనీసం 15-20 నిమిషాలు ఎండలో గడపడం వల్ల శరీర సిర్కాడియన్ లయను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది జీవక్రియ, ఆకలిని నియంత్రించే హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. ఇది రోజంతా శక్తి స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుంది. అనారోగ్యకరమైన ఆహారాల తినాలనే కోరికలను తగ్గిస్తుంది. ఇది బరువు తగ్గడానికి మీకు సహాయపడుతుంది. ఉదయం అల్పాహారం రోజులో అతి ముఖ్యమైన భోజనం. ప్రోటీన్ అధికంగా ఉండే అల్పాహారం బరువు తగ్గడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రోటీన్ ఎక్కువసేపు ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది రోజంతా అనారోగ్యకరమైన చిరుతిండిని తగ్గిస్తుంది. గుడ్లు, పెరుగు, జున్ను, చిక్కుళ్ళు వంటి ఆహారాలను మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కండరాలు బలపడతాయి. జీవక్రియ పెరుగుతుంది. ఉదయం వ్యాయామం చేయడం వల్ల శరీర జీవక్రియ పెరుగుతుంది. జాగింగ్, సైక్లింగ్, స్కిప్పింగ్, సూర్య నమస్కారం, కపలాభతి ప్రాణాయామం వంటి తేలికపాటి యోగాసనాలు, కార్డియో వ్యాయామాలు కొవ్వును కరిగించడంలో చాలా ప్రభావవంతంగా ఉంటాయి. అలాగే ఈ ఉదయం అలవాట్లు మిమ్మల్ని రోజంతా చురుకుగా ఉంచుతాయి.



# కలోంజి ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదిలిపెట్టరు



కలోంజి లేదా నల్ల జీలకర్ర గింజలు నల్లగా.. చూడటానికి పరిమాణంలో చిన్నగా ఉండవచ్చు.. కానీ దాని ప్రయోజనాలు అపారమైనవి. రోగనిరోధక శక్తిని పెంచడం నుండి గుండె, జీవక్రియ, వాపును నియంత్రించడం వరకు, ఇది శరీరానికి అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుస్తుందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. మన వంటగదిలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్న అనేక పదార్థాలు, దినుసులు ఉంటాయి.. అలాంటి వాటిలో.. కలోంజి (నల్ల జీలకర్ర లేదా నిగెల్లా గింజలు) ఒకటి..

కలోంజి శతాబ్దాలుగా ఆయుర్వేదంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయి. ఇది అసాధారణంగా అనిపించినప్పటికీ, దానిలో దాగి ఉన్న ఔషధ గుణాలు దీనిని సూపర్‌ఫుడ్‌గా చేస్తాయి. హెల్త్‌లైన్ ప్రకారం, ఈ నల్ల గింజలలోని బయోయాక్టివ్ సమ్మేళనాలు, యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని అనేక తీవ్రమైన వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడతాయి. అలాగే.. కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం నుండి రోగనిరోధక శక్తిని పెంచడం, మంటను తగ్గించడం వరకు దీని ప్రయోజనాలు ఉంటాయి. కలోంజి గింజల్లో లభించే సమ్మేళనాలు యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటాయి. కొన్ని శాస్త్రీయ అధ్యయనాలు సాధారణ మందులకు స్పందించని బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా నల్ల గింజలు ప్రభావవంతంగా ఉన్నాయని చూపించాయి. హెల్త్‌లైన్ ప్రకారం, సరైన మొత్తంలో తీసుకుంటే.. ఇది ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి, శరీరం రోగనిరోధక రక్షణను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. నల్లగా ఉండే కలోంజి గింజల్లో థైమోక్వినోన్, కార్వాక్రోల్, టి-అనెథోల్, 4-టెర్పినోల్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ సమ్మేళనాలు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడంలో సహాయపడతాయి. ఫ్రీ రాడికల్స్ కణాలను దెబ్బతీస్తాయి.. క్యాన్సర్, గుండె జబ్బులు, అకాల వృద్ధాప్యం వంటి దీర్ఘకాలిక సమస్యలకు దారితీయవచ్చు. ఈ రాడికల్స్ వల్ల కలిగే ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి ఈ గింజలు సహాయపడతాయి. నల్ల జీలకర్రలోని కొన్ని సమ్మేళనాలు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించవచ్చని, కొన్ని సందర్భాల్లో వాటిని తొలగించవచ్చని అధ్యయనాలు చూపించాయి. దీని యాంటీఆక్సిడెంట్, బయోయాక్టివ్ సమ్మేళనాలు క్యాన్సర్ కణాల వ్యాప్తిని (మెటాస్టాసిస్) నెమ్మదిస్తాయి. భవిష్యత్తులో క్యాన్సర్ నివారణలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో దీర్ఘకాలికంగా వాపు అనేది మధుమేహం, గుండె జబ్బులు, ఆర్థరైటిస్ వంటి అనేక వ్యాధులకు మూల కారణం. నల్ల జీలకర్రలోని శోథ నిరోధక లక్షణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. దీన్ని క్రమం తప్పకుండా.. మితంగా తీసుకోవడం వల్ల శరీరంలో కొనసాగుతున్న శోథ ప్రక్రియను నియంత్రించడంలో సహాయపడుతుంది. కలోంజీ కొలెస్ట్రాల్‌ను మాత్రమే కాకుండా రక్తంలో చక్కెర స్థాయిలను కూడా సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. కొన్ని పరిశోధనలు ఇది కాలేయ ఆరోగ్యానికి మద్దతు ఇస్తుందని.. జీవక్రియ సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడుతుందని సూచిస్తున్నాయి. డయాబెటిస్ - ఫ్యాటీ లివర్ వంటి పరిస్థితులకు ఇది సహాయక ఆహారంగా కూడా పనిచేస్తుంది. మీరు నల్ల జీలకర్ర గింజలను కూరగాయలు, పప్పులు, సలాడ్లు లేదా పిండితో కలిపి తినవచ్చు. కొంతమంది ఉదయం ఖాళీ కడుపుతో విత్తనాలను నమలడం లేదా దాని నూనెను తీసుకోవడం కూడా చేస్తారు. రాత్రి పూట నీటిలో నానబెట్టి.. ఉదయాన్నే తినవచ్చు.. అలాగే.. ఆ నీటిని తాగవచ్చు.. అయితే, మరేదైనా పదార్థాల మాదిరిగానే, దీనిని మితంగా, అవసరమైతే వైద్యుడి సలహా మేరకు తీసుకోవడం మంచిది.



# అత్యంత అరుదైన పింక్ డైమండ్

ఆమె ఒక ప్రముఖ వ్యాపారవేత్త భార్య మాత్రమే కాదు, ప్రపంచ వేదికలపై భారతీయ ఫ్యాషన్ కు దిక్సూచిలా నిలిచే గ్లోబల్ ఐకాన్. సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసే ఫోటోలు క్షణాల్లో వైరల్ అవుతుంటాయి. అయితే తాజాగా ఒక వేడుకలో ఆమె ధరించిన ఒక చిన్న. ఆమె ఒక ప్రముఖ వ్యాపారవేత్త భార్య మాత్రమే కాదు, ప్రపంచ వేదికలపై భారతీయ ఫ్యాషన్ కు దిక్సూచిలా నిలిచే గ్లోబల్ ఐకాన్. సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసే ఫోటోలు క్షణాల్లో వైరల్ అవుతుంటాయి. అయితే తాజాగా ఒక వేడుకలో ఆమె ధరించిన ఒక చిన్న ఉంగరం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఆ ఉంగరంలో మెరుస్తున్న పింక్ డైమండ్ చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ఎందుకంటే అది సాదాసీదా వజ్రం కాదు.. ప్రపంచంలోనే అత్యంత అరుదైన వజ్రాలలో ఒకటి. ఇంతకీ ఆ వజ్రం ప్రత్యేకత ఏంటి? ఆ సోషల్ మీడియా సెన్సేషన్ ఎవరు? వజ్రాలన్నింటిలోనూ పింక్ డైమండ్స్ చాలా అరుదుగా లభిస్తాయి. ఆస్ట్రేలియాలోని ఆర్గిల్ గని మూతపడిన తర్వాత వీటి లభ్యత మరింత తగ్గిపోయింది. తాజాగా ఈ స్టార్ సెలబ్రిటీ వేలికి మెరుస్తున్న ఈ వజ్రం దాదాపు 10 క్యారెట్ల కంటే ఎక్కువ బరువు ఉంటుందని అంచనా. దీని రంగు, స్వచ్ఛత పరంగా చూస్తే ఇది అత్యంత నాణ్యమైన వజ్రంగా నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక క్యారెట్ పింక్ డైమండ్ ధర కోట్లలో ఉంటుంది. అంటే ఈ ఉంగరం ధర ఊహకందని స్థాయిలో ఉంటుందని స్పష్టమవుతోంది. కేవలం ఉంగరమే కాదు, ఆమె ధరించే ప్రతి వస్తువులోనూ ఒక ప్రత్యేకత ఉంటుంది. విదేశీ పర్యటనల్లో ఆమె వేసుకునే దుస్తులు, చేతిలో ఉండే బ్యాగులు అన్నీ ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్లకు చెందినవే. లండన్, ముంబై నగరాల్లో విలాసవంతమైన భవంతుల్లో నివసించే ఈమె, బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు అందరితోనూ మంచి స్నేహసంబంధాలను కలిగి ఉంటుంది. ఫ్యాషన్ ప్రపంచంలో ఆమెను 'క్వీన్ ఆఫ్ లగ్జరీ' అని పిలుచుకోవడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. ప్రపంచాన్ని తన ఫ్యాషన్ తో ఆకట్టుకుంటున్న ఆ సెలబ్రిటీ మరెవరో కాదు.. సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధినేత అదర్ పూనావాలా భార్య నటాషా పూనావాలా! రీసెంట్‌గా ఆమె షేర్ చేసిన ఫోటోల్లో ఈ పింక్ డైమండ్ రింగ్ హైలైట్‌గా నిలిచింది. ఈ ఉంగరం ధర కొన్ని వందల కోట్లలో ఉండవచ్చని సమాచారం. గతంలో జరిగిన హాంకాంగ్ వేలంలో ఇలాంటి పింక్ డైమండ్ రింగ్ దాదాపు రూ. 580 కోట్లకు అమ్ముడైందంటే, నటాషా దగ్గర ఉన్న ఈ వజ్రం విలువ ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అరుదైన వజ్రాలను సేకరించడం నటాషా పూనావాలాకు ఉన్న అభిరుచుల్లో ఒకటి. ఈ పింక్ డైమండ్ రింగ్ ఆమె రాయల్ కలెక్షన్‌లో మరో మణిహారంగా చేరింది. ఏది ఏమైనా, ఆమె ఫ్యాషన్ సెన్స్ మరియు ఆ విలాసవంతమైన జీవనశైలి చూసి నెటిజన్లు ముక్కున వేలేసుకుంటున్నారు!

# విజయ్ హజారే ట్రోఫీలో కోహ్లీ సూపర్ సెంచరీ.. ఢిల్లీ ఘన విజయం

**299 పరుగుల లక్ష్యాన్ని కేవలం 37.4 ఓవర్లలోనే చేధించిన ఢిల్లీ**

**101 బంతుల్లో 131 పరుగులతో కోహ్లీ మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్**

**లిస్ట్-ఏ క్రికెట్‌లో 16,000 పరుగుల ఘనత అందుకున్న విరాట్**

**రికీ భుయ్ శతకం వృథా**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ మరోసారి సత్తా చాటాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్రప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 101 బంతుల్లో 131 పరుగులు చేసి ఢిల్లీ జట్టుకు అద్భుత విజయానికి అందించాడు. 299 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ కేవలం 37.4 ఓవర్లలోనే చేధించి, నాలుగు వికెట్లతో తేడాతో ఆంధ్ర జట్టును ఓడించింది. దాదాపు 15 ఏళ్ల తర్వాత దేశవాళీ క్రికెట్ బరిలోకి దిగిన కోహ్లీ, ఈ క్లాస్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు.

కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, మూడు సిక్సులు ఉన్నాయి. ఇక, మ్యాచ్ ఆరంభంలో ప్రియాంశ్ ఆర్య 44 బంతుల్లో 74 పరుగులతో వేగంగా స్కోరు పెంచాడు. ఆ తర్వాత నితీశ్ రాణా 55 బంతుల్లో 77 పరుగులు చేసి లక్ష్య చేధనను సులభతరం చేశాడు. అయితే, కెప్టెన్ రిషభ్ పంత్ మాత్రం 5 పరుగులకే ఔటై నిరాశపరిచాడు.కాగా, ముందుగా బ్యాటింగ్ చేసిన ఆంధ్రప్రదేశ్ 50 ఓవర్లలో 298/8 పరుగులు చేసింది. రికీ భుయ్ శతకం బాదాడు. ఢిల్లీ బౌలర్లలో సిమర్జీత్ సింగ్ ఐదు వికెట్లు తీశాడు. మొత్తం మీద కోహ్లీ అద్భుత ప్రదర్శన ఈ మ్యాచ్‌కు హైలైట్‌గా నిలిచింది.ద

**లిస్ట్-ఏ క్రికెట్‌లో 16,000 పరుగుల ఘనత**

కోహ్లీ ఈ సూపర్ ఇన్నింగ్స్‌తో లిస్ట్-ఏ క్రికెట్‌లో 16,000 పరుగుల మైలురాయిని కూడా అందుకున్నాడు. 16,000 పరుగుల ఘనతతో కోహ్లీ లిస్ట్-ఏ క్రికెట్‌లో సచిన్ టెండూల్కర్ తర్వాత ఈ మైలురాయిని చేరుకున్న రెండవ భారతీయ ఆటగాడిగా నిలిచాడు. తన 330వ ఇన్నింగ్స్‌లో ఈ మైలురాయిని సాధించాడు. టెండూల్కర్ 391 ఇన్నింగ్స్‌లలో ఈ మైల్‌స్టోన్‌ను అందుకున్నాడు. అలాగే 37 ఏళ్ల కోహ్లీ ఓవరాల్‌గా ఈ మైలురాయిని చేరిన తొమ్మిదవ ఆటగాడిగా నిలిచాడు. ఈ జాబితాలో సచిన్, రికీ పాంటింగ్, కుమార్ సంగక్కర, సర్ వివియన్ రిచర్డ్స్ వంటి క్రికెట్ దిగ్గజాలు ఉన్నారు.

# విజయ్ హజారే ట్రోఫీలో అదరగొట్టిన రోహిత్ శర్మ.. సిక్కింపై ముంబై విజయం

**ఎనిమిది వికెట్ల తేడాతో ముంబై విజయం**

**237 పరుగుల లక్ష్యాన్ని 30 ఓవర్లలో ఛేదించిన ముంబై**

**94 బంతుల్లో 155 పరుగులు చేసిన రోహిత్ శర్మ**



**హైదరాబాద్ పెన్ పవర్:** విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా జైపూర్ వేదికగా సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ముంబై ఆటగాడు రోహిత్ శర్మ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. తొలుత బ్యాటింగ్ చేసిన సిక్కిం నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ముంబై 30 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 237 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది.రోహిత్ శర్మ 94 బంతుల్లో 155 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతడు తన ఇన్నింగ్స్‌లో 18 ఫోర్లు, 9 సిక్సులు బాదాడు. ముంబై కెప్టెన్ శార్దూల్ పటేల్ రెండు వికెట్లు తీశాడు. రోహిత్‌తో కలిసి అంగ్‌క్రిష్ రఘువంశీ 38 పరుగులు చేసి జట్టు విజయంలో సహకరించాడు. ముషీర్ ఖాన్, సర్ఫరాజ్ ఖాన్ సోదరులు ముంబైని విజయతీరాలకు చేర్చారు. సిక్కిం బ్యాటర్లలో ఆశిష్ (87 బంతుల్లో 8 ఫోర్లుతో 79 పరుగులు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కె.సాయి సాత్విక్ (34), క్రాంతి కుమార్ (34), రాబిన్ లింబో (31 నాటౌట్)లు తమవంతు సహకారం అందించారు. రోహిత్ శర్మ ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో ప్రేక్షకులు 'ముంబై రాజా' అంటూ నినాదాలు చేశారు. రోహిత్ శర్మను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

# చరిత్రలో తొలిసారి.. వన్డేల్లో 574 రన్స్.. బీహార్ బ్యాటర్ల విధ్వంసం!

**లిస్ట్-ఏ క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన బీహార్ జట్టు**

**అరుణాచల్ ప్రదేశ్‌పై 50 ఓవర్లలో 574 పరుగుల భారీ స్కోరు**

**14 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీ 84 బంతుల్లో 190 పరుగులు**

**ఏబీ డివిలియర్స్ ఫాస్టెస్ట్ 150 రికార్డును బద్దలుకొట్టిన వైభవ్**

**కెప్టెన్ సాకిబుల్ గనీ 32 బంతుల్లోనే ఫాస్టెస్ట్ సెంచరీ**

**తమిళనాడు పేరిట ఉన్న 506 పరుగుల రికార్డు బద్దలు**

**హైదరాబాద్ పెన్ పవర్**క్రికెట్ చరిత్రలో కనీవినీ ఎరుగని, అసాధ్యమనుకున్న ఓ అద్భుతం ఆవిష్కృతమైంది. భారత దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో బీహార్ జట్టు సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. బుధవారం రాంచీలోని జేఎస్‌సీఏ ఓవల్ మైదానంలో అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో బీహార్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి ఏకంగా 574 పరుగుల భారీ స్కోరు సాధించింది. లిస్ట్-ఏ (అంతర్జాతీయ, దేశవాళీ వన్డేలు) క్రికెట్ చరిత్రలో ఇదే అత్యధిక జట్టు స్కోరు కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో బీహార్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించగా, పలు అరుదైన రికార్డులు బద్దలయ్యాయి.

**14 ఏళ్ల కుర్రాడి ప్రళయం.. ఏబీడీ రికార్డు బద్దలు**

ఈ మ్యాచ్‌లో అసలైన విధ్వంసం సృష్టించింది 14 ఏళ్ల యువ సంచలనం, ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ. కేవలం 84 బంతుల్లో 16 ఫోర్లు, 15 సిక్సర్లతో 190 పరుగులు చేసి అరుణాచల్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ క్రమంలో కేవలం 36 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసిన వైభవ్, లిస్ట్-ఏ క్రికెట్‌లో భారత ఆటగాళ్లలో రెండో వేగవంతమైన శతకాన్ని నమోదు చేశాడు. అంతటితో ఆగకుండా, కేవలం 54 బంతుల్లో 150 పరుగుల మార్కును అందుకుని ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు ఈ రికార్డు దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్ (64 బంతులు) పేరిట ఉండేది. తన అద్భుత ఇన్నింగ్స్‌తో వైభవ్ ఆ రికార్డును బద్దలుకొట్టాడు.

**కెప్టెన్ మెరుపు సెంచరీ.. కొనసాగిన విధ్వంసం**

వైభవ్ సృష్టించిన విధ్వంసాన్ని కెప్టెన్ సాకిబుల్ గనీ మరో స్థాయికి తీసుకెళ్లాడు. ఆఖరి ఓవర్లలో



మెరుపులు మెరిపించిన గనీ, కేవలం 40 బంతుల్లోనే 10 ఫోర్లు, 12 సిక్సర్లతో 128 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ క్రమంలో అతను కేవలం 32 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి, లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యంత వేగంగా శతకం బాదిన భారత ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. గతంలో ఈ రికార్డు అన్మోల్‌ప్రీత్ సింగ్ (35 బంతులు) పేరిట ఉండేది. వీరితో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ ఆయుష్ లోహరుక (56 బంతుల్లో 116), పియూష్ కుమార్ సింగ్ (66 బంతుల్లో 77) కూడా రాణించడంతో బీహార్ జట్టు ఈ చారిత్రక స్కోరును అందుకుంది.

**బద్దలైన పాత రికార్డు**

ఈ మ్యాచ్‌లో బీహార్ జట్టు 574 పరుగులు చేయడం ద్వారా లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యధిక స్కోరు రికార్డును తన పేరిట లిఖించుకుంది. ఇంతకుముందు ఈ రికార్డు తమిళనాడు పేరిట ఉండేది. 2022లో అరుణాచల్ ప్రదేశ్‌పైనే తమిళనాడు జట్టు 2 వికెట్ల నష్టానికి 506 పరుగులు చేసింది. ఇప్పుడు ఆ రికార్డును బీహార్ అధిగమించింది. మొత్తంగా ఈ ఇన్నింగ్స్‌లో బీహార్ బ్యాటర్లు 49 ఫోర్లు, 38 సిక్సర్లు బాదారంటే వారి ఆధిపత్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ చారిత్రక ప్రదర్శనతో బీహార్ జట్టు, ముఖ్యంగా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ, దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించారు.



పింక్ లెహంగా ఫోటోషూట్‌లో ప్రియాంక మోహన్ సొగసును ప్రసరింపజేసింది

# ఛాంపియన్ బ్యూటీ క్లిక్కయితే..?

టాలీవుడ్ యంగ్ హీరో రోషన్ మేక లీడ్ రోల్ లో రూపొందిన ఛాంపియన్ మూవీ మరికొన్ని గంటల్లో విడుదల అవ్వనున్న విషయం తెలిసిందే. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఆ సినిమాలో మాలీవుడ్ బ్యూటీ అనస్వర రాజన్ హీరోయిన్ గా నటిస్తున్నారు. తెలుగులోకి ఆ మూవీతోనే ఎంట్రీ ఇవ్వడం విశేషం.

అయితే ఇప్పటికే మలయాళంలో అనేక సినిమాల్లో నటించిన అమ్మడు.. కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో నిలిచారు. ఇంకా తెలుగు డెబ్యూ మూవీ రిలీజ్ అవ్వకుండానే ఫ్యాన్ బేస్ సొంతం చేసుకున్నారు. ఛాంపియన్ ప్రమోషన్స్ లో సందడి చేస్తూ.. అందరి దృష్టిని తన వైపునకు తిప్పుకున్నారు.ముఖ్యంగా టీజర్, ట్రైలర్ అదిరిపోవడంతో అంతా అనస్వర రాజన్ కోసం ఇప్పుడు మాట్లాడుకుంటున్నారు. ఛాంపియన్ మూవీ క్లిక్ అవుతున్నట్లు కనిపిస్తుండడంతో.. బ్యూటీకి మంచి అవకాశాలు వస్తాయామోనని అంచనా వేస్తున్నారు. సినిమా రిలీజ్ అయ్యాక ఆమెకు ఆఫర్స్ కచ్చితంగా వస్తాయని చెబుతున్నారు.అందం, అభినయం సమపాళ్లలో ఉన్న అనస్వర రాజన్.. తెలుగులో స్టార్ హీరోయిన్ గా మారే ఛాన్స్ ఉందని కామెంట్లు పెడుతున్నారు. అయితే వరుస హిట్స్ కానీ పడితే.. అనస్వర రాజన్ కెరీర్ లో బిగ్ బూస్టింగ్ అనే చెప్పాలి. రీసెంట్ గా రామ్ చరణ్ కూడా ఆమెలో మ్యాజిక్ ఉందన్న విషయం తెలిసిందే.కాగా.. 2017లో విడుదలైన ఉదాహరణం సుజాత మూవీతో అనస్వర మాలీవుడ్ లో తన కెరీర్ ను స్టార్ట్ చేశారు. తొలి సినిమాతోనే తన యాక్టింగ్ తో ఆకట్టుకున్నారు. ఆ తర్వాత వరుసగా అవకాశాలు అందుకుని.. విభిన్నమైన



పాత్రలు ఎంచుకుంటూ ముందుకు సాగిన అనస్వర రాజన్.. మంచి పేరు సంపాదించుకున్నారు.కోర్ట్ రూమ్ డ్రామా మూవీ నేరులో చూపు లేని యువతిగా, లైంగిక దాడికి గురైన బాధితురాలిగా యాక్టింగ్ తో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. రేఖా చిత్రం మూవీతో నటిగా మరో మెట్టు ఎక్కారు. సూపర్ శరణ్య మూవీతో అందరినీ మెప్పించారు. ఓటీటీ ద్వారా తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలయ్యారు.

దీంతో ఇప్పుడు ఛాంపియన్ తో వెంటనే అట్రాక్ట్ చేశారు. ప్రమోషనల్ కంటెంట్ తో మరింత దగ్గరయ్యారు. ముఖ్యంగా గిర గిర పాటతో యువ ప్రేక్షకులకు మదిలో స్థానం సంపాదించుకున్నారు. ఇండస్ట్రీలో హీరోయిన్ల కొరత ఎప్పుడూ ఉండేదే. హిట్స్ వచ్చిన వాళ్ళు బిజీ అవుతున్నారు. ఇక నటనతో ఆకట్టుకుంటే ఛాంపియన్ అమ్మాయి క్లిక్కయినట్లే. మరి ఛాంపియన్ తో ఎలా మెప్పిస్తారో.. ఎలాంటి ఛాన్స్ లు అందుకుంటారో.. ఎంతటి పొజిషన్ కు చేరుకుంటారో వేచి చూడాలి.



రూమా శర్మ సిటీ స్టైలెన్‌కి వ్యతిరేకంగా స్టైల్ మరియు పోయిస్‌ని ప్రదర్శించింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965